1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 4
సంచిక : 2
పుటలు : 52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

ఏప్రిల్ 2018



భారతీయ భాషలను పరిరక్షించుకోవాలని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్.ఎస్.ఎస్) అఖిల భారతీయ ప్రతినిధి సభ తీర్మానించింది. దేశంలోని అన్ని ప్రభుత్వాలకు, స్వచ్ఛంద-ధార్మిక-విద్యాసంస్థలకు, జన మాధ్యమాలకు, మేధావులకు-అందరికీ స్పష్టంగా సవివరంగా పిలుపు ఇచ్చింది.

సర్ సంఘచాలక్ మోహన్ భాగవత్, సర్ కార్యవాహ భయ్యాజీ జోషి




దేశమంతటా, రాష్ట్రాలలోనూ
మాతృభాషా హక్కులను కాపాడుకోవడానికి ఉద్యమం
అన్ని స్థాయిలలో జరగాలని, బెంగుళూరు ప్రకటన
స్పష్టమైన కార్యక్రమాన్ని ముందుకు తెచ్చింది.
2015లో చెన్నై నుంచి 2016లో ఢిల్లీ నుంచి
కదిలిన ప్రయత్నం
ఫిబ్రవరి 21న బెంగుళూరులో బలంగా ముందడుగు వేసింది.
'భాషాసమానత, హక్కుల ప్రచార సంస్థ' ఆవిర్భవించింది.



1982లో తిరుపతిలో
తెలుగుదేశం పార్టీ
ప్రకటించిన
తెలుగు భాషావిధానాన్ని
తుంగలో తొక్కిన
పార్టీ వైఖరినీ, ప్రభుత్వ నిర్లక్ష్యాన్నీ
ఎండగడుతూ
తిరుపతినుండే మొదలైన
సరికొత్త
ఉద్యమ కార్యక్రమం

## ఆర్ఎస్ఎస్ చెప్పింది సరే; భాజపా చేస్తుందా? చెయ్యగలదా??

# భారతీయ భాషలను కాపాడుకోవాలని, పెంపొందించుకోవాలని ఆర్.ఎస్.ఎస్. పిలుపు



'భారతీయ భాషలను పరిరక్షించుకోవాలి' అని 2018 మార్చి 9–11 లలో నాగపూర్‌లో జరిగిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అఖిలభారతీయ ప్రతినిధిసభ తీర్మానించింది. ఆ మేరకు దేశంలోని అన్ని ప్రభుత్వాలకు; స్వచ్ఛంద ధార్మిక విద్యా సంస్థలకు; ప్రచార ప్రసార మాధ్యమాలకు; మేధావులకు – అందరికీ స్పష్టంగా సవివరంగా పిలుపు ఇచ్చింది. ఆ తీర్మానపు పూర్తి పాఠం ఇది :

"భాష ఒక సంస్కృతి; వ్యక్తి, సమాజపు అస్తిత్వానికి, భావ వ్యక్తీకరణకు ప్రధాన వాహకం అని అఖిలభారతీయ ప్రతినిధి సభ భావిస్తోంది. మన సంస్కృతి, సంప్రదాయాలు, అద్భుతమైన జ్ఞాన సంపద, అపారమైన సాహిత్యాన్ని పరిరక్షించుకోవడంలో, అలాగే సృజనాత్మక ఆలోచనను పెంపొందించడంలో దేశంలోని వివిధ భాషలు, మాండలీకాలు చాలా ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. మనదేశంలో వివిధ భాషలలోని పాటలు, సామెతలు, గిరిజన గీతాలు మొదలైన మౌఖిక జ్ఞాన సంపద లిఖితపూర్వక సాహిత్యం కంటే ఎన్నో రెట్లు ఎక్కువ.

కానీ భారతీయ భాషల వినియోగం క్రమంగా తగ్గిపోవడం, అనేక పదాల స్థానంలో విదేశీ భాషా పదాలు వచ్చి చేరడం వంటివి ప్రమాదకరమైన సవాళ్ళుగా మారుతున్నాయి. నేడు అనేక భాషలు, మాండలీకాలు కనుమరుగయ్యాయి, మరికొన్ని అవసానదశలో ఉన్నాయి. కనుక దేశంలోని వివిధ భాషలు, మాండలీకాలను పరిరక్షించడానికి, ప్రోత్సహించడానికి ప్రభుత్వాలు, విధాన నిర్ణేతలు, సమాజం, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలని అఖిలభారతీయ ప్రతినిధిసభ భావిస్తోంది. ఈ విషయంలో క్రింది చర్యలను చేపట్టాలి.

1. ప్రాథమిక విద్య మాతృభాష లేదా ఏదైనా భారతీయ భాషలోనే బోధింపబడాలి. దీనికోసం విద్యార్థుల తల్లిదండ్రులు మానసికంగా సిద్ధమవ్వాలి. అలాగే ప్రభుత్వాలు కూడా అందుకు అవసరమైన విధివిధానాలను రూపొందించాలి.

2. సాంకేతిక మరియు వైద్య విద్యతో సహా అన్ని రకాల విద్యలకు భారతీయ భాషలలో ఉన్నతవిద్యాబోధన, వాచకాలు, పరీక్ష మాధ్యమాలు అందుబాటులో ఉండాలి .

3. యు.పి.ఎస్.సి. నిర్వహించే నీట్ పరీక్షను అన్ని భారతీయ భాషలలోనూ వ్రాసేందుకు వీలుకల్పించడం స్వాగతించదగ్గ పరిణామం. ఇలాగే మిగిలిన అన్ని పరీక్షలను కూడా ఇదే విధంగా భారతీయ భాషలన్నింటిలోనూ వ్రాసే ఏర్పాటు చెయ్యాలి.

4. అన్ని ప్రభుత్వ, న్యాయ సంబంధ వ్యవహారాల్లో భారతీయ భాషలకి ప్రాధాన్యం ఇవ్వాలి. దీనితోపాటు అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యకలాపాలలో ఆంగ్లానికి బదులు భారతీయ భాషల వాడకానికే ప్రాధాన్యతనివ్వాలి.

5. స్వయంసేవకులతో సహా సమస్త ప్రజానీకం తమ మాతృభాషకి ప్రాధాన్యత ఇవ్వాలి. మాతృభాషలోనే దైనందిన వ్యవహారాలు, సంభాషణలు జరిగేటట్లు శ్రద్ధ వహించాలి. ఈ భాషలలో సాహిత్యాన్ని సేకరించడం, చదవడం అలవరుచుకోవాలి. అలాగే స్థానిక కళలు, సంగీతం వంటి వాటిని ప్రోత్సహించాలి.

6. పరంపరాగతంగా మనదేశంలో భాష అనేది సమస్త సమాజాన్ని కలిపి ఉంచే బంధం కనుక తమ మాతృభాష పట్ల అభిమానాన్ని కలిగిఉంటూనే ఇతరభాషల పట్ల గౌరవం కలిగి ఉండాలి.

7. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దేశంలోని అన్ని భాషలు, మాండలీకాలను ప్రోత్సహించే విధంగా చర్యలు చేపట్టాలి.

అఖిలభారతీయ ప్రతినిధి సభ, జ్ఞాన సముపార్జన కోసం ప్రపంచంలోని అన్ని భాషలను నేర్చుకోవడంలో తప్పులేదని భావిస్తోంది. అయితే బహుభాషా దేశమైన భారత్ లో, సంస్కృతి వాహకమైన భాషలను కాపాడడం, ప్రోత్సహించడం నేటి అవశ్యకతగా అఖిలభారతీయ ప్రతినిధి సభ గుర్తిస్తోంది. అందుకోసం దేశంలోని అన్ని ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, ధార్మిక సంస్థలు, ప్రసారమాధ్యమాలు, విద్యా సంస్థలు, మేధావులు భారతీయ భాషల వాడకం ద్వారా వాటి ఉద్ధరణకి కృషి చేయాలని పిలుపునిస్తోంది".

('సంపాదక హృదయం' కూడా చదవండి)

- తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
- తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
- ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...


తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




**ఏప్రిల్ 2018**

### రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలో నైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి. 2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి editorammanudi@gmail.com కు పంపాలి. కొరియర్ / రిజిస్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు. 3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము. 4. రచన స్వంతమేనని, ఇతర పత్రికలకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించ లేము. **అమ్మనుడి** లో ప్రచురణ ఐన తరువాత ఇతర పత్రికలలోగాని, సోషల్ మీడియాలో గాని ప్రచురించేట్లయితే – **అమ్మనుడి** నుంచి తీసుకున్నట్లు తప్పక పేర్కొనాలి.

### లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| **తెలంగాణ ముందడుగు :** | అమ్మభాషకు జయహో | | 6 |
| **సంపాదకహృదయం :** | ఆర్ ఎస్ ఎస్ చెప్పింది... సరే, భా జ పా... | | 7 |
| **పిలుపు :** | తెలుగుదేశం పార్టీ, ప్రభుత్వం.... | | 9 |
| **మాతృభాషలు :** | భాషా సమానత, హక్కుల.... | **గారపాటి ఉమామహేశ్వరరావు** | 11 |
| **కంప్యూటర్లు తెలుగు :** | 'కంప్యూటర్‌లలో తెలుగు' నుండి .... | **వీవెన్** | 13 |
| **లిపి సంస్కరణ చర్చ :** | లిపి సంస్కరణ | **గంగుల బాబు** | 15 |
| **లిపి, భాష బోధన :** | తెలుగు లిపి సంస్కరణ నూతన బోధనా.... | **సి.వి కృష్ణయ్య** | 19 |
| **ఉగాది :** | తరతరాల ఉగాది శక సంవత్సరమే... | **ఈమని శివనాగిరెడ్డి** | 21 |
| **న్యాయస్థానాలలో తెలుగు :** | న్యాయస్థానాలలో మాతృభాష | **పెండ్యాల సత్యనారాయణ** | 23 |
| **మరణ వాఙ్మూలం:** | తెలుగు కోసమే పుట్టారు | **। వేదగిరి రాంబాబు** | 27 |
| **బుద్ధ జయంతి ప్రత్యేకం :** | బుద్ధుడు నిరాకరించిన .... | **డి. చంద్రశేఖర్** | 28 |
| **వారసత్వ సంపద:** | కోటి లింగాల శాతవాహన స్థావరంలో... | **సంకేపల్లి నాగేంద్ర శర్మ** | 33 |
| **మహిళారంగం :** | భాషా వికాసం – మహిళల పాత్ర | **ఆచార్య దేవినేని హైమవతి** | 35 |
| **సాహిత్యరంగం :** | తెలుగు కథను ఎల్లలు దాటించిన కథకులు | **మధురాంతకం నరేంద్ర** | 41 |
| **చరిత్ర కారులు :** | చరిత్రసారాన్ని పిండిన | **వెంకటేశ్వరరావు** | 43 |
| **పిట్ట చూపు :** | మరోసారి చెలరేగుతున్న.... | **చలసాని నరేంద్ర** | 45 |
| **మన రాజులు వారి బిరుదులు :** | పశ్చిమ చాళుక్య రాణులు.. | **ఈమని శివనాగిరెడ్డి** | 47 |
| **సమీక్షలు :** | | **ఎం.వి శాస్త్రి** | 48 |
| **గ్రంథాలయం** | | | 49 |
| **ధారావాహికలు :** | | | |
| **1. బౌద్ధం–వైజ్ఞానిక మార్గం –12** | ..... | **బొర్రా గోవర్ధన్** | 29 |
| **1. మౌనంలోని మాటలు 6 :** సంచారి రావోళ్ళ నాగప్ప ఆత్మకథ – | | **ఆర్.బి.కుమార్,రం.రామచంద్రరావు** | 37 |
| **కవితలు :** | | | |
| 1. చావగొట్టి చెవులు మూసే | **సడ్లపల్లె చిదంబర రెడ్డి** | | 14 |
| 2. కొడిగడుతున్న తల్లి నుడి | **కె. సూర్యనారాయణ** | | 20 |
| 3. స్నేహం | **ఈదూరి సుధాకర్** | | 40 |


కార్టూన్లు : **సరసి**     కంప్యూటరీకరణ : **లంకె జనార్దన్**


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* e-mail : editorammanudi@gmail.com

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక
# అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

## చందా వివరాలు

| | | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|---|
| శాశ్వత చందా | : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ | : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ | : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ | : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.
**AMMA NUDI - AXIS BANK, TENALI**
అక్కౌంట్ నెం. **915020010550189**
**IFSC Code : UTIB0000556**
ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi2015@gmail.com

**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

**'అమ్మనుడి'** ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

**నవోదయ బుక్ హౌస్,** ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా. **హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

**మైత్రీ బుక్‌హౌస్,** జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

**మణి బుక్‌స్టాల్,** షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు**-1. ఫోన్:7386223538.

అమ్మభాష తెలుగును కాపాడుకొనే

ఉద్యమంలో భాగంగా భాషాప్రాధాన్యతను తెలిపే

## కథానికలకు ఆహ్వానం

ఈ వేగయుగంలో క్లుప్తతకి ప్రాధాన్యమిస్తూ బుల్లెట్లలా పాఠకుల మెదళ్ళని తాకి కదిలింపజేసి ఆలోచనలలో ముంచెత్తేట్టు చేయగల బలమైన సాహిత్యప్రక్రియ కథానిక. కథ వస్తువైతే, దానిని కళాత్మకంగా మలచి చెప్పే ప్రక్రియ కథానిక. దీనిని చదవడానికి పట్టే సమయంకన్నా ఆలోచింపజేసే సమయం ఎక్కువ. అందుకే అమ్మభాష ప్రాధాన్యం అన్ని కోణాలలో అందరి మనసులలో నాటుకునేట్టు చెప్పే కథానికల్ని వరుసగా **అమ్మనుడి**లో ప్రచురించాలని సంకల్పించాం.

ప్రభుత్వ పరిపాలనలో, కోర్టు వ్యవహారాల్లో, నిత్యజీవితంలో తెలుగును కోల్పోతున్నందువల్ల జరిగే నష్టాల్ని కథావస్తువులుగా తీసుకోవచ్చు. అన్నిటికీ మించి విద్యారంగంలో తెలుగును సమూలంగా అణచివేస్తున్నందువల్ల కలిగే నష్టాల్ని చిత్రిస్తూ కథానికలను వ్రాయవచ్చు. ఈ కోణాల్లో ఆలోచిస్తే రచయితలకు ఎన్నో కథాంశాలు కన్పిస్తాయి. 'అమ్మనుడి'లో ప్రచురిస్తున్న వ్యాసాల్లో ఇలాంటి అంశాలను గ్రహించవచ్చు. ఇందుకు రచయితల, రచయిత్రుల సహకారాన్ని కోరుతున్నాము. ప్రచురించే ప్రతి కథానికకు గౌరవ పారితోషికంగా 500రూ. ఇవ్వబడుతుంది.

- కథానిక ప్రచురణలో 2నుండి 4 పుటలకు మించకుండా ఉంటే మంచిది. ప్రతినెలా 1 లేక 2 కథానికలను మాత్రం ప్రచురించగలం.
- తరువాత ఈ కథానికలతో ఒక సంకలనాన్ని తెస్తాం.
- ప్రముఖ కథానికారచయిత **డా.వేదగిరి రాంబాబు** ఈ శీర్షికను **అమ్మనుడి** కోసం నిర్వహిస్తున్నారు.
- మన భావాలకు శాశ్వత రూపాన్నిచ్చే మన మాతృభాష కేంద్రంగా మీరు పంపే కథానికల కోసం ఎదురు చూస్తుంటాం. అమ్మభాష కోసం నిర్వహిస్తున్న ఈ వినూత్న శీర్షికకు విలువైన మీ కథానికలను పంపాల్సిన చిరునామా:

సంపాదకుడు, **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం, విజయవాడ-520 004. కార్యాలయం ఫోన్ : 0866-2439466. సంపాదకుడు : 9848016136. e-mail : editorammanudi@gmail.com

**గమనిక :** కథలను అనుఫాంట్స్‌లో గాని, యూనికోడ్‌లో గాని టైప్ చేసి, పి.డి.ఎఫ్ మరియు పి.ఎం.డి.ఫైల్సులోపంపించాలి. చేతివ్రాతలో పంపేట్లయితే వ్రాసిన దానిని స్కాన్ చేయించిపంపాలి. లేదా వ్రాతప్రతిని పోస్టులో గాని, కొరియర్‌లో గాని పంపించాలి.



## మన 'సరసి'గార్కి 'ఉగాది పురస్కారం'

మన పత్రిక ('నడుస్తున్న చరిత్ర' / 'అమ్మనుడి'లో రెండు దశాబ్దాలుగా ప్రతినెలా తన కార్టూన్లతో చదువరులను అలరించుతూ ఆలోచింపజేస్తున్న సరస్వతుల రామనరసింహం(సరసి)గారు 2018 'ఉగాది పురస్కారాన్ని, ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబునాయుడుగారి నుండి అందుకొంటున్న దృశ్యం. శాసన సభ ఉపసభాపతి శ్రీ మండలి బుద్ధ ప్రసాద్, మహిళా కమిషన్ అధ్యక్షులు శ్రీమతి నన్నపనేని రాజకుమారి మంత్రి శ్రీ కొల్లు రవీంద్ర, సాంస్కృతిక శాఖ సంచాలకులు డా॥విజయభాస్కర్‌గారలను చిత్రంలో చూడవచ్చు.

# మీరు 'అమ్మనుడి' చందాదారులేనా?

'అమ్మనుడి పత్రికకు చందాదారులు పంపే చందా సొమ్మే ఆధారం. కనుక –పత్రికకు చందా పంపించి, ప్రతినెలా పత్రికను పోస్టులో అందుకోండి.

1. తాము చందాదారులైతే మీకు పంపే పత్రికపై చందా ఏ నెల వరకు ఉన్నదీ పేర్కొని వుంటుంది. దయచేసి దానిని గమనించి, సకాలంలో మీ చందా సొమ్మును పంపించి పత్రికను ఎల్లప్పుడూ అందుకోండి.

2. తాము చందాదారులు కాకపోయినా, తమకు గౌరవ ప్రతిగా (కాంప్లిమెంటరీగా) ఉచితంగా అందుతూ వుండవచ్చు. అటువంటి మిత్రులకు పత్రిక నచ్చితే, దయచేసి చందాను పంపించి తోడ్పడగలరు. పత్రిక నచ్చకపోయినా, మీకు ఆసక్తి లేకపోయినా 'పత్రికను పంపవద్దు' అని దయచేసి ఒక కార్డుపైగాని, ఎస్.ఎం.ఎస్ / మెయిల్‌గాని పంపించి సహకరించగోరుతున్నాము.

3. పత్రికకు చందాను చెల్లించేవారు తమ ఇష్టాన్ని బట్టి శాశ్వత చందా (రు. 5000/–)గాని, 5 సం॥ల చందా (రు.1000/–లు)గాని, 3 సం॥ల చందా (రు. 700/–లు)గాని పంపి పత్రికను ఆర్థికంగా తోడ్పడగలరు. వీలుగాకపోతే సం॥ చందా రు. 240/–లు పంపించి ఏటా పునరుద్ధరించుకోవచ్చు. – ప్రచురణకర్త, అమ్మనుడి.

## తెలుగువారంతా చదవవలసిన పుస్తకాలు

స.వెం.రమేశ్ రచన




**ఎల్లలు లేని తెలుగు**
వెల : రు.200/–లు

ఆచార్యశ్రీగారపాటి ఉమామహేశ్వరరావు రచనలు



**తెలుగు రాష్ట్రాలలో భాషా సంక్షోభం**
వెల :రు. 100/–




**ద్రావిడ, మంగోలు భాషల జన్యుసంబంధం**
వెల : రు.350/–

రచయితలు, భాషోద్యమకారులు, ఉపాధ్యాయులు, పరిశోధకులు, ఆసక్తిగల వారంతా ఈ రచనలను చదివి ప్రయోజనం పొందగోరుతున్నాము

పుస్తకాల వెలను ఎం.ఒ చేస్తే వాటిని కొరియర్ / రిజిస్టర్ బుక్ పోస్ట్‌లో పంపిస్తాము.

**తెలుగుజాతి (ట్రస్టు)** – జీవక భవనం, 8–346, **అంగలకుదురు** పోస్టు తెనాలి – 522211ఫోన్ : 9440448244

# అమ్మభాషకు జయహో



★ అన్ని పాఠశాలల్లో తప్పనిసరి తెలుగు బోధన బిల్లుకు అసెంబ్లీ ఆమోదం

★ 2018-19 విద్యాసంవత్సరం నుంచి అమలు

★ తెలుగుభాషకు పూర్వవైభవం తీసుకొస్తున్న సీఎం కేసీఆర్

★ అమ్మఒడి పలుకులు...బడి పలుకులు కావాలనేదే లక్ష్యం : కడియం మంత్రి శ్రీహరి

★ సాహిత్య అకాడెమీ, తెలుగు యూనివర్సిటీలకు తెలుగు వాచకాల రూప కల్పన బాధ్యత

★ స్టేట్ సిలబస్‌తోపాటు సిబిఎస్ఇ, ఐసిఎస్ఇ, ఐబి, కేంబ్రిడ్జ్ పాఠశాలల్లో ఇక తెలుగు వెలుగులు

కమ్మనైన అమ్మభాషకు పూర్వవైభవం తెచ్చేందుకు ముఖ్యమంత్రి కేచంద్రశేఖర్‌రావు తీసుకున్న అపూర్వ నిర్ణయం అమలు దిశగా తొలి అడుగు పడింది. తెలుగుభాషను సర్కారు, ప్రైవేటు బడుల తేడాలు లేకుండా పిల్లలందరికీ అందుబాటులోకి తేవాలన్న సీఎం కేసీఆర్ సంకల్పానికి శాసనబద్ధత లభించింది. ఈ మేరకు ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ప్రవేశపెట్టిన 'పాఠశాలల్లో తప్పనిసరి తెలుగు బోధన బిల్లు'ను శాసనసభ మార్చి 24న ఆమోదించింది. 2018 -19 విద్యాసంవత్సరం నుంచి రాష్ట్రంలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సిలబస్‌తో నడుస్తున్న అన్ని రకాల పాఠశాలల్లో దీనిని అమలుచేయనున్నారు. తెలుగు భాషకు పూర్వ వైభవం తీసుకురావడానికి సీఎం కేసీఆర్ పదోతరగతి వరకు తెలుగు తప్పనిసరి చేస్తూ నిర్ణయం తీసుకున్నారని బిల్లు ప్రవేశపెడుతూ కడియం శ్రీహరి చెప్పారు. బిల్లు ఉద్దేశాన్ని ఆయన సభకు వివరిస్తూ... ఉమ్మడి రాష్ట్రంలో తెలుగు నిర్లక్ష్యానికి గురయిందని, తెలంగాణలో జన్మించినా, ఇక్కడ చదువుతున్నా విద్యార్థులు తెలుగు చదవ లేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగుకు పూర్వవైభవం తీసుకు రావడానికి సి.ఎం. కేసీఆర్ ప్రపంచ తెలుగు మహాసభలను అంగరంగ వైభవంగా నిర్వహించారని, అమ్మభాష కమ్మదనాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని తెలిపారు. పదవ తరగతి వరకూ తెలుగును తప్పనిసరి చేయాలని మహాసభల సందర్భంగా సీఎం కేసీఆర్ నిర్ణయించారని గుర్తుచేశారు. తమిళనాడు, కర్ణాటక, పంజాబ్ రాష్ట్రాల్లో మాతృభాషను ఏ విధంగా అమలు చేస్తున్నారనేది రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి ఆధ్వర్యంలో అధ్యయనం జరిపించినట్లు తెలిపారు. తెలుగు భాష బోధనను 1 నుంచి 5వ తరగతి వరకు, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు రెండు విభాగాలుగా అమలు చేస్తా మని వివరించారు. ఇతర మాతృభాషలైన తమిళం, ఉర్దూ, కన్నడం, మరాఠీ, బెంగాలీ భాషల్లో చదువుతున్నవారు వారి మాతృభాషలు చదువుతూనే తెలుగు చదువాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర సిలబస్, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్ బోధించే అన్ని పాఠశాలల్లో కూడా తెలుగు తప్పనిసరి. అని కడియం శ్రీహరి స్పష్టంచేశారు. దీన్ని వచ్చే విద్యా సంవత్సరం నుంచే చేస్తామని ప్రకటించారు.

తెలుగు కాకుండా ఇతర మాతృభాషలుగా ఉన్న విద్యార్థులకు ఒకటి, ఆరో తరగతుల నుంచి తెలుగును ప్రవేశ పెడుతామన్నారు. వీరికి అవసరమైన స్థాయిలో తెలుగువాచకాలను రూపొందించే బాధ్యతను సాహిత్య అకాడమీ, తెలుగు యూనివర్సిటీలకు అప్పగించామని చెప్పారు. సీబీఎస్సీ, ఐసీఎస్ఈ పాఠశాలల్లో మొదటిభాషగా తెలుగు, రెండో భాషగా ఇంగ్లిష్, మూడో భాషగా ఆయా బోర్డులు ఇతర భాషలను ఎంపిక చేసుకొనే అవకాశాన్ని కల్పిస్తామన్నారు. ఇతర భాషలు మాతృభాషగా ఉన్నవారికి తెలుగులో పాస్ మార్కులు 20 మాత్రమే ఉంటాయని కడియం శ్రీహరి తెలిపారు.

పదో తరగతి వరకు తెలుగును తప్పనిసరి బోధనాంశం చేసే బిల్లుకు అసెంబ్లీ ఆమోదం లభించడంతో తెలుగు భాష ప్రేమికులలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తున్నాయి. సి.ఎం.కేసీఆర్ తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతున్నది. కొన్ని కార్పొరేట్ విద్యా సంస్థలు, కొన్ని ప్రైవేటు విద్యా సంస్థల నిర్వాకం వల్ల తెలంగాణ విద్యార్థులు తెలుగును పూర్తిగా విస్మరించాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఈ నేపథ్యంలో సిఎం కేసీఆర్ తీసుకున్న నిర్ణయం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులలో సంతోషం వ్యక్తమవుతున్నది. తెలుగు భాషని అమలు చేయని ప్రైవేటు పాఠశాలలపైన శాఖాపరమైన చర్యలు తీసుకోవడం లేదా ఆయా స్కూళ్ల గుర్తింపును రద్దు చేయడం వంటి కఠిన చర్యలు కూడా వుంటాయని ఇప్పటికే పాఠశాల విద్యాశాఖాధికారులు హెచ్చరికలు చేశారు.

తెలంగాణ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి కూడా తెలుగు అమలు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ప్రకటించారు. తెలుగు భాష అమలుకోసం ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

(**నమస్తే తెలంగాణ** దినపత్రిక మార్చి 25 నుండి)

సంపాదక హృదయం

# ఆర్ ఎస్ ఎస్ చెప్పింది...సరే, భాజపా చేస్తుందా? చెయ్యగలదా??

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ – ఆర్ ఎస్ ఎస్ – భారత ప్రజలపైనా వారి ఆలోచనలపైనే కాదు; నేటి భారత ప్రభుత్వం మీద కూడా అత్యంత ప్రభావాన్ని చూపిస్తున్న సంస్థ అని అందరికీ తెలిసిందే. ఆ సంస్థ ఆశయ లక్ష్యాలతో పని విధానంతో విభేదించేవారు ఎందరో ఉండవచ్చు. అయితే దాని శక్తినిగాని, ఆశయ లక్ష్యాల సాధనలో ఆ సంస్థ పట్టుదల గురించిగాని ఇప్పుడు ఎవరికీ ఏ సందేహమూ ఉండనక్కరలేదు. ఈ సమాజం సర్వాంగీణ వికాస దిశగా పురోగమించాలని, స్వయంసమృద్ధమైన శక్తిమంతమైన దేశంగా భారత్ ఎదగాలనే లక్ష్యంతో పని చేస్తున్న అతి పెద్ద కార్యకర్తల నిర్మాణం అది. రా.స్వ.సంఘ్‌లో ప్రచారకులుగా తమ జీవితాన్నే అంకితం చేసి వివిధ రంగాలలో పనిచేస్తున్న వేలాదిమంది బాధ్యులున్నారు. వారుగాక, 'సంఘ్' శిక్షణ పొందిగాని, దాని వల్ల ప్రభావితులైగాని ఆయా రంగాల్లో పని చేస్తున్న లక్షలాది మంది కార్యకర్తలు, అనుయాయులు ఉన్నారు. ఇంతటి బలిష్టమైన సంస్థాగత నిర్మాణం ఇప్పుడు మన దేశంలో ఏ ఇతర సైద్ధాంతిక పునాది గల సామాజిక / రాజకీయ సంఘానికిగాని, ఉద్యమానికిగాని లేదు. మేధోపరంగాను, క్షేత్రస్థాయిలోను పటిష్టమైన సంస్థ 'రా.స్వ.సే.సంఘం'.

'సంఘం' ఆలోచనలు దాని 'సర్ సంఘ్ చాలక్', 'సర్ కార్యవహ' ల స్థాయిలోనూ వివిధ రంగాల బాధ్యులైన ప్రచారకుల నుంచీ వెలువడతాయి. వారి పలుకుల వెనుక ఎంతో మేధోమథనం ఉంటుంది. 'సంఘం' నిర్మాణంలోని అనేక దశల్లో, స్థాయిల్లో ఎంతో కసరత్తు జరిగిన తర్వాతనే ఏదైనా కీలక అంశం మీద విధానపర నిర్ణయాలు వెలువడతాయి. అలాంటి విధాన నిర్ణయాలను 'సంఘం' యొక్క అఖిల భారతీయ ప్రతినిధి సభలో చర్చించి, వెల్లడిస్తారు. ఆ విధంగా వెలువడే ప్రకటనలే 'సంఘం' వారి అధికారిక విధాన నిర్ణయాలు. ఇదుగో...ఇప్పుడు అలాంటి విధాన ప్రకటనే 'భారతీయ భాషలను పరిరక్షించుకోవాలి' అంటూ మార్చి 9-11లలో నాగపూర్‌లో సమావేశమైన ప్రతినిధి సభ' విడుదల చేసిన ప్రకటన. ఆ ప్రకటన పూర్తి పాఠాన్ని ఈ సంచిక రెండవ అట్టపై చూడండి.

ఆ ప్రకటనలో 'సంఘం' ప్రతిపాదించిన సూత్రాల ఆచరణాత్మక ప్రణాళికకు ముందుగా ఇచ్చిన రెండు పేరాలనూ, చివర ఇచ్చిన పేరాను శ్రద్ధగా చూస్తే భాషల పరిరక్షణ ఎందుకోసం జరగాలని 'సంఘం' అనుకొంటున్నదో స్పష్టమవుతుంది. సంస్కృతంతోనే ముడిపెట్టి భారతీయ వారసత్వాన్నీ, గొప్పదనాన్నీ చూడడం, మాట్లాడడం అలవాటైన 'సంఘం' – ప్రజల మాతృభాషల అవసరాన్నీ మౌలికతనూ గుర్తించి, ఎక్కడా సంస్కృత ఆధిపత్య భావజాలాన్ని ప్రస్తావించకుండా, భారతీయ భాషల గురించీ, 'మాతృభాష' తప్పనిసరితనాన్నీ తలకెత్తుకోవడం ఎంతో సంతోషించదగిన పరిణామం. ఇది సంఘాన్నీ సంఘ పరివార సంస్థలనూ సామాన్య ప్రజలకు, ఆలోచనాపరులకు మరింత దగ్గర చేయగలిగిన ప్రముఖ అంశం. ఆ ప్రకటనను 'సంఘం' – దేశంలోని అన్ని ప్రభుత్వాలకూ స్వచ్ఛంద సంస్థలకూ ధార్మిక సంస్థలకూ ప్రసార మాధ్యమాలకూ విద్యాసంస్థలకూ మేధావులకూ ఉద్దేశించి చేసిందని మనం గమనించాలి. భారతీయ భాషల వాడకం గురించీ, మాండలికాలను రక్షించుకోవడం గురించీ ఆ ప్రకటన నొక్కి పలికింది. మాతృభాషలు మోసుకొచ్చే 'అద్భుతమైన జ్ఞాన సంపద' గురించీ సంస్కృతీ సంప్రదాయాల గురించీ మాట్లాడింది. 'వ్యక్తి, సమాజపు అస్తిత్వానికి, భావ వ్యక్తీకరణకు, మాతృభాషలు ప్రధాన వాహకం' అనీ చెప్పేసింది. భారతీయ భాషల వాడకం ద్వారానే వాటిని ఉద్ధరించగలమనీ చెప్పింది. 5వ సూత్రంలో ప్రత్యేకించి 'స్వయం సేవకులకు' 'సంఘ పరివారానికి' మార్గ దర్శనం చేసింది. 'స్వయం సేవకులతో సహా – సమస్త ప్రజానీకం తమ మాతృభాషలోనే దైనందిన వ్యవహారాలు, సంభాషణలు జరిగేటట్లు శ్రద్ధ వహించాలి' అనడం వల్ల మొత్తం సంఘ పరివారమూ స్వయంసేవకులూ తమ పలుకు తీరునూ, వ్యవహార శైలినీ, సాధారణ ప్రజల భాషకు, బ్రతుకులకూ సన్నిహితమయ్యేట్లు తీర్చిదిద్దుకోవలసి వుంటుంది. 'సంఘం' ఆలోచనలు వాస్తవికతతో, శాస్త్రీయతతో పరిణతి చెందాయని, అన్ని రంగాల్లో భారతీయ సమాజంలోని వైవిధ్యాల్నీ, ప్రత్యేకతలనూ, మాతృభాషలతో ముడిపడి

వున్న అస్తిత్వ చైతన్యాన్ని, ఆ సంస్థ మరింత సన్నిహితంగా – సానుకూల దృష్టితో అవగాహన చేసుకోగలుగుతుందనీ ఆశించవచ్చు.

సరే. 'సంఘ' పిలుపును మొత్తం సంఘ పరివార సంస్థలు అందుకోవాలని ఆశించినట్లు కూడా మనకు స్పష్టపడింది. అన్ని ప్రభుత్వాలకు కూడా 'సంఘం' పై పిలుపును ఇచ్చింది. మరి వెంటనే అందరి మనసుల్లోకీ వచ్చే ప్రశ్న – నేడు దేశంలోని అతి పెద్ద రాజకీయ పార్టీ. భారతీయ జనతా పార్టీ – ఆ పార్టీ పాలనలో వున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పై పిలుపును అందుకొని తమ భాషా విధానాన్ని తగు విధంగా రూపొందించుకొని, ప్రకటిస్తాయా – అని. అయితే ప్రభుత్వం పూనుకొనవలసిన అంశాలు ఇవి :

భారత రిపబ్లిక్ ఏర్పడినప్పటి నుండీ మాతృభాషలు గందర గోళంలో కొట్టుకులాడుతున్నాయి. రాజ్యాంగ నిర్మాణంలోనే ఈ అనిశ్చిత స్థితి ఉంది. రాజ్యాంగ నిర్మాణ చర్చల్లో బహుశా ఎంతో ఎక్కువగా చర్చించబడిన అంశమూ, పరిష్కారాలకు సరిగా నోచుకోని అంశమూ, కాలానికి వదిలివేయబడిన అంశమూ 'భాషా సమస్యే'. దేశమంతా భౌగోళికంగా ఒకటే అయినప్పటికీ భాషల పరంగా వున్న వైవిధ్యాన్ని గుర్తించడంలోనూ ఆ సమస్యల్ని తృప్తికరంగా పరిష్కరించడంలోనూ విఫలమయ్యాం. భాషా రాష్ట్రాల ఏర్పాటువల్ల మరిన్ని కొత్త సమస్యలు ఏర్పడ్డాయి. ఆయా భాషా రాష్ట్రాల్లో ఇతర భారతీయ భాషల వారు తమ భాషను, అస్తిత్వాన్ని కోల్పోయిన పరిస్థితి వచ్చింది. ముఖ్యంగా తమ స్వంత రాష్ట్రంలో (రాష్ట్రాల్లో) వున్న తెలుగువారి సంఖ్యతో సమానంగా, ఇతర రాష్ట్రాల్లోనూ తెలుగువారవడం వల్ల తెలుగుభాషాజాతి తీవ్రంగా నష్టపోయింది. అస్తిత్వ సమస్య వాళ్ళ జీవితాలను పెనవేసుకు పోయింది. రాజ్యాంగంలో 350 (ఎ) అధికరణం 'భాషాల్పసంఖ్యాకుల' గురించే మాట్లాడింది. రాజ్యాంగంలోని స్పష్టతలేని, బలహీనమైన, పనికిరాని కొన్ని అధికరణల్లో ఇదొకటి.

ఇదే విధంగా పాలనా భాషగా, న్యాయస్థానాల్లో భాషగా – మాతృభాషల ప్రతిపత్తిని స్పష్టం చెయ్యకుండా, ఆంగ్లభాషాధిపత్యాన్ని సహించి తీరవలసిన, ఆ సుడిలోనే కొట్టుకులాడ వలసిన పరిస్థితిని ఎందుకు కొనసాగించినట్లు ? ఇది మన రాజ్యాంగ నిర్మాతల వైఫల్యం అని చెప్పక తప్పడం లేదు. ఒక అనుసంధాన భాషగా తప్ప హిందీకి ఎటువంటి ఆధిపత్య ప్రతిపత్తీ లేకపోయినా, ఉత్తర భారతదేశపు బలమైన పిడికిట్లో బిగుసుకుపోయిన రాజకీయ, పాలనా వ్యవస్థ – హిందీని మోస్తూ ఉంది. ఇందుకు జాతీయ పార్టీలేవీ మినహాయింపు కావుగాని భారతీయ జనతా పార్టీకి హిందీ అనుకూల పార్టీగా ఉన్న ముద్ర – ఈ నాలుగేళ్ళల్లో బాగా బలపడింది. రాజకీయ నిర్ణయాలు పాలనను ప్రభావితం చేస్తాయి, ఉత్తర – దక్షిణ విభేదాలకు మళ్ళీఆజ్యం పోస్తున్నట్లుగా భాజపా విధానాలు అందరికీ అర్థమవుతున్నాయి.

రాజ్యాంగం ఎనిమిదో షెడ్యూల్లో గుర్తింపబడిన భాషలు తొలుత 14 ఉండగా ఇప్పుడవి 22కు చేరాయి. ఇంకా కొన్ని భాషలు ఈ జాబితాలో చేరడానికి వత్తిడి తెస్తున్నాయి. వత్తిడులకు లొంగిపోయే, రాజకీయ ప్రయోజనాల కోసం వత్తిడి తెచ్చే పార్టీలు, ప్రభుత్వాలు మనకున్నాయి. ఇందుకవకాశం లేకుండా – ఒక గడువు పెట్టి – అంతర్జాతీయ సూత్రాలకనుగుణంగా భాషల్ని గుర్తించి, అలా షెడ్యూల్లో ఉండే భాషలన్నిటినీ జాతీయ భాషలుగా గుర్తించాలి. ఈ స్పష్టతతో – రాజ్యాంగంలోని 17వ విభాగంలోని 4 అధ్యాయాలనూ, 343 నుంచి 351 వరకూ గల అన్ని అధికరణాలనూ మొత్తంగా పునః పరిశీలించి, కావలసిన మార్పు చేర్పులను చెయ్యవలసిన అవసరమూ, అగత్యమూ వచ్చేసింది. ఇందుకు భాజపా ప్రభుత్వం చొరవతీసుకొని, ఆ ప్రక్రియను మొదలు పెట్టాలి.

ఇదే విధంగా విద్యారంగానికి సంబంధించి, బోధనా మాధ్యమం విషయంలో – కనీసం ప్రాథమిక విద్య వరకూ మాతృభాషలో బోధనను తప్పనిసరి చేయడానికై దాన్ని ప్రాథమిక హక్కుల్లో చేర్చడానికి సిద్ధపడాలి. స్వేచ్ఛకు అడ్డు వస్తుందనే కొన్ని రాజ్యాంగ సూత్రాల సాకుతో పిల్లల మౌలిక అవసరాలనూ, భవిష్యత్తునూ బలిచేసే పరిస్థితిని తొలగించాలి. కోర్టులు ఇచ్చిన తీర్పుల వల్ల ఇలాంటి పరిస్థితి ఏర్పడిందనే వాస్తవాన్ని గుర్తించాలి.

ఇప్పుడు సాంకేతికంగా మన మాతృభాషల్ని రక్షించుకోగల పరిస్థితి ఉంది. కనుక – మరో భాష ఆధిపత్యానికి లొంగి పోవలసిన అగత్యం లేనే లేదు. అవసరం ఉన్నంత వరకు పరభాషల్ని నేర్చుకోగల అవకాశాలెప్పుడూ ఉంటాయి. అంతేగాని స్వంత భాషను మనం కోల్పోవడానికి గానీ, పరభాషా దాస్యానికి గానీ ఎటువంటి అవకాశాలుండకూడదు. అలాగే మన భాషలు, సంస్కృతులు, వారసత్వ సంపదా – వేటినీ మరుగు పరచే అన్ని రాజకీయ, పాలనా ప్రయత్నాలనూ మనం సహించ కూడదు.

మాతృభాషల (భారతీయ భాషల) విషయమై రాష్ట్రీయ స్వయం సేవక సంఘం ఇచ్చిన పిలుపును భారతీయ జనతా పార్టీ అందుకోవడానికి సిద్ధంగా ఉన్నదా – అనే ప్రశ్నను ముందుకు తెద్దాం. కొన్ని కొన్ని రంగాల్లో 60 ఏళ్ళుగా పేరుకుపోయిన కుళ్ళునూ, అవ్యవస్థల్నీ సమూలంగా కడిగివేసే చర్యల్ని చేపడుతున్నామని పదేపదే చెప్పుకొనే 'భాజపా' ప్రభుత్వం – భారతీయ భాషల – భారత ప్రజల మాతృభాషల రక్షణకూ, సాంస్కృతిక భవిష్యత్తుకూ కట్టుబడి దృఢ సంకల్పంతో ముందుకు వస్తుందా? తమ మాతృ సంస్థ, గురు పీఠమూ ఐన 'సంఘం' పిలుపును ఆచరణలోకి తెచ్చేందుకు 'భాజపా' సిద్ధమేనా?

సామల రమేష్‌బాబు

తేదీ : 30-3-2018

# తెలుగుదేశం పార్టీ, ప్రభుత్వం చేసిన వాగ్దానాలను నెరవేర్చాలి.
## 2018 మే 28 నాటికి స్పష్టమైన ప్రకటన రాకపోతే–రానున్న ఎన్నికలే లక్ష్యంగా తెలుగు ప్రజలు ఉద్యమించాలని పిలుపు




1982 మే 28న తిరుపతిలో తెలుగు దేశం పార్టీ చేసిన 'తెలుగు భాషావిధాన' ప్రకటనను కీ.శే.నందమూరి తారక రామా రావు తర్వాత ఆ పార్టీ నేతలు తుంగలో తొక్కారని, చంద్రబాబు నాయుడుగారి హయాంలో తెలుగును పూర్తిగా అణగద్రొక్కారని, కొత్త ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుగారు పలు వాగ్దానాలు చేశారని, కానీ ఏవీ అమలు కాలేదని, పైగా మోసపూరితంగా వ్యవహరిస్తున్నారని తెలుగు భాషోద్యమ సమాఖ్య జాతీయ అధ్యక్షుడు డా॥ సామల రమేష్‌బాబు తిరుపతిలో మార్చి 16న పలు సాహితీ సంఘాలు, రచయితలు, భాషోద్యమకారులు, అధ్యాపకులు పాల్గొన్న 'శాంతియుత నిరసన దీక్ష'లో మాట్లాడారు. ఈ సంవత్సరం మే 28నాటికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలుగుకు పూర్తి సాధికారత కల్పిస్తూ స్పష్టమైన ప్రకటన చెయ్యాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్య ప్రభుత్వానికి శాసన నిర్మాణరంగం (లెజిస్లేచర్), కార్యనిర్వాహక రంగం (ఎక్స్‌క్యూటివ్), న్యాయ పాలనారంగం (జ్యుడిషియరీ) ఆధారంగా ఉంటాయని, ఈ మూడు రంగాల్లో తెలుగును సాధికారం చెయ్యాలని, ఇందుకు కట్టుబడని ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేకమైనవని ఆయన అన్నారు. అదే విధంగా – ప్రజల భాషలో కనీసం పాఠశాల విద్యను కూడా నేర్పడాన్ని వ్యతిరేకించే ప్రభుత్వాలు జాతిద్రోహానికి పాల్పడుతున్నాయని, డా॥ రమేష్‌బాబు స్పష్టం చేశారు.

ఈ శాంతియుత నిరసన దీక్షను తిరుపతిలోని తెలుగు భాషోద్యమ సమితి ఆధ్వర్యంలో జిల్లాలోని పలు సాహితీ సంస్థలు సంయుక్తంగా తిరుపతి నగర పాలక సంస్థ కార్యాలయం ఎదుట మార్చి 16న నిర్వహించాయి. రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం కార్యదర్శి, తెలుగు భాషోద్యమ సమితి నేత శ్రీసాకం నాగరాజ మాట్లాడుతూ 'తెలుగుకు సాధికారత కోసం" ఈ ఉద్యమానికి ఇప్పుడే తిరుపతిలోశ్రీకారం చుట్టామని, వేగంగా ఈ ఉద్యమం రాష్ట్రవ్యాప్తం కావాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులైన డా॥సామల రమేష్‌బాబు, సెంట్రల్ యూనివర్సిటీ ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు, సమాఖ్య ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి డా॥ వెన్నిసెట్టి సింగారావు, సాహితీ సంఘాల ప్రతినిధులు, ఉద్యమకారులతో కలిసి, సాకం నాగరాజ తొలుత పూర్ణకుంభం కూడలి లోగల తెలుగుతల్లి విగ్రహానికి పూల దండలు వేసి, దీక్షను చేపట్టారు. అందరూ చెవుల మీదుగా నల్లటి గుడ్డను చుట్టుకొని, దీక్షలో పాల్గొన్నారు. "ప్రభుత్వాల అబద్ధాలను ఇక వినం... వినం" అంటూ అందరూ నినదించారు. దీక్షలో సాకం నాజరాజ, ఆచార్యగారపాటి, డా॥ సింగారావులతోపాటు శ్రీ భూమన్, ద్రావిడ యూనివర్సిటీ పూర్వ ఉపకులపతి శ్రీ రత్తయ్య ప్రభృతులు ప్రసంగించారు. ఈ శిబిరంలో గంగవరపు శ్రీదేవి, కోట పురుషోత్తం, నవీన్‌కుమార్ రెడ్డి, సెమిలేటి కిట్టన్న, మస్తానమ్మ, నిర్మల, పేరూరు బాలసుబ్రహ్మణ్యం, యువశ్రీ మురళి, వాకా ప్రసాద్, తులసీనాథం నాయుడు, ఖాదర్‌వలీ, గాజుల నటరాజ్, కళాకారుడు పెంచలదాసు, తమటం రామచంద్రారెడ్డి, సుమతి, సుహాసిని మొదలైనవారితోపాటు ఇంకా అనేక మంది పాల్గొన్నారు.

అన్ని సంఘాలనూ సమైక్య పరచి సమైక్య కార్యాచరణను చేపట్టాలని కూడా సమావేశం ప్రతిపాదించింది.

రాష్ట్ర రాజధాని అమరావతిలో పొట్టి శ్రీరాములుగారి కాంస్య విగ్ర హాన్ని, ఒక స్మృతి వనాన్ని నిర్మించాలని దీక్షా శిబిరం ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

ఈ సందర్భంగా దీక్ష నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనను వెనుక పుటలో చూడండి.

**వాడని భాష వాడిపోతుంది...భాష నశిస్తే జాతి నశిస్తుంది.**

### తిరుపతిలో జరిగిన 'నిరసన దీక్షా శిబిరం' విడుదల చేసిన ప్రకటన, హెచ్చరిక

# ప్రభుత్వాల అబద్ధాలు ఇక వినం, వినం!

## తెలుగుకు ఉగాదులు లేవు, ఉషస్సులూ లేవు!

తెలుగుతల్లి సాక్షిగా.... తెలుగుభాష రోజు రోజుకూ మనుగడను కోల్పోతున్నది. తెలుగులో బోధన, తెలుగులో పరిపాలన కలలోని మాటగా మారింది. మన పొరుగున కర్నాటకలో రైల్వేటికెట్లు కూడా కన్నడంలో ముద్రిస్తారు. తమిళనాట తమిళంలో పేరులేని దుకాణం కానీ, కార్యాలయం కానీ కంటికి కనిపించదు. పేరు గొప్ప ఊరు దిబ్బ అని నానుడి. మన తెలుగు పరిస్థితీ ఇదే. ప్రభుత్వాలు అమలుకాని చట్టాలతో, హామీలతో అరచేతిలో వైకుంఠం చూపిస్తూ పబ్బం గడుపుకుంటున్నాయి.

అలనాటి కాంగ్రెస్ ప్రభుత్వం 1966లో అధికార భాషా చట్టం చేసి చేతులు దులుపుకుంది. దాని అమలు అతీగతీ లేదు. అనంతరం 'తెలుగు ఆత్మగౌరవం' నినాదంతో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించింది. "భాషా ప్రయుక్త రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ఏర్పడి పాతికేళ్ళు గడచినా తెలుగుభాష అమలుకాని దౌర్భాగ్యస్థితిలో ప్రజలున్నారు" అంటూ ఆనాడు తెలుగుదేశం పార్టీ ఆక్రోశం వెలిబుచ్చింది. 1982 మేలో మన తిరుపతి నగరంలోనే ఘనంగా భాషా విధాన ప్రకటన చేసింది.

**సచివాలయం మొదలు సమితి కార్యాలయం వరకూ తెలుగు, ప్రాథమిక పాఠశాలలు మొదలు, విశ్వవిద్యాలయాల వరకు బోధనా భాష తెలుగు, గవర్నరు పిల్లల మొదలు శ్రామికుని బిడ్డల వరకు బాలబాలికలందరికీ ఒకేవిధమైన విద్యాభ్యాసం, తెలుగు ప్రాంతంలోని కేంద్ర ప్రభుత్వసంస్థల్లో కూడా తెలుగులోనే కార్యకలాపాలు, తెలుగునాడులోని సమస్త సంస్థలూ తెలుగులోనే కార్యక్రమాలు... అని అంటూ తెలుగుదేశం పార్టీ దశసూత్ర పథకం ప్రకటించింది. "ఇంతకాలంగా సాగుతూ వచ్చిన మోసపూరిత విధానాలు ఇకముందు సాగనివ్వం" అనికూడా ఆ పార్టీ మరీ హెచ్చరిక చేసింది. తెలుగు భాషకు స్వర్ణయుగం వచ్చిందని ప్రజలు సంబరపడి పోయారు. కానీ ఏమైంది? తెలుగు భాషాభివృద్ధి ఎక్కడవేసిన గొంగళి అక్కడే వుంది, ఉగాది పండుగ, గిడుగు జయంతి వేదికల మీద బూటకపు వాగ్దానాలు కురిపిస్తూ మంత్రులు, ముఖ్యమంత్రులూ ప్రజల్ని మభ్య పెడుతున్నారు. తెలుగు భాషకు కాంగ్రెస్ పార్టీయే కాదు తెలుగుదేశం పార్టీ చేసిందీ గుండుసున్నా!**

ప్రస్తుతం మన ముఖ్యమంత్రి శ్రీనారాచంద్రబాబునాయుడుగారు తెలుగుభాష అభివృద్ధి గురించి ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలుకు నోచుకోక పోవడం శోచనీయం. మహానుభావులు కీ.శే. నందమూరి తారకరామారావుగారి భాషా స్ఫూర్తి వీరికి రవ్వంతైనా లేదు.

**అయ్యా! ముఖ్యమంత్రి గారూ!**

* ప్రాచీన భాషాకేంద్రాన్ని నాగార్జున విశ్వవిద్యాలయంలో ఏర్పాటుచేసేస్తున్నామనీ, అందుకు భవనాన్ని సైతం కేటాయించేశామనీ ప్రకటించారు... ఈనాటకీ నిజం కాలేదు.!
* రాజమండ్రిలో ఉన్న తెలుగు విశ్వవిద్యాలయం శాఖను నవ్యాంధ్రకు ప్రత్యేకంగా పూర్తిస్థాయి తెలుగు విశ్వవిద్యాలయంగా ఏర్పాటు చేస్తున్నామన్నారు... చేయలేదు.
* 1 నుండి 10వ తరగతి వరకూ తెలుగు మాధ్యమంలో విద్యాబోధన గురించి ఒకప్పుడు మీరే ఇచ్చిన జి.ఒ.నెం. 86/2003 ను అమలు చేయాలి... చేయలేదు.
* ఇంటర్మీడియెట్లో సంస్కృతాన్ని (మార్కుల దొంగ) తీసివేసి తెలుగును పెడతామని పలుమార్లు గిడుగుజయంతి సభల్లో మూడేళ్లపాటు చెప్పారు... జరగలేదు.
* తెలుగు ప్రాధికార సంస్థను 2016లోనే స్థాపిస్తామన్నారు... ఏమైంది ఆ మాట?
* తెలుగు భాషామంత్రిత్వ శాఖ. పేరుకే ఉంది. దానికి బడ్జెట్ కేటాయింపు ఎందుకు లేదు? గత నాలుగేళ్ళుగా ఆశాఖ చేసిన పని ఏమిటి?
* రచయితలు, కవులు, మేధావులు, సామాజిక కార్యకర్తలు... యావన్మందీ ఇది ఆంధ్రప్రదేశ్ కాదు, ఆంగ్లప్రదేశ్ అంటున్నారు. దీనికి బాధ్యులెవరు?
* మన రాష్ట్రం భాషా ప్రయుక్త రాష్ట్రం. అంటే ప్రభుత్వ పరిపాలనంతా (కోర్టులతో సహా) తెలుగులోనే సాగాలి. తెలుగుకు సాధికారత రావాలి. రాష్ట్రమంతా తెలుగుదనంతో, తెలుగు ఆత్మ గౌరవంతో వెలగాలి. ఇదే ఎన్.టి.ఆర్. కోరింది కూడా! చివరికి నవ్యాంధ్ర సచివాలయ శంకుస్థాపన శిలాఫలకంలో సైతం తెలుగుకు చోటులేకుండా పోయిందే! ఇంతకంటే విషాదమా!

అందుకనే అయ్యా ముఖ్యమంత్రిగారూ, మీ మాటల్నీ వినలేం! మీ వాగ్దానాల్నీ నమ్మలేం!

ఇక మాకు మీ హామీలు అక్కర్లేదు, ఆచరణ కావాలి! ఏమి చేయదలచుకున్నారో ఈ ఉగాది సందర్భంగా స్పష్టంగా ప్రకటించండి! వాటి అమలుకు చర్యలను ఆనాటి నుండైనా మొదలు పెట్టండి! - దండాలు.

తెలుగు భాషోద్యమ సమితి, సాహితీ సంఘాలు, తిరుపతి
16 మార్చి 2018

ఇట్లు
తెలుగు ప్రజలు, ఆంధ్రప్రదేశ్

ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
9866128846

# 'భాషా సమానత, హక్కుల ప్రచార సంస్థ' ఆవిర్భావం




> స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సర్వేక్షణ్అంటూ మనం ఎంత గొంతు చించుకున్నా ప్రయోజనం ఏమిటి. మన అక్షరాస్యత 65%. అందులో52% ప్రాథమిక విద్య దాటనివారే. 20% కూడా ఉపయోగ కరమైన అక్షరాస్యత సాధించరాని మన 70 ఏండ్ల ప్రగతిలో 'స్వచ్ఛ' రాష్ట్రాలు సాధ్యమా? మనకు కావలసింది తప్పనిసరి సంపూర్ణ అక్షరాస్యత. అది మాతృభాషల ద్వారా మాత్రమే సాధ్యం. అప్పుడే స్వచ్ఛ భారత్, స్వచ్ఛ సర్వేక్షణ్ లాంటివి సాధ్యం.
>
> – ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు

భారతదేశం అంతటా, రాష్ట్రాలలో మాతృభాషాహక్కులు రాజకీయంగా ప్రధాన సమస్యగా ఉద్భవించాయి.గత కొన్నిఏండ్లుగా, రాష్ట్రాలు స్థానిక భాషల హక్కులను కాపాడుకోవడానికి పలు చర్యలను చేపట్టాయి. అనేక సంస్థాగత నిర్ణయాలను ప్రకటించాయి.వీటిలో అమలుచేసిన మరి కొన్ని విధానపర అంశాలూ ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, కర్ణాటక, పశ్చిమబెంగాల్ మరియు గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వాలు తమ పరిధుల్లోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎద్యుకేషన్ (సీబీఎస్ఈ), భారతీయ సర్టిఫికేట్ ఆఫ్ సెకండరీ ఎద్యుకేషన్ (ఐసీఎస్ఈ) పాఠశాలల్లోనూ బోధనా భాషలను నిర్దేశించాయి.

భారత దేశంలో భాషా హక్కులు రాజకీయంగా ప్రధానమైనవి. గత కొన్ని ఏండ్లుగా, అనేక రాష్ట్రాలు అలాంటి చట్టాలను రూపొందిం చేందుకు చర్యలు తీసుకుంటున్నాయి. కేరళలో స్థానికేతరులకు మలయాళం బోధించటానికి కేరళ ప్రభుత్వం ఒక సమగ్ర ప్రణాళికను సిద్ధంచేయటం, జాతీయ రహదారులపైని మైలురాళ్లపై పంజాబీ, ఒడియా భాషలను ఇంగ్లీషు, హిందీ భాషల కింద మూడవ స్థానానికి చేర్చి రాసినందుకుగాను జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ చర్యలను నిరసిస్తూ ఒడిషా, పంజాబ్ ప్రభుత్వాలు తగు చర్యలను తీసుకొనిమళ్లీ మొదటి స్థానంలోకి చేర్చి రాసేటట్లుగా చేయటమూ, గోవాలోని చిన్నతరహా న్యాయస్థానాలలో కొంకణి భాష వాడకాన్ని తప్పనిసరి చేస్తూ కొంకణీ భాష టైపుచేసేవారిని నియమించేందుకు ఆధికారిక ప్రకటనలు జారీచేయడం, రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూలులోభోజపురి, రాజస్థానీ భాషలను చేర్చేందుకు డిమాండును తిరిగి లేవనెత్తడం. కర్ణాటకలో తుళు భాషా బోధన, పశ్చిమ బెంగాల్లో అధికారిక భాషలుగారాజబంశీ మరియు కురుఖ్ భాషలకూ గుర్తింపు, గిరిజన భాషలలో ప్రాథమిక విద్యను బోధించే దిశగా ఒడిషా ప్రభుత్వం సిద్ధపడటం మొదలైన చర్యలు భారతదేశంలోని పలు రాష్ట్రాలలోని ప్రజలూ ఆయా రాష్ట్రాల్లోని ప్రభుత్వాలూ తమ స్థానిక భాషలపట్లచూపిస్తున్న ప్రత్యేక ఆసక్తి రాజకీయ, సాంస్కృతిక రంగాలలో భారతీయ భాషలను వేగంగా అభివృద్ధి చెందేందుకు దోహదం చేస్తాయి. స్థానిక భాషలను కాపాడుకోవడం అంటే భాషలను అనుసంధానించటమే – తద్వారా భారతీయులను ఏకం చేయడమే. ఇది గణతంత్రభారత భావనకు అర్థం – ఇక్కడే భాషా సమానత్వం ఉంది. ఈ భాషా సమతుల్యతే బహుళభాషా భారత రాజకీయ సామాజిక వ్యవస్థ సమైక్యతకూ సమగ్రతకూ హామీ ఇస్తుంది. ప్రపంచంలో, ఆంగ్ల బాస్ అన్ని భాషలకూ ఒక పెద్ద ముప్పుగా పరిణమించింది. భారతీయ భాషలపై ఈ పెత్తందారీతనాన్ని ఎదుర్కోవడానికీ భారతీయ భాషలను స్థిరీకరించేందుకూ భాషా సమానత్వం చాలా ముఖ్యమైనది. అంతర్గతంగా, భారత దేశంలో భాషా సమానత్వ భావన ఆంగ్లభాష ఆధిపత్యాన్ని ఎదుర్కోవటానికీ స్థానిక భాషలను పటిష్ట పరచటానికీ తద్వారా వివిధ భాషలకూ ఆ భాషలను మాట్లాడే ప్రజలకూ సాధికారితను కలిగిస్తుంది.

ప్రస్తుతం, వివిధ రాష్ట్రాలలో స్థానిక భాషల హక్కుల కోసం పోరాడే సంఘాల పుట్టుక, విస్తరణతోపాటువాటి ప్రభావంకూడా పెరుగుతోంది. ఏకత్వంలో వైవిధ్యానికి నిజమైన స్ఫూర్తిగా, ఇప్పుడిప్పుడే ఒక రాష్ట్రం యొక్క భాషా హక్కుల పోరాటానికి మద్దతుగా ఇతర రాష్ట్రాల భాషా హక్కుల సంఘాలు ప్రతిస్పందించడం అసాధారణ రీతిలో పెరుగుతోంది. బెంగళూరులో కర్ణాటక ప్రభుత్వ భాషా విధానానికి, ఉదా.మెట్రోలో కన్నడ భాషావాడకానికిమద్దతుగా మహారాష్ట్ర, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, పంజాబ్ భాషా హక్కుల పోరాట సంఘాలు కలిసికట్టుగా నిలబడ్డాయి. రాష్ట్ర స్థాయిలో ఈసమస్య ఒక రాష్ట్ర స్థానిక భాషాహక్కులకు సంబంధించినదైనా, ఇతర రాష్ట్రాల మద్దతు సమైక్య వేదిక రూపంలో కలిసి వచ్చినప్పుడు మాత్రం ఇది ఓఅసాధారణ తాత్విక మలుపు తీసు కొని, జాతీయ స్థాయిలో భాషాసమానత్వం రూపుదిద్దుకుంటోంది. పలు స్థానిక భాషల హక్కుల సంఘాల ఉమ్మడి వేదిక పిలుపు. ఇందుకోసం 'భాషా సమానత, హక్కుల ప్రచార సంస్థ' (CLEAR) ఆవిర్భవించింది. భాషా (Language) సమానత్వం (Equality), మరియూ(And)హక్కుల (Right) ప్రచారానికి(Compaign) ఈ సంస్థ కట్టుబడింది. (CLEAR) భాషా సమా నత్వం అనేది భిన్న భాషా ప్రజల జాతీయఉమ్మడి కార్యక్రమం. ఇది 2015 నాటి చారిత్రాత్మక చెన్నై ప్రకటనతోమొదలైంది. ఈ ప్రకటనే 2016 నాటి ఢిల్లీ తీర్మానాలకు దారితీసింది. ఈ ప్రచారాన్ని తరువాతి స్థాయికి తీసుకుపోయేలక్ష్యంతో 2018 ఫిబ్రవరి 21, అంతర్జాతీయ

మాతృభాషా దినోత్సవం సందర్భంగా, 22 స్థానిక భాషల హక్కుల ప్రతినిధులు, భాషా సమానత్వం హక్కుల పోరాటంలో భాగంగా బెంగుళూరులో 19-21 తేదీలలో సమావేశమై చేపట్టిన కార్యగోష్ఠిలో ఈ కింది చూపిన ఉమ్మడి తీర్మానాలను ప్రవేశపెట్టారు. (తీర్మానాలను ఈ సంచిక 2 వ అట్టపై చూడండి...)

రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు, విద్యావేత్తలు, పౌర సమాజం, మీడియా, ఉద్యోగులూ సహ ఉద్యోగుల సంస్థల సహకారంతో భాషా సమానత్వం, హక్కుల సాధన కోసం నిరంతరం శ్రమించేందుకు సంసిద్ధమని ఈ వేదిక ప్రకటించింది.

మాతృభాషా దినోత్సవ సందర్భంలో ఏర్పాటు చేసిన మూడు రోజుల సమావేశంలో (ఫిబ్రవరి, 19 - 21),"భాషా సమానత్వం - భారత రాజ్యాంగం, అవసరమైన సవరణలు, చట్టపరమైన అంశాలపై ప్రత్యేక దృష్టి" అనే అంశంపై శ్రీ మను కులకర్ణి, (కర్ణాటక హైకోర్టు న్యాయవాది) అతిథి ప్రసంగంతో ప్రారంభమై, మొత్తం23 భాషలకు సంబంధించి 30 ముప్పై ప్రసంగాలతో సభ జరిగింది. అందులో తెలుగు, కన్నడ, మలయాళం,తుళు,కొడవ, బడుగు, పూర్వాంచలి, సౌరాష్ట్రీ, కోసలి, అస్సామీ, కొంకణి, గుజరాతి, ఒడియ, వజ్జిక, అంగిక, మైథిలి, పంజాబీ, బంగ్లా, బంజారా, బఘేలీ మొదలైన భాషల ప్రతినిధులు పాల్గొన్నారు.

## స్పందనను వ్రాయండి

**'అమ్మనుడి'**లో రచనలపై
మీ స్పందనను వ్రాసి పంపండి!
సంపాదకుడు **'అమ్మనుడి'**,
జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి,
మాచవరం, విజయవాడ-520 004.

ఇ-మెయిల్ : *editorammanudi@gmail.com*

ఆచార్య జోగా సింహ ప్రాథమిక విద్యలో మాతృభాష ప్రాముఖ్యత గురించి అధ్యక్ష ప్రసంగం చేయగా, బార్సిలోనా డిక్లరేషన్ ఆఫ్ లింగ్విస్టిక్ రైట్స్ - మూల బిందువులు అనే అంశంపై సందీప్ కంబి ప్రసంగించారు. భారతీయభాషలూ - సమాజం - ఆర్థికాంశాలు అనే అంశంపై ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు చేసిన ప్రసంగం పలువురను ఆకట్టుకొంది. మూడవ రోజు సమావేశం కన్నడ ప్రాధికార సంస్థ అధ్యక్షులు ఆచార్య శ్రీ ఎస్.జి.సిద్ధరామయ్యగారి కార్యాలయంలో మధ్యాహ్న భోజనంతో ముగిసింది.




**భాష లేకపోతే భావంలేదు ; నీ భావాల్ని నీ భాషలో చెప్పడమే సరైనది**

**తెలుగుకు సాధికారతతోనే తెలుగు రాష్ట్రాల అభివృద్ధి**

వీవెన్
9963029061

# "కంప్యూటర్లలో తెలుగు" నుండి "తెలుగులో కంప్యూటర్లు" వైపు పయనం–స్థానికీకరణ

తెలుగు మాత్రమే వచ్చిన వారు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలంటే, వారి అవసరాలకు తగిన ఉపకరణాలు ఉండాలి – మరీ ముఖ్యంగా అవి వారి భాషలో ఉండాలి. జనాలందరినీ మరో భాష నేర్చుకోమనే బదులు, వారికి అవసరమైన సమాచారాన్ని, వారి అవసరాల్ని తీర్చే కంప్యూటర్, మొబైల్ ఉపకరణాలు వారి భాషలోనే అందించడం అన్నది మెరుగైన మార్గం.

తెలుగులో సినిమాలు ఉన్నాయి, వార్తా పత్రికలూ, వార పత్రికలూ, మాసపత్రికలూ ఉన్నాయి. రేడియో, టీవీ ఛానెళ్ళూ ఉన్నాయి. మరి కంప్యూటర్లూ, మొబైళ్ళూ తెలుగులో ఉన్నాయా? ఉండొచ్చు! ఉన్నాయి!! కానీ ఉండాల్సినంతగా లేవు. ఈ పరిస్థితిని మార్చివేద్దాం!

తెలుగులో సినిమాలు కావాలంటే, నేరుగా తెలుగులో తియ్యడం ఒక పద్ధతి. వేరే భాషల సినిమాలను డబ్బింగు చెయ్యడం ఒక పద్ధతి. ఈ అనుకరణ పద్ధతిలో నటుల పెదాల కదలికలకు వినబడే మాటలకు పొంతన ఉండకపోయే అవకాశం ఉంది. సినిమాలోని వాతావరణం (పరిసరాలు, పేరు పలకలు, గట్రా) కూడా వేరే భాషలోనే ఉండిపోతూంది. అలా అని పూర్తిగా రీమేక్ చేయాలంటే అదనపు శ్రమ, ఖర్చు, కాలయాపన. అందుకే ఈ మధ్య ఒకే సినిమాను పలు భాషల్లో తీసే మరో పద్ధతి వ్యాప్తి లోనికి వచ్చింది: సినిమా తీసేటప్పుడే దాన్ని పలు భాషలకు అనుగుణంగా తీస్తున్నారు కదా!

సాఫ్ట్‌వేరుని (కంప్యూటర్, మొబైలు ఉపకరణాలను) కూడా ఇదే పద్ధతిలో – అంటే పలు భాషల లోనికి అనువదించుకోడానికి వీలుగా – తయారుచేసుకోవచ్చు. ఆ ప్రక్రియను అంతర్జాతీయీకరణ అంటారు. ఇలా అంతర్జాతీయీకరించిన ఉపకరణాలను పలు భాషలలోనికి, ఆయా స్థానిక వ్యవహారాలకు వాడుకకు అనుగుణంగా మార్చుకోవచ్చు, అనువదించుకోవచ్చు. ఈ ప్రక్రియను స్థానికీకరణ అంటారు.

ఇందువల్లే గూగుల్, మైక్రోసాఫ్ట్, ఫేస్‌బుక్ వంటి సంస్థల ఉత్పత్తులూ సేవలూ, మొజిల్లా ఫైర్‌ఫాక్స్, వర్డ్‌ప్రెస్, గ్నూ/లినక్స్ వంటి స్వేచ్ఛా ఉపకరణాలూ ఇప్పుడు చాలావరకు తెలుగులో కూడా లభిస్తున్నాయి.

తెలుగుకి సంబంధించినంత వరకూ కంప్యూటర్ ఉపకరణాల తెనుగింపులో ఇంకా మనం మొదటి దశలోనే ఉన్నట్టు లెక్క. సంబంధిత పరిభాష, పదజాలం, వ్యవహార సంప్రదాయాలు (మార్గదర్శకాలు) ఇప్పుడిప్పుడే ఏర్పడుతున్నాయి. అయితే, సామాన్య ప్రజల వలే మనం ఈ ప్రక్రియలో పాలుపంచుకోడానికి కొన్ని మార్గాలు ఉన్నాయి:

1. కంప్యూటర్లోనూ, మొబైళ్ళలోనూ మనం తరచూ వాడుతూన్న ఆప్స్ (ఉపకరణాలకు) తెలుగు ముఖాంతరం ఉందేమో చూసి తెలుగులో వాడుకోవచ్చు. ప్రతీ ఉపకరణం లోనూ అమరికల (సెట్టింగుల) విభాగంలో భాషను ఎంచుకునే వీలుందేమో చూడండి. ఉంటే, తెలుగులో పెట్టుకోండి.

2. మీరు తరచూ వాడే ఉపకరణాలు తెలుగులో లేకపోతే, ఆయా కంపెనీలను తయారీదార్లను తెలుగులో కూడా కావాలని అడిగిచూడండి. వారి వెబ్‌సైటులోనో, సామాజిక మాధ్యమాల ద్వారానో, ఈమెయిలు ద్వారానో, వారివారి వినియోగదార్ల సేవా కేంద్రాల ద్వారానో సంప్రదించి చూడండి. తెలుగులోనూ, తెలుగు వాటికీ మార్కెట్ ఉందని వారికి తెలియడానికి ఇది ఉత్తమమైన మార్గం!

3. ఇప్పటికే మీరు తెలుగులో వాడుతున్న ఉపకరణాలలో తెలుగు నాణ్యత ఎలా ఉందో బేరీజు వెయ్యండి. దీని గురించి పత్రికలలో సమీక్షలు రాయండి. ఉపకరణాలలో అర్థం కాని మాటలను, అచ్చుతప్పులను, వాక్యనిర్మాణ దోషాలను ఆయా ఉపకరణాల తయారీదార్లకు తెలియజేయండి.

4. మీకు నచ్చిన, మీరు మెచ్చిన తెలుగు ఉపకరణాల గురించి మీ బంధుమిత్రులకు తెలియజేయండి. తెలుగులో అమర్చుకోడానికి వారికి తోడ్పడండి.

5. కొన్ని సాఫ్ట్‌వేర్ కంపెనీలు వారి ఉపకరణాల స్థానికీకరణకు ఔత్సాహికులను ఆహ్వానిస్తున్నాయి. ఉదాహరణకు గూగుల్ అనువాద సముదాయం. అలానే అనేక ఓపెన్ సోర్సు ప్రాజెక్టుల తెనుగింపులో కూడా మనం పాలుపంచుకోవచ్చు. ఇందుకు ట్రాన్స్‌లేట్‌వికీ.నెట్, ట్రాన్సిఫెక్స్ వంటి స్థానికీకరణ వేదికలు ఉన్నాయి. వీటిలో అనువాదాలు చెయ్యడానికి పెద్ద సాంకేతిక పరిజ్ఞానమేమీ అవసరం లేదు. కాస్త ఆసక్తి ఉంటే, తొందరగానే నేర్చుకోవచ్చు.

6. ఆయా ఉపకరణాలతో బాటుగా, వాటిని ఎలా వాడుకోవాలో తెలిపే పత్రావళి, వాడుకరి మార్గదర్శినులను కూడా తెలుగులోనికి తీసుకురావచ్చు. మన బ్లాగుల్లోనూ, వివిధ పత్రికల సాంకేతిక శీర్షికలలోనూ వీటిపై వ్యాసాలు వ్రాయవచ్చు.

**స్థానికీకరణ మార్గదర్శకాలు**

◈ ఇప్పటి వరకూ కంప్యూటర్ ఉపకరణాల తెనుగింపులో జరిగిన కృషి నుండి ఈ మార్గదర్శకాలను గ్రహించవచ్చు:

◈ తెరపై కనబడే అంశాలలో (కాంటెంటుని మినహాయిస్తే) చాలా మట్టుకు వాడుకరికీ, కంప్యూటరుకి మధ్య సంభాషణగా అనుకోవచ్చు. కంప్యూటరును ఉద్దేశించిన ఆదేశాలు ఏకవచనంలో ఉండాలి. ఉదా : తొలగించు, భద్రపరుచు. వాడుకరిని ఉద్దేశించిన

కవిత

సడ్లపల్లె చిదంబర రెడ్డి
440073636

# చావగొట్టి చెవులు మూసే.....!!

కొండల్లోని బోద గడ్డి తోనో
చెరకు సోగనో చెట్ల ఆకుల్నో
నా నివాసంగా
అందమైన గుడిసెగా అల్లుకొన్నప్పుడు
ప్రతి చూరులోనూ
ఇంటి వాసాల పైనా నీ ఆవాసమే!!

తలపుల మూతలు తెలియని కిటికీల్లో నుంచి
స్వచ్ఛమైన పల్లెటూరి పైర గాలిగా
ఊపిరితిత్తుల్లోనికి అసంకల్పిత క్రియగా
వచ్చీ పోయే ప్రాణ వాయువుగా
అక్షరాల్లోని స్వేచ్ఛకు అసలైన అర్థంగా
రాత్రీ పగలూ తిరుగాడేవు కదా!!

నేను నాగరికతా ముసుగులో అడవుల్ని నరికి
కలపగా కత్తిరించి దూలాలూ, దంతెలుగా
చెట్లను ఇంటి పై కప్పులుగా బందీలను చేసినా

అమ్మ వంటి చెట్ల మీద మమకారాన్ని మరవక
వాటి చంకల సందుల్లోనో
దూలాల చేరెడు రంధ్రాల్లోనో
ముచ్చటగా ప్రాణాల చెలమగా గూడు కట్టి
గది గదిలో మార్మిక కిచ కిచల సందడితో
సహజ రాగాల ప్రకృతి పందిరిగా మార్చే దానివి.

ఆ పాత రోతనలా వదిలేస్తే...!!
ఇప్పుడు నేనో అతి ఆధునికుడ్ని

గువ్వ నువ్వు కాదు కదా!!
చీమా, దోమా, గాలీ ప్రకృతి ప్రేమా
ఇసుమంత కూడా జొరబడని
సిమెంటు కాంక్రీటు ఏసీ ఇళ్ల పెట్టెల్లో
చేతిలో స్మార్టు ఫోనూ,
చెవిలో అరువు అరపుల మోతల్నీ ఒళ్లంతా
రబ్బరు ట్యూబుల్ని నింపుకొంటూ...

ఏ పక్షి ప్రేమికుడు ఉంచిన బొమ్మల్నో చూస్తూ
ఏ పిపాసి చౌరవగా ధ్వనిగా ముద్రించిన స్వరాల్ని విని
"నా పిచ్చుక పాయనే!!" అని
నా కళ్లను నేనే పొడుచుకొని
నేను కబోదిని,ఈ దుష్ట ప్రపంచం
చీకట్లో మునిగి పోతోంది..

ఈ టీవీ టవర్లు, యాంటినాలు, రేడియేషన్లు
నా చూపుల పిచ్చుకను కూల్చి వేశాయి.. అని
ఎంత బాగా గ్లిజరిన్ లేకుండానే అక్షరాలతో
భగవత్ గీతా శ్లోకాలను ఘంటసాల ఆలాపనకు
మించిన శోకాలతో ఏడుస్తున్నానో కదా!!

"చావగొట్టి చెవులు మూసే తత్త్వంతో
ఓ మనిషీ ఎంతగా ఎదిగావయ్యా??" అని అనుకొందేమో!!
ఊరపిచ్చుక పూరి గుడిశెల కోసం
ఫ్యాన్ల కత్తులు తిరగని గదుల కోసం
పగుళ్ల పిలుపుల్తో పిల్చే శిథిల గోడల కోసం
రెక్కలు అలిసేలా ఎక్కెక్కడ తిరుగుతోందో పిచ్చిది...!!

మార్చి 22 పిచ్చుకల దినోత్సవమట కదా!...

సందేశాలు గౌరవవాచకంలో ఉండాలి. ఉదా : మీరు ఈ ఫైలుని నిజంగానే తొలగించాలని అనుకుంటున్నారా?, వివరాల కోసం ఇక్కడ నొక్కండి.

◇ అనువాదాలలో భాషతో పాటు కాక, భావనలను కూడా మన ఆచార వ్యవహారాలకు తగ్గట్టు మార్చుకోవాలి. అంటే, ఇంగ్లీషు వాడు మిలియన్లు బిలియన్లు అన్న వాటిని మనం లక్షలు కోట్లలో చెప్పాలి. గాలన్లని లీటర్ల లోకి, పౌండ్లను గ్రాములు, కిలోలు, టన్నుల్లోకి మార్చి రాసుకోవాలి.

◇ నియతత్వత: ఒక పారిభాషిక పదానికి ఒక మాటని వాడితే, తతిమా అన్ని చోట్లా ఆ సందర్భంలో అదే మాటని వాడాలి.

కంప్యూటర్లు, సాఫ్ట్‌వేర్ అని భయపడకుండా, తెలుగు తెలిసినవారందరూ ఈ విషయంలో దృష్టి సారిస్తే, ఈ రంగంలో పదజాలం పెరుగుతుంది. వ్యవహార సాంప్రదాయాలూ ఏర్పడతాయి. స్థానికీకరణ మార్గదర్శకాలూ తద్వారా ఉపకరణాలలో కనబడే తెలుగూ మెరుగవుతుంది.

## పాఠశాల విద్యలో మాతృభాషే మాధ్యమంగా ఉండాలి

గంగుల బాబు
9391685686

# లిపి సంస్కరణపై చర్చ

రంగనాయకమ్మగారు సూచించిన లిపి సంస్కరణలలో ముఖ్యమైన వాటిని మాత్రమే ప్రస్తావిస్తాను.

1. అచ్చులలో "ఋ, ౠ" ఌ ౡ – లను అల్లే ఐ, ఔ లను ఎత్తివేయాలి. మొదలు ఆ నాలుగు అక్షరాలు అవసరం లేదు. వచ్చిన "ఋ" కు బదులు "ర" కారాన్ని వాడుకోవచ్చు. అల్లే "ఐ.ఔ లకు బదులు అయి, అవుగా వ్రాసినా అర్ధంలో భేదం రాదు.

2. "ఙ, ఞ, క్ష, ఱ" – ఈ నాలుగు తీసి వేయాలి. వీటి అవసరం కూడా రాదు. "ఱ" కు బదులు "ర" వాడవచ్చు. క + ష = క్ష సంయుక్తాక్షరం కనుక దీనిని విడిగా నేర్పవలసిన అవసరం లేదు. అక్షరం పెంపే తప్ప ఫలితం శూన్యం.

3. ఖ, ఘ, ఝ, ఠ, థ –అనే ఈ అక్షరాలను తీసివేసి వాటి స్థానం లో క,గ,ఝ,ఠ,థ, అనే అక్షరాలు చేరిస్తే అక్షరాలు నేర్చుకునే పిల్లలకు సౌకర్యంగా ఉంటుంది.

4. మకారోత్వం "మొ" ఇలా వ్రాయటం అశాస్త్రీయం. అన్ని అక్షరాలకు ఇస్తున్నట్లే దీనికి కూడా ఒత్వం "ొ" ఇలానే ఇవ్వాలి. అలా అయితేనే అన్ని అక్షరాలకు సమానత్వం ఏర్పడుతుంది.

5. దీర్ఘం కూడా అన్ని అక్షరాలకు ఇచ్చినట్లే "ా" ఇలానే ఇవ్వాలి. 'ౘ' గుడిలో పొల్లు దీర్ఘంగా అంగీకరించడం అశాస్త్రీయం. మ, య లకు 'ౘ' గుడిలో పొల్లునిచ్చి దీర్ఘం అంటున్నారు. ఇక్కడ రెండు రకాల దీర్ఘాలేర్పడి పిల్లలను గందరగోళానికి గురిచేస్తాయి. తికమక పడే అవకాశమున్నది.

6. య కు గుడి "యి" ఇలా వ్రాస్తున్నారు. గుడినివ్వకుండా గుడిగా గ్రహించమనటం తప్పుకాదా? ఇవి వీరి ముఖ్యమైన ఆక్షేపణలు.

వీరి దృష్టికెందుకు రాలేదోకాని అచ్చులలోని 'ఒ' కారము హల్లులలోని 'బ' కారము, అల్లే 'మ య కారాలు భేదం లేని ఒకేరూపానికి వస్తున్నవి. వీటి సంగతేమిటి? "ణ" దీనిని పలకటం కష్టం. దీన్ని ఉపయోగించ వలసిన చోట "న" ను ఉపయోగిస్తే తేలికగాను, పెద్దగా అర్ధంలో భేదం రాకుండాను ఉంటుంది. అల్లే "ళ" పలకటం కూడా కష్టమే. దాన్ని వ్రాయవలసి వచ్చినపుడు "ల" ను ఉపయోగిస్తే అర్ధంలో మార్పేమీ రాదు. పైగా ఈ "ణ ళ" లను ఎత్తి వేయడం వలన అక్షరాలు తగ్గి పొదుపును ఏర్పాటు చేసిన వారమవుతాము.

ఈ ఆలోచన వీరికెందుకు రాలేదు? వచ్చే వుంటుంది, కాని ఒక్క సారే సమూలంగా మారిస్తే ఛాందస వాదుల ప్రతిఘటన ఎక్కువై సంస్కరణ లో జాప్యం ఏర్పడుతుందని భావించి, మొదట ఇప్పుడు తాను సూచించిన సంస్కరణకు ఆమోదం పొందిన తర్వాత రెండవ ఘట్టంలో వీటిని సాధించవచ్చని భావించి ఉంటారు.

రంగనాయకమ్మగారూ! ఈ అరకొర సంస్కరణలు వద్దు. దీనివల్ల మనం సాధించేది స్వల్పం. తెలుగు ఉద్యమానికి నాంది పలకండి. అచ్చ తెలుగును ఏర్పాటు చేసుకుందాము. వర్ణమాల నుండి సంస్కృతానికి సంబంధించిన అక్షరాలైన ఌ ౡ (ఇవి ఇప్పటికే లేవు) ఋ, ఐ, ఔ, అచ్చులను, అల్లే హల్లుల్లో ఖ, ఘ, ఙ, ఛ, ఝ, ఞ, ఠ, ఢ, ధ, ఫ, భ, య, శ, ష, హ లను తీసివేస్తే సంస్కృత బెడద తప్పుతుంది. ముఖ్యంగా సంయుక్తాక్షరాల పదాల బాధ కూడా తప్పుతుంది. సరళమైన తెలుగును పిల్లలకు బోధించవచ్చు. ఇవి పోగా మిగిలిన అ ఆ ఇ ఈ ఉ ఊ ఎ ఏ ఒ ఓ అచ్చులు, అల్లే క గ చ జ ట డ న త ద న ప బ మ ర ల వ స హల్లులు వెరసి 27 అక్షరాలు తేలికగా నేర్పవచ్చు. భాషాసాంకర్యాన్ని నిర్మూలించి అచ్చ తెలుగును కాపాడిన వారమవుతాము. పూర్వం కూడా ఈ ప్రయత్నం జరిగింది. పొన్నగంటి తెలగనార్యుడు అచ్చతెలుగులో యయాతి చరిత్ర వ్రాసి అచ్చతెలుగు ఉద్యమానికి శ్రీకారం చుట్టాడు కాని కరుడు గట్టిన సంస్కృత ఛాందసవాదులు ఆయన ఉద్యమానికి పూతమీయలేదు. ఇప్పుడు కాలం మారింది. ఎక్కడ చూసినా విప్లవం, క్రాంతి అంటూ ఉద్యమిస్తున్నారు. ఇది మంచి తరుణం. సమూల సంస్కరణకు నాంది పలకండి. ఈ అచ్చ తెలుగు ఉద్యమం నాయకత్వ లోపంతో కునారిల్లుతుంది. అచ్చ తెలుగు భాషా వాదులను సమీకరించి, నాయకత్వం వహించండి. మా బోటి వారి సహకారం అందుకోండి. అప్పటివరకు ఈ చిన్న చిన్న మార్పుల జోలికి పోకండి. ఎందుకంటే అవి ఆచరణ సాధ్యాలు కావు. ఇవి పరిహాసానికో ఎకసెక్కానికో అనే మాటలు కావు. హృదయపూర్వకంగా చెప్పే మాటలు.

మీరు సూచించిన కొన్ని మార్పుల్లో

క ఖ,జ ఝ, గ ఘ, ట ఠ, త థ, –ఈఒత్తక్షరాలు మిగిలిన వాటికి భిన్నంగా ఎందుకు ఉండాలి. చ ఛ, ద ధ, ప ఫ, బ భ ల వలే క ఖ,గ ఘ, ట ఠ, త థ, వ్రాస్తే అన్ని అక్షరాల్లో సమానత్వమేర్పడి చదవటంలో ఒక తూకము, వ్రాయటంలో సౌలభ్యము ఏర్పడుతుంది గదా. పిల్లలకు కావలసిన తడబాటు, తికమకలేని విధానం కదా? అంటారు.

మీ సూచన ఆకర్షణీయంగా కనిపిస్తున్నా, ఆచరణలో సాధ్యం కాని ఇబ్బందులెదురవుతాయి. మనతరంలోనే "క-క"–క,క-క - ఇలా, ఈ మార్పుని ముద్రణాలయాలు ఆపలేకపోయాయి. 15వ శతాబ్దిలో ప్రారంభమైన అక్షరపు పొక్కిలలో ఒత్తు నిచ్చే పద్ధతి ఇప్పటివరకు మారలేదు. దానికి కారణం పొక్కిలి మధ్య ఒత్తునివ్వటమే. పొక్కిలి ఒత్తుని బెసగనీయకుండా పట్టి ఉంచుతుంది. పొక్కిలిలు లేకపోతే ఇప్పటికే మార్పు ప్రారంభం అయ్యి ఉండేది. రంగనాయకమ్మగారు సూచించిన అక్షరాల్లో పొక్కిలి గలవి రెండే వున్నాయి. జ ట. కనుక వ్రాయసకాడు ఒత్తునిచ్చేటప్పుడు పొక్కిలి పరిధి దాటకుండా ప్రయత్నిస్తాడు. కనుక రెండు చెదరకపోవచ్చు కాని 'క గ త' ఈ మూడు త్వరగా మారిపోతాయి. ఎలా? అంటారా? ఇలా...క ఇప్పటికే ' క ' గా మారింది.

ఒత్తు క - క్ర క్రమంగా ఇలా తొందరలోనే మారిన ఈ వికృత రూపాన్ని చూసి వెనుకటిదే బావుంది ఎడమ వైపుకు అర్ధవృత్తం గీసి, ' ' దాని కింద అడ్డంగా గీత గీసి ' ' ఆ గీత చివర నిలువుగా గీత గీస్తే " " తేలికగా వ్రాయవచ్చు అనే స్థితి వస్తుంది.

వీరి మరో వర్ణ సంస్కరణ "ఘ" ఇది ప్రత్యామ్నాయం. ఇది కూడా త్వరలోనే ఉష్మ "శ" కారమై కూర్చుంటుంది. పూర్వ ఉష్మ శకారం ఇలా ఉండేది. ఆది నేటి శ కారం గా మారింది. మీ వత్తు కు కూడా అదే గతి పట్టి మారి, ఏది ఒత్తు గ, ఏది ఉష్మ 'శ' అని తికమక పడి మళ్ళీ ఈ రెండక్షరాల్లో ఒకదానిని అవశ్యంగా మార్చాల్సి వస్తుంది. గతంలో అలా జరిగింది. తరువాత దాన్ని గురించి వివరిస్తాను.

అట్లే ఇది కూడా గా మారి వెనుక థ రూపానికే వస్తుంది.

ఇవి మిగిలిన 'జ, ,' మాత్రం కొంతకాలం నిలుస్తయేమో చెప్పలేము. ఒకవేళ ఈ రెండు మిగిలినా పై మూడు అక్షరాలను పోగొట్టుకున్నాక ఈ రెండిటివల్ల మనం సాధించేది ఏముంది. కనుక ఇది విఫల ప్రయత్నమే.

"చాల్లే వుర్కోవయ్య, నీ విమర్శ చూస్తుంటే వొళ్ళు మండిపోతుంది. బాగానే ఉన్నది అంటూనే కాని, అర్ధణా అంటూ పుల్లలేస్తావు. నీవు మార్పు కోరని అభివృద్ధి నిరోధకుడవు. భవిష్య స్రష్టలాగా రాబోయే మార్పును గూర్చి చెపుతున్నావే. నీవు చెప్పిన విధంగా మారతాయని ఎలా చెప్పగలవు" అంటారేమో. నేను ఒక్కడినే కాదు అక్షరాలు దిద్దబెట్టిన అనుభవమున్న ప్రతి ఉపాధ్యాయునికి తెలిసిన సంగతే. మా కాలంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండేవి. ఒక్కడే మూడు నాలుగు తరగతులకు చెప్పవలసి వచ్చేది. మొదట అక్షరాలూ దిద్దే పిల్లల పలకలపై వారివారి అక్షరాలను వ్రాసి ఇచ్చి దిద్దమనే వాళ్ళము. వీళ్ళు దిద్దటం ప్రారంభించగానే వాళ్ళను వదిలి మిగిలిన తరగతుల వైపు మరలేవాళ్ళం అప్పుడు పంతులుగారు మనలను చూడటం లేదులే అని నిర్ధారించుకొని దిద్దటమాపి వారిలో వారు మాటలాడుకోవటమో గిల్లుకోవటమో గిచ్చుకోవడమో చేసేవారు. వాళ్ళ గోల భరించలేక చెపుతున్న పాఠం ఆపేసి, బెత్తంతో బల్లమీద బాది దిద్దర్రేమ్రా? అనగానే, అల్లరి ఆపి గబ గబ దిద్దటం మొదలేట్టేవాళ్ళు. కాసేపాగి చూస్తే దిద్దబెట్టిన అక్షరాలు రూపు మారి ఒకే రీతిగా తయారయ్యేవి. వాటిని చెరిపి మళ్ళీ దిద్దబెట్టేవాళ్ళం. ఆనాడది మాకు నిత్యకృత్యం కనుక అక్షరం మారటంలో ఉన్న మర్మ మెరిగిన వాళ్ళం. వేగం అక్షర రూపాన్ని మారుస్తుంది. **వేగం వైపు పరిగెత్తే ఈ యుగంలో అక్షరాలు కూడా వేగంగా పరిగెత్తుతూ మారతాయి.**

రంగనాయకమ్మగారికి ఒళ్ళు మండించే అక్షరాలు కొన్ని ఉన్నాయి. వాటిలో మకారోత్వము ఒకటి.

**మకారోత్వం. ఆపై దీర్ఘం :-**

మొ, మో, మౌ, మూ, ఇలా నాలుగు రకాలైన మకారోత్వాలు, మళ్ళీ వీటిపై దీర్ఘం ఇవ్వవలసి వస్తే ఒక్కొక్క అక్షరానికి నాలుగు రకాలైన ఒత్వాలు మూడు రకాలయిన దీర్ఘాలా? ఒళ్ళు మంట సహజమే. ఒత్వమంటే అన్ని అక్షరాలకున్నట్టే "" ఈ గుర్తే ఉండాలి. దీర్ఘంకూడా అన్ని అక్షరాల కున్నట్టుగానే ఈ గుర్తే ఉండాలి. అలా ఉన్నపుడే పిల్లలకు తేలికగా అర్ధమవుతుంది. శ్రమ తప్పుతుంది. పిల్లలు అడగరు కాని ఇన్ని భేదాలేమిటి? ఎందుకున్నాయి. ఇందులో ఏది తప్పు ఏది ఒప్పు అని అడిగితే అయ్యవారి గతేమిటి? అని రంగనాయకమ్మగారు అడగటం– 'అమ్మనుడి' సంపాదకులు సామల రమేష్‌బాబుగారు దీనిపై చర్చకు ఆహ్వానించటంతో, దీనితీవ్రత అందరికి అర్ధమయింది. అంతా ఆలోచనలో పడ్డారు. అందులో నేను ఒకణ్ణి. నన్ను వేధిస్తున్న ప్రశ్నే యిది. నా అదృష్టానికి నేనక్షరాలు దిద్దబెట్టిన దగ్గర నుండి హైస్కూల్లో పాటాలు చెప్పి, పదవీ విరమణ చేసేవరకు నన్నేపిల్లవాడు అడగలేదు. కనుక బ్రతికిపోయాను. లేకుంటే పిల్లవానికెక్కడ గొట్టో అయ్యవారికి అక్కడ నట్టు, అన్న చందాన తెల్ల ముఖం వేయాల్సి వచ్చేది. పిల్లలే కాదు సుమీ, పెద్దలు ఎవరూ అడగక పోవటం చిత్రం. ఈ సమస్యను నా అందుబాటులో ఉన్న తెలుగు పండితులందరి ముందుంచాను. ఎవరి దగ్గర సరైన సమాధానం లేక పోవడంతో మిన్నకున్నాను. నేడు రంగనాయకమ్మగారు లేవనెత్తటంతో ఆసక్తి కలిగింది. దీన్ని సంస్కరించేది ఎలా? అనే ముందు ఈ అక్షర ఉగమ – వికాసాన్ని గూర్చి చర్చించుకోవాలి. అంటే మూడవ శతాబ్ది నుండి ప్రారంభించాలి.

ఇది అశోకుని ఆంధ్రదేశం లోని శాసనం లో "మ" కార రూపం.

ఇది మకారోత్వం పై రెండు గీతలకు దిగువున సున్నా మీద ఒక అడ్డగీత గీసి ఓత్వానికి గుర్తుగా ఏర్పరుచుకున్నారు. ఇది శాత వాహనుల కాలంనాటి రెండవ శతాబ్దికి చెందింది. అశోకుని ఆంధ్ర శాసనాల్లో మకారోత్వం కానరాలేదు. బహుశ శాతవాహన కాలంలో దాని వలనే ఉండి ఉండవచ్చు.

ఇది విష్ణుకుండిన గోవింద శర్మ తుమ్మలపల్లి శాసనంలోని మకారోత్వం. ఇది నాల్గవ శతాబ్ది కి చెందినది. సున్నా అడుగున చిన్న పొక్కిలి పై సున్నా రెండు గీతలు కుడివైపుకు రావటంతో పాటు ఓత్వం లోను మార్పు వచ్చింది. ఇంతకు ముందున్న అడ్డగీత రెండు సగాలై రెండు గీతలపైనుండి కుడి ఎడమలకు వాలటం తో ఓత్వం నిడివితో పాటు వంకరలు పెరిగాయి. ఇదే స్థితి 5 వ శతాబ్ది వరకు కొనసాగింది.

ఇలా రెండు రకాలయిన మకారోత్వాలు విష్ణు కుండిన రెండవ విక్రమేంద్ర వర్మ, తుమ్మలపల్లి చిక్కుళ్ళ శాసనాల్లో కన్పిస్తవి. ఇవి అరవ శతాబ్దికి చెందినవి. మకారం మీద కుడి వైపుననున్న గీత నుండి కిందకు ఒక గీత ఎడమ వైపున సున్నకానించి కిందకు మరో గీత అట్లే దీనికి వ్యత్యస్తంగా మకారం ఎడమ వైపునున్న గీతనుండి ఎడమ వైపు ఒక గీత, కుడి వైపు సున్నకానించి కిందకు ఒక గీత. ఇలా రెండు రకాలయిన మకారోత్వాలు కనపడతాయి.

విక్రమేంద్ర భట్టారక శర్మ తుండి శాసనం లోను పృధ్వీమూలుని శాసనంలో కొద్ది మార్పులతో కన్పిస్తున్నాయి.

విష్ణు కుండినులను జయించిన దుర్జయ రాజులలో హరివర్మకు చెందిన కట్ట చెరువుశాసనంలో ఈ రెండు రూపాలు కనిపిస్తున్నవి. ఇందులో ముఖ్యమైన మార్పు కింద పొక్కిలితోపాటు పైన ఎడమ విశాలమై పై నున్న గీతల పై నుండి మనం ఇప్పుడు వాడుతున్న

**పరభాషను అడ్డుపెట్టి తెలుగు కాంతినాపలేరు**

క్రావడిని పై నుండి కిందకు బోర్లించినట్లు వ్రాయటం ఈ ఒత్వంలోని ప్రత్యేకత. కాని ఈ ఒత్వానికి తర్వాత ఆదరణ లభించలేదు.

ద : – దుర్జయులను జయించిన రెండవ పులికేసి మారుటూరు శాసనం లో కుడి వైపున కిందకు రావలిసిన గీతపైకెగబాగటం ఇందులోని ప్రత్యేకత. ఇది 7 వ శతాబ్దిలోనిది. తరువాత శాసన కర్తలెవ్వరు దీనిని అనుసరించలేదు.

దు :– ఇది అమోఘ వర్షుని 9వ శతాబ్దంలో ఖాజీపేటలో వేయించిన శాసనంలోనిది. ఇది విష్ణుకుండిన గోవింద శర్మ వేయించిన నాల్గవ శతాబ్ది నాటి శాసనంలో వలే ఒక్కసారిగా ఐదు వందల సంవత్సరాలకు పూర్వ రూపాన్ని సంతరించుకోవటం విశేషం.

దూ డూ :– ఇంతకు ముందెన్నడూ ఏ శాసనంలో లేని ఈ రెండు కొత్త రూపాలు 11 వ శతాబ్ది లోని కాకతీయ దుర్గ భూపతికి చెందిన ఖాజీపేట శాసనం లోనివే . ఈ రెండు రూపాల మకరోత్వాలు కాని తర్వాతి కాలం లో ఎవ్వరూ ఈ రూపాలను ఆదరించలేదు.

మొ, : – దుర్గ రాజు తర్వాత కొద్దికాలానికే కళ్యాణి చాళుక్య చక్రవర్తి హన్మకొండలో(1126) లో వేయించిన శాసనం లోనిది. మనమీనాడు వ్రాస్తున్న "మొ" కు దగ్గరగా కనిపిస్తుంది.

యొ :– ఇది హోయసల భల్లాలుని కలచూరి బిజ్జలుని, 13 వ శతాబ్ది శాసనాల్లో కనిపిస్తుంది. ఈనాటి స్పష్టమయిన ఒకారోత్వం కనిపించటం విశేషం.

మో :–ఇది పదమూడవ శతాబ్దికే చెందిన మొదటి ప్రతాపరుద్రుని హన్మకొండ శాసనం లోనిది. ఈనాటికి ఈ రూపాన్ని మనం వ్రాస్తూనే ఉన్నాము. మొ, మో మొదటి మొ లో రెండు కొమ్ములు ఒకదాని కానించి మరొకటి పైకి వ్రాయబడినది. మో ఈ మకారోత్వం లో ఒక కొమ్ము కిందనుండి పైకి మరొక కొమ్ము మొదటి కొమ్ముకి ఆనించి పై నుండి కింది వైపుకి బోర్లించటం ఇందులోని ప్రత్యేకత.

క్రీస్తు పూర్వం మూడవ శతాబ్ది నుండి ఇప్పటివరకు మకారోత్వ పరిణామ క్రమాన్ని ఇప్పుడు చూద్దాం.



వీటినన్నింటిని పరిశీలించాక మొ, మో, మొ,మూ ఈ నాలుగు సరి అయినవే అనుపించుట లేదా? ప్రస్తుతం మూడు వాడుకలో ఉన్నాయి మొ, మో, మూ వీటిలో ఒక్కదానిని దేన్నితీసుకుందాం. ఏదయినా ఒక్క దానిని ఎన్నుకుంటే, అందుకు తగిన కారణం తెలపాలి.

రంగ నాయకమ్మ గారి అభిప్రాయం ప్రకారం అన్ని అక్షరాల కున్నట్టే ఒత్వం మకారానికీ ఉండాలి. అంటే ఈ గుర్తన్నమాట. ఈ ప్రకారం మో = (మ + ం = మో)

ఇదొక రూపమయితే రెండవది మూ = య + ం = యూ

ఈ రెండిటిలో దేన్ని తీసుకోవాలి. దేన్ని వదలాలన్నది మరొక ప్రశ్న. సరే ఈ రెండిటిలో దేన్నో ఒకదానిని తీసుకుందాం. మళ్ళీ దీనికి దీర్ఘం ఇవ్వవలసి వస్తే రంగనాయకమ్మగారు ్త గుడిలో పొల్లును దీర్ఘంగా అంగీకరించరు. దీర్ఘమంటే అన్ని అక్షరాలకున్నట్టే "ా" ఈ గుర్తునే తీసుకోవాలి. అప్పుడు మో+ా = మో దీన్ని గ్రహించాలా? లేక మ+ం = మో+ా మూ ఇలా వ్రాయాలా ఈ రెండూ వికృత రూపాలనే వారు అంగీకరించరు. అప్పుడు అనివార్యంగా వారికి ఇష్టంలేని మొ, మో ఈ రెంటినే గ్రహించాలి. మొ + ా = మో ఇదొక రూపం మో + ా = మో ఇది రెండవది. ఈ రెండవ రూపంలో వారికిష్టంలేని గుడి తెలియకుండానే జొరబడ్డది. ఇన్ని చిక్కు ముడులతో పీట ముడులతో బిగిసి ఉన్న మకారోత్వము, దాని దీర్ఘం దీన్నెలా పరిష్కరించాలను కుంటున్నారు. అదేదో వారే తెలపాలి.

**యకారము – ఒత్వము**

మకారానికి ఉన్న చిక్కు ముడులన్ని యకారానికి ఉన్నాయి. యకారాన్ని అశోకుని శాసనాల్లో ⅃⅃ ఇలా వ్రాశారు. ఆ తర్వాత క్రమముగా ట, బ, ఛ, య ఇలా మారింది... మళ్ళీ ఒత్వము యొ, యో ఈ రెండక్షరాలు 5–6 శతాబ్దాల నాటివి. యి, ఇు, యీ,యి, ఈ నాలుగు రూపాలు 11 వ శతాబ్దివి. మళ్ళీ య కు గుడి వద్ద మరో పేచీ య కు గుడి శాసనాల్లో నాలుగు రూపాలు కన్పిస్తున్నా రెండు రూపాలు స్థిరత్వానికొచ్చాయి. ,యి, యి'.

ఈ గుడి లేని 'యి' నీ రంగనాయకమ్మ గారు అంగీకరించరు.

వేగంగా వ్రాసేటప్పుడు ,యి, ఇది రాదు "యి" దీన్నే వ్రాస్తారు. వీటికి పరిష్కారం రంగ నాయకమ్మ గారే చూపాలి. లేదంటారా ఏది ఉండాలో ఏది పోవాలో కాలమే నిర్ణయిస్తుంది.

ఝ :– ఒళ్ళు మండించే మరో అక్షరం ఒత్తు జ. ఈ రూపం ఝ ఇలా ఎందుకు ఉండాలి. అన్నింటిల "ఝ" ఇలా ఎందుకు రాయకూడ దంటారు. ఝూన్సీ అన్నప్పుడల్లా నేను జూన్సి అంటాను. పైగా దీనికి వేయవలసినవి ఒక కొమ్మునా లేక రెండా? ఒత్తు రెండు కొమ్ముల మధ్యనా సున్నా దగ్గరా అన్నది, నాకెప్పుడు సందేహమే అంటారు. నిజమే మీకు వచ్చిన సందేహమే నాకు మరోచోట వచ్చేది. ఈ రెండక్షరాలు వ్రాసేటప్పుడు ఒత్తు ఎక్కడివ్వాలి. సున్నా దగ్గరి పొక్కిలిలోనా ? లేక రెండు కొమ్ముల పొక్కిలి మధ్యలోనా? అని తికమక పడేవాణ్ణి. పురుషుడు అని వ్రాయవలసిన వచ్చినప్పుడు పురుఘుడు అని మాఘము అని వ్రాయవలసి వచ్చినప్పుడు మాషుము అని వ్రాసిన సందర్భాలెన్నో ఉన్నవి. ఇలాంటి తడబాటు నాకే కాదు పెద్దలకూ ఉన్నదని తెలిసి స్వాంతన చెందుతున్నాను. దీనికి కారణమేమిటి మన అవగాహనాలోపం కాదంటారా? సరే విషయానికి వద్దాం.

అశోకుని శాసన లిపిలో ఒత్తు జ 'ౡ' ఇలా ఉండేది. ఆది క్రమంగా వట్రువుగా మారే క్రమంలో ౡ, ౡ, ఝ రు చివరి రూపం దగ్గరాగింది. అయితే దీన్ని పోలిన మరో అక్షరం దీనికి పోటి వచ్చింది. అదే రకారం దీని మొదటి రూపం 'P' ఇది కూడా అదే క్రమంగా P, P, V, ර, ర ఈ నాటి రూపం దగ్గరాగింది. దీనికి కొమ్మునిస్తే ర+ ు = రు అవుతుంది.

ఇప్పుడు ఒత్తు జ కారం 'రు' ఇది, రకారానికి ఉత్వం 'రు' ఇది ఈ రెండు అక్షరాలు ఏకరీతిన ఉన్నాయి. ఇది ఆరవ శతాబ్ది నాటిది.

ఒత్తు జ కారం అరుదుగా వచ్చేది. ర కొమ్ము తరచుగా వస్తుంది. తరచుగా వచ్చే రు ను అలాగే ఉంచి ఒత్తు జ కు మరొక కొమ్మునిచ్చి

తెలుగు ప్రాధికార సంస్థ ఏర్పాటుకై చట్టాన్ని వెంటనే తేవాలి

[illegible] ఇలా మార్చారు. రెండిటి మధ్య ఘర్షణ నివారించారు.

ఇది అరవ శతాబ్ది నాటి ముచ్చట, 15 వ శతాబ్దిలో ఒత్తు అక్షరాలను వ్రాసేటప్పుడు లఘు అక్షరాల పొక్కిలిలో ఒత్తు నివ్వటం ఒక విలక్షణ సంప్రదాయమయినందున “ఝ” ఒత్తు నిచ్చి ఒత్తు జ గా స్థిరపరిచారు. ఇంత గతచరిత్ర ఉన్న ఈ ఝ ను మార్చి ఝ ఇలా వ్రాద్దామంటారా? వ్రాసినా ఆది ఎంత కాలముంటుంది? [illegible] ఇలా వికృతాకారానికి రాదని చెప్పగలమా?

ఇలా మనవారు క్రమ క్రమంగా అక్షరాలను ఎందుకు పెంచుతూ వచ్చారు? సంస్కృత పెత్తనం మన భాష మీద ఎక్కువవటంలో తప్పని సరై అక్షరాలు పెంచారంటారు పెద్దలు. మనం మాట్లాడే ప్రతిమాట శబ్దాన్ని వ్రాసేందుకు వీలు కల్పించే క్రమంలో పెరిగాయంటారు కొందరు.

వేల యేండ్లనుండి క్రమ పరిణామంలో మారుతూ వస్తున్న అక్షరాలపై మనం చెయ్యి వేసి మార్చాలనుకోవటం మనమనుకున్నంత సులభం కాదు. పరభాషా సాంకర్యంవల్ల భాషపరంగా మన పదాలెన్నో మరుగున పడిపోయినా ఉచ్చారణ పరంగా మనమెంతో ఎదిగాము. హలంతభాష నుండి అజంతభాషగా మారి, ఏ ఇతర భాషలకు లేని వినసొంపు అయిన స్పష్ట ఉచ్చారణ మన భాషకు సొంతమయినది. ఇతర రాష్ట్రాల వాళ్ళు దేశాల వాళ్ళు మనభాష గొప్పతనాన్ని కొనియాడు తున్నారు. ఒక్క తెలుగు తప్ప మిగిలిన ఏ భాష విన్నపుడు అయినా డబ్బాలో రాళ్లు గల గల ఆడినట్లు ఉన్నవి అంటారు.

తమిళుడు “ప్రశ్న” ను [illegible] అని మనలను పరేషాన్ చేస్తాడు. కళ్యాణి ని కల్లన అని అంటాడు. మనము ఏది పలుకుతామో దాన్ని వ్రాస్తాము. ఏది వ్రాస్తామో దాన్ని పలుకుతాము. కనుక మనకు అక్షరాల సంఖ్య పెరిగిందని కొన్ని తియ్యాలి, కొన్నింటిని మార్చాలి అంటున్నారు. ఇది న్యాయం కాదు ఐరావతము అన్నపుడు అయిరావతము అని, ఔషధం అన్నపుడు అవుషధమనవచ్చునా.

పిల్లలను గుణింతాలను చదివిస్తు ఉంటాము. అక్షరము గుణింతం చెప్పమంటే అలవాటు ప్రకారం క కు ష వత్తు ఇస్తే “కష” అంటాడు. దానితో ఉచ్చారణ స్పష్టత కోల్పోవడం చూసే, స్పష్ట ఉచ్చారణ కొరకు “క్ష” ను చివరన చేర్చారు. పూర్వం పంచ పాండవులను పఞ్చ పాణ్డవులు అని వ్రాసేవారు. వాటి స్థానంలో సున్నా వచ్చింది. పిల్లలకు అవసరం లేకపోయిన ఏ సున్న ఏ అనునాసిక అక్షరానిదో పెద్దలం అయిన మనకి అయినా తెలియ వద్దా? కనుక ఞ, ఙ పిల్లలకు అక్కర్లేకపోవచ్చు గాక, మనం అయినా నేర్చుకోవద్దా?

అక్షరాలు ఎక్కువ అయ్యాయి, కొన్నిటి రూపు మార్చాలి అనుకోవటం కంటే మనకి ఇష్టం అయిన దానిని గ్రహిస్తే చాలు. ఏది ఉండాలో ఏది పోవాలో కాలమే నిర్ణయిస్తుంది. ఉ: [illegible] అట్లే కొన్నింటి రూపమే బాలేదు మార్చాలనుకుంటే అవి మళ్ళీ మొదటికే ఎలా వస్తాయో తెలిపాను.

‘ఋ, ౠ, ఌ ౡ ఙ, ఞ, శ, ష, హ, క్ష, ఱ’ వీటిని పిల్లలకు మొదటనే ఎందుకు నేర్పాలి, ఇవి లేని అక్షరాలు నేర్పి వాటితో పాఠాలు తయారు చేసి పై తరగతులకు వెళ్ళిన తర్వాత నేర్పవచ్చు కదా. దాన్ని గురించి చర్చిస్తే మరొక వ్యాసం అవుతుంది. దాన్ని మరొకసారి ముచ్చటించుకుందాము.

చివరగా ఇంకొక్క మాటచెప్పి ఈ వ్యాసాన్ని ముగిస్తాను. త్యాగయ్య గారు నాలుగేళ్ల ప్రాయంలో ఉన్నపుడు వారి కుటుంబం తమిళనాడుకు వలస పోయింది. అయన పెరిగింది తమిళనాట నడిబొడ్డున ఉన్న తిరువైయ్యార్‌లో. అయన తన కీర్తనలన్నీ తెలుగులో వ్రాశారు. తమిళం రాకనా? కాక తమ కుటుంబం మాతృభాష తెలుగు అనే ప్రేమవల్లా? ఈ రెండూ కాదంటారు త్యాగయ్యగారి పరంపరలో ఐదోతరంవారు అయిన వసంతలక్ష్మిగారు.

వారు త్యాగయ్యగారు నివసించిన తిరువైయ్యార్‌లోనే 90 ఏళ్ళ ప్రాయంలో ఉన్నారు. వారిని దర్శించ వెళ్ళినప్పుడు త్యాగయ్య గారు తెలుగులోనే ఎందుకు రాసారు–ఆ గుట్టేమిటి అని అడిగితే ఏ తమిళులు ఇతర రాష్ట్రాల వాళ్ళు ఇక్కడికి వచ్చినప్పుడు నన్నడిగే ప్రశ్న ఇదే అంటూ సంగీతాన్ని తనలో ఇముడ్చుకొని శ్రుతి శుభగంగా వినిపించే భాష తెలుగు అన్నారు. సందర్భవశాన మరొక మాట కూడా తెలిపారు. మంగళంపల్లి బాల మురళికృష్ణ నా మేనత్త కొడుకు. ఆ మధ్య త్యాగయ్యగారి రెండు కీర్తనలను తమిళంలోనికి అనువదించి ఏదో సంగీత సభలో పాడాడని తెలిసి పిలిపించి చివాట్లు పెట్టాను. త్యాగయ్యకు నీ పాటి తమిళం రాక తెలుగులో వ్రాశాడా? ఇక్కడే తమిళ మాతృభాషా వాగ్గేయ కారులే తెలుగులో వ్రాయటం నీవు ఎరగవా? సంగీతజ్ఞుడవై ఉండికూడా ఈ మాత్రం తెలుసుకోలేక పోయావా?ఇటువంటి అతి పోకడలు పోవద్దు అని హెచ్చరించాను” అంటారామె. సంగీత విదుషీమణి, ఆంధ్ర తమిళ పండితురాలు కనుక ఆమె చెప్పిన సలహాను మనమంతా తలదాల్చి తెలుగు విధ్వంసకర చర్యలకు పూనుకోవద్దని మనవి చేస్తున్నాను.

గమనిక : శాసనాలనుండి, ఇతరుల నుండి గ్రహించింది ప్రాచీనాక్షరాలు మాత్రమే. మిగిలినదంతా నా స్వంత అభిప్రాయమే.

– రచయిత

## ‘అమ్మనుడి’ లభించుచోట్లు

నవోదయ బుక్ హౌస్, ఆర్యసమాజ్ భవనం ఎదురుగా,
కాచిగుడా. **హైదరాబాదు – 500 027.**
ఫోన్ :040–24652387

మైత్రీ బుక్‌హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు
(ఏలూరు రోడ్డు) **విజయవాడ – 520 002.**
ఫోన్ : 9866211995

మణి బుక్‌స్టాల్, షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు**-1.
ఫోన్:7386223538.

**ఓట్లు అడిగేది తెలుగులో...ఉత్తర్వులిచ్చేది ఇంగ్లీషులోనా?**

సి.వి.కృష్ణయ్య
9490300478

# తెలుగు లిపి సంస్కరణ - నూతన బోధనా పద్ధతులు

తెలుగు లిపి నేర్చుకొనేటప్పుడు పిల్లలుగాని, పెద్దలుగాని కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నమాట నిజం. మానవుడి మెదడు హేతు బద్ధంగా ఆలోచిస్తుంది. హేతుబద్ధంగాలేని విషయాలు అంగీకరించడం, గుర్తుపెట్టుకోవడం చాలా కష్టం. అయినా తర్కబద్ధంగా లేకపోయినప్పటికీ మెదడు అనుభవం ద్వారా గుర్తుపెట్టుకొంటుంది. దీనికి అదనంగా కొంతకాలాన్ని అదనపు శ్రమను వెచ్చించాల్సిన అవసరం ఉంది. కాబట్టి ఏనాటికైనా తెలుగు అక్షరాలు సులభంగా నేర్చుకోడానికి సంస్కరణ అవసరం ఉంది.

అయితే మన పిల్లలు తెలుగు ధారాళంగా చదవలేకపోవడానికీ, తప్పుల్లేకుండా రాయలేకపోవడానికి లిపిలో ఉండే క్లిష్టత ఒక్కటే కారణంగాదు. ఇంగ్లీషులో అక్షరాలు 26 అయినప్పటికీ తర్కానికి అందని నియమాలు చాలా ఉన్నాయి. పదాన్ని బట్టి అక్షరం ఉచ్చారణ మారి పోతుంది. దీర్ఘాలకు ప్రత్యేక గుర్తులులేవు. ప్రతిదానికి స్పెల్లింగ్ తెలుసుకొని ఉండాలి. అయినా నేర్చుకొంటూనే ఉన్నారు.

అసలు విషయం తెలుగు భాషకు ప్రాధాన్యత ఇవ్వకపోవడం, తెలుగు రాకపోయినా ఇంగ్లీషు వస్తే చాలనుకోవడం, తెలుగు భాషపై చులకన.

దీనికి తోడు తెలుగు నేర్పే పద్ధతులు అశాస్త్రీయంగా ఉండడం. మొరటుగా బండచాకిరిలా ఉండడం. తెలుగు తమిళ భాషలు తెలిసినవారు తమిళం మాట్లాడడం కష్టం, లిపి నేర్చుకోవడం సులభం అంటారు. అలాగే తెలుగు మాట్లాడడం సులభం, లిపి నేర్చుకోవడం కష్టం అంటారు. మాట్లాడడం సులభం అనడంలో తెలుగు మాటల్లో ఏదో సౌందర్యం దాగి ఉంది. అందుకే తమిళ కవి సుబ్రహ్మణ్య భారతి "సుందర తెలుంగు" అన్నాడు. తమిళం, తెలుగు, కన్నడం, సంస్కృతం నాలుగు భాషలు తెలిసిన రాయలు 'దేశ భాషలందు తెలుగులెస్స" అన్నాడు. ఇలాంటి భాషకు కష్టకాలం వచ్చింది.

**తెలుగుభాషను రక్షించుకోవడానికి మనముందు నాలుగు ప్రధానాంశాలు ఉన్నాయి.**

1. తెలుగు భాషలో పరిపాలనా కార్యక్రమాలు నిర్వహించడం.
2. తెలుగు మాధ్యమంలో విద్యా బోధన.
3. తెలుగు బోధనా పద్ధతుల్లో సంస్కరణ.
4. తెలుగు లిపి సంస్కరణ..

పై నాల్గింటిలో దేనికెంత ప్రాధాన్యత ఇవ్వాలి. తక్షణం మనం దేనిమీద దృష్టి పెట్టాలి? కొంత పూనుకుంటే ప్రయత్నం ద్వారా ఏ విషయాన్ని సులభంగా సంస్కరించగలం? ఈ విషయాలు ఆలోచించాలి.

తెలుగు భాషలో పరిపాలనా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉంటే, తెలుగు భాషకు తెలుగువారికి ఇన్ని కష్టాలు వచ్చిఉండేవి కావు. మన పోరాటం దీనిమీదే ఎక్కువపెట్టాలి. ఎందుకంటే ఇది న్యాయబద్ధంగాను, ప్రజాసామ్యబద్ధంగాను కన్పిస్తుంది. జనాన్ని ఏకం చేయడం సులభం. ఒక జాతి హక్కు జాతి స్వాభిమానానికి సంబంధించిన విషయం. ఏ నాటికైనా ఇదే ప్రధానాంశంగా మారుతుంది. దీన్ని అంటిపెట్టుకొనే తెలుగు మాధ్యమంలో చదువులు, లిపి సంస్కరణలూ ఉంటాయి.

ముందుగానే తెలుగు మాధ్యమంలో చదువు అంటే తల్లిదండ్రుల్లో, మేధావుల్లో భిన్నాభిప్రాయాలు ఉంటాయి. అశాస్త్రీయపు ఆలోచనలతో కొట్టుకపోతున్న జనాన్ని ఏకం చేయడం కష్టం. లిపి సంస్కరణకూ చాలా అడ్డంకులు ఉన్నాయి. మిగిలింది బోధన పద్ధతుల్లో మార్పు. ప్రస్తుతం నేను ఈ విషయాన్నే ప్రస్తావిస్తున్నాను.

తెలుగు భాషా బోధనకు సంబంధించి మూడు అంశాలు వివరిస్తాను.

1. లిపి ఎలా నేర్పాలి? (ప్రాథమిక తరగతుల్లో భాషా బోధన)
2. పై తరగతుల్లో భాషా బోధన...
3. తెలుగు భాషా బోధనలో నూతనాంశాలు.

**1. లిపి నేర్పే పద్ధతి :**

ప్రస్తుతం భాషా శాస్త్రాన్ని నేర్పిస్తున్నట్లుగానే తెలుగు లిపి నేర్పిస్తున్నాం. 'అ' నుండి 'హ' వరకు అక్షరాలన్నీ వరుసగానే నేర్పిస్తున్నాం, గుణింతం, వత్తులు నేర్పించడం పూర్తయిన తర్వాత చదవడం నేర్పిస్తున్నాం. నూతన పద్దతుల్లో తెలుగు వాచకాలు వచ్చినా ఎన్ని శిక్షణలిచ్చినా టీచర్లు అక్షరాలను వరుసగా నేర్పించే పద్ధతిని పాటిస్తున్నారు. ఎందుకంటే ఈ పద్ధతి టీచర్లకు సులభం. పిల్లలకు అక్షరాలు గుర్తించేటట్లు చెప్పడంకంటే దిద్దిస్తూనో చూచిరాయిస్తూనో ఇంపోజిషన్లు రాయిస్తూనో ఉండడం సులభం. దీనివలన పిల్లలు విసిగి పోతుంటారు. గుర్తు పెట్టుకోలేక ఇబ్బంది పడుతుంటారు. అక్షరాలు వరుసగా రాయమంటే రాస్తారు. విడివిడిగా అక్షరాలు గుర్తించలేరు. అక్షరాలు వినియోగం (చదవడం) లేనందువల్ల మరిచిపోతూ వుంటారు.

మరో ప్రధాన లోపం ఏమిటంటటే రాయడం ద్వారా చదవడం నేర్పడం, ముందు అక్షరాలు గుర్తుపట్టిన తర్వాత రాయడం నేర్పాలి. ఇది శాస్త్రీయం. గుర్తుపట్టిందాకా టీచర్ విద్యార్థికి సహకరించాలి. గుర్తు పట్టడానికి చదవడానికి టీచర్ బోధనోపకరణాలు ఉపయోగించాలి. ఇదంతా టీచర్ కు కష్టం గనుక పిల్లల్ని రాతలోకి పంపిస్తాడు. అంతటితో చదవడం వెనుకబడుతుంది. ధారళంగా చదవడంరాదు గాబట్టి రాయడం కూడా రాదు. పిల్లలు సులభంగా తమకై తాము నేర్చుకొనే పద్ధతి కావాలి.

**పదపద్ధతి :**

పదాలు చదువుతూ అక్షరాలు గుర్తు పెట్టుకోవడం సులభం. అక్షరాలు గుర్తుపెట్టుకోవడానికి పదమే ఆధారంగా వుంటుంది. వినియోగిస్తూ వుంటారు కాబట్టి అక్షరాలు మరచిపోరు. ఈ రకమైనన వాచకాలతో రెండుమూడు నెలల్లో తెలుగు నేర్చుకొన్న పిల్లల్ని నేను గమనించాను. కాబట్టి తెలుగు లిపి నేర్పే పద్ధతి చాలా ముఖ్యం. ఈ వాచకాలు పిల్లలు తమకై తాము స్వయంగా నేర్చుకోవడానికి వీలుగా వున్నాయి.

**2. పై తరగతుల్లో తెలుగు భాషా బోధన :**

మన తెలుగు పండితులు భాషమీద అభిమానం కల్గించడానికి బదులు భయపడేటట్లు చేస్తున్నారు. తెలుగు భాషా బోధన అంటే పాఠాన్ని

చీల్చి చెండాడడంగా మారిపోయింది. సాహిత్యపు సువాసనలు ఏ మాత్రం ఉండవు. అర్థాలు, నానార్థాలు, ప్రకృతి వికృతులు, సంధులు, సమాసాలు, పర్యాయపదాలు, అలంకారాలు, కంఠస్థ పద్యాలు, పద్యానికి ప్రతి పదార్థం, భావం, సందర్భాలు, ప్రశ్నలు జవాబులు ఇతర అనేక వ్యాకరణాంశాలు. ఇవన్నీ నేర్చుకోవాలి. జీవితంలో ఇవి ఎలా ఉపయోగించుకుంటారు? కమ్మగా ఒక కథ చదివి వినిపించడం, ఒక పద్యం చదవడం, పాట వినడం, పాడడం, ఒక మంచి పుస్తకం గురించి మాట్లాడుకోవడం, ఒక పుస్తకాన్ని పరిచయం చేయడం, ఒక కథ రాయడం, డైరీ రాయడం, కవిత రాయడం తను రాసిన కథగాని, కవితగాని వినిపించడం, ఒక నాటిక చదవడం, నాటకం ప్రదర్శించడం సాహిత్యాన్ని సాహిత్యంగా ఆస్వాదించడం, వివిధ రకాల రచనా ప్రక్రియలను పరిచయం చేయడం – మాండలిక భేదాలు (ప్రాంతీయ) గమనించడం, పత్రికల్లో వివిధ శీర్షికలు పరిశీలించడం – వగైరా విషయాలు ఉండవు. సాహిత్యం హృదయానికి సంబంధించినది – మనిషిని కదిలించే భావాలు ప్రేరేపింపకుండా భయపెట్టించి పారిపోయేటట్లు తెలుగు బోధన జరుగుతున్నది. జీవితంలో ఏ విధంగాను ఉపయోగపడని వ్యాకరణాంశాలతో తెలుగు భాష మీద వెగటు పుట్టిస్తున్నారు. తెలుగు భాషా బోధనా పద్ధతులు మారాలి. హైస్కూలు స్థాయి విద్యార్థులకు భాష మీద ప్రేమ కల్గించేటట్లు బోధన జరగాలి.

### 3. నూతన బోధనా విషయాలు :

సాహిత్యాంశాలతో పాటు నిత్య జీవితంలో వినియోగించుకోడానికి ఉపయోగపడే అంశాలు సిలబస్లో చేర్చాలి. అర్జీ రాయడం, దరఖాస్తులు పూర్తి చేయడం, బయోడేటా, ఉత్తరం, ప్రామిసరీనోటు, రశీదు, రిజర్వేషన్ ఫారం నింపడం, బ్యాంక్ అక్కౌంటు ప్రారంభించడం, పత్రికా వార్తా రచన, క్లుప్తంగా రాయడం, విస్తరించి రాయడం, వ్యాఖ్యానించడం – కథ రాయడం, కవిత్వం రాయడం, పజిల్స్ పూర్తిచేయడం – పజిల్స్ తయారుచేయడం. శ్రద్ధగా వినడం, తర్కించడం, వాదించడం, అంగీకరించడం, చక్కగా మాట్లాడడం, భావయుక్తంగా చదవడం ఇవన్నీ భాషా బోధనలో భాగం కావాలి. అనవసర వ్యాకరణాంశాలు తొలగించి నిత్యజీవితంలో ఉపయోగించుకోడానికి అవసరమైన విషయాలు నేర్పాలి. వ్యాకరణాంశాలు అవసరమనుకొంటే ఇంటర్ నుండి ఉండాలి. బోధనలో మార్పులు సులభమేనని భావిస్తున్నాను. ఎందుకంటే తెలుగు భాషా బోధన అంటే గతంలో వున్న పద్ధతులు తప్ప మన పండితులకు మరొకటి తెలియదు. తెలుగు భాషా బోధకులకు భాషాభిమానులకు వివరించి చెప్పగల్గితే చాలు.

### సారాంశం :

1. లిపి సంస్కరణలు జరగాలి. అంతకంటే ముందు లిపి నేర్పే పద్ధతుల్లో మార్పు రావాలి.

2. రాతపని పక్కనబెట్టి రెండు సంవత్సరాలు పూర్తిగా చదవడం నేర్పించడం మీద దృష్టి పెట్టాలి.

3. హైస్కూలు స్థాయి విద్యార్థులకు తెలుగు భాషా బోధన పద్ధతులు మారాలి. నూతన బోధనాంశాలను సిలబస్లో చేర్చాలి.

4. తెలుగు భాషలోనే పరిపాలన జరగాలి. దీనికోసం ఉద్యమించడం అన్ని విధాలా ఉపయోగం. పాలన ప్రజల దగ్గరకు రావడం దీనితోనే మొదలు అవుతుంది.

కవిత

# కొడిగడుతున్న తల్లి నుడి

చేతబడులకు కాలం చెల్లలేదు
సుదూర తీరాల నుంచి చేస్తూనే ఉన్నారు
ఆంగ్ల మాధ్యమాలు – ఉన్మాద ఉద్యమాలు
అంటూవీళ్ళంతా ఆధునిక మంత్రగాళ్లే
వీరి మాయలో పడ్డారా
మాతృభాషను మరిపిస్తారు మృతభాషగా మిగుల్చుతారు
తెల్లోడు – ఆనాడు సంపదనే కొల్లగొట్టాడు
మరి నేడు – భాష అణుబాంబుతో
సంస్కృతిని ఛిద్రం చేస్తున్నాడు
తెలుగు లోగిళ్లలో దూరిన పామువంటి
పరాయి భాషలు తేట తెలుగును కాటువేస్తున్నాయి
తెలుగుతల్లిని మింగేస్తున్నాయి
ప్రపంచ చరిత్రలో ప్రసిద్ధికెక్కిన ఏ రాజ్యమూ
తన తల్లి భాషను ఎడబాసి
ఏ ఎంగిలి భాషనూ ఆశ్రయించలేదు
మరి తెలుగునుడికే ఎందుకీ దుస్థితి ?
మారాలి ఈ పరిస్థితి!
ఒక జాతిని నాశనం చేయాలంటే
ముందుగా దాని తల్లిభాషను చంపితే చాలునట
అదే జరుగుతోంది
తెలుగు భాష తల్లడిల్లుతోంది
పరభాషపై వ్యామోహంతో
తల్లిభాషను ఇంటినుండి తరిమేస్తున్న ఓ తెలుగోడా...
ఇకనైనా నీ భాష గొప్పతనాన్ని తెలుసుకోరా!
అ ఆ ఇ ఈ లను సంక్షోభ శిధిలాల్లో
సేకరించాల్సిన సమయం రాకముందే మేలుకుందాం
తరతరాల తీయని తెలుగును కాపాడుకుందాం!
అమ్మనుడి నా అస్తిత్వానికి మారుపేరు!!

(గౌరవనీయులు జి.ఉమామహేశ్వరరావుగారు రాసిన **'తెలుగు రాష్ట్రాల్లో భాషా సంక్షోభం'** పుస్తకం చదివాక బాధాతప్త హృదయంతో, ప్రేరణతో రాసిన చిన్న కవిత ఇది.

అమ్మభాష పట్ల ఆయనకున్న ప్రేమకి ఈ చిరు కవితను అంకితమిస్తున్నాను...)

కె.సూర్యనారాయణ
పరిశోధక విద్యార్థి, భాషాశాస్త్ర శాఖ
ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

డా॥ ఈమని శివనాగిరెడ్డి
9848598446

# తరతరాల ఉగాది...శక సంవత్సరమే పునాది

మనదేశంలో చరిత్రను/ కాలాన్ని కొలవటం ఎప్పుడు ప్రారంభమైందో కొంచెం ఆలోచించాల్సిన ప్రశ్న. సృష్టికర్త అయిన దేవుడున్నాడని నమ్మి, ఆ దేవుని / దేవుళ్ల చుట్టూ తిరిగే చరిత్రకందని నాలుగు యుగాలు ఒకపక్క అయితే, సృష్టికర్త దేవుడు లేడనే నాస్తిక / హేతువాదులు చరిత్ర జ్ఞానంతో సిద్ధార్థ గౌతముడు / వర్ధమాన మహావీరుడు లేక బింబిసార, అజాత శత్రుల కాలాన్ని లెక్కలోకి తీసుకొని అందినంత వరకూ క్రమం తప్పకుండా చరిత్రను తెలిపే బుద్ధుడు, మహావీరులు మరణించినప్పటినుంచి ప్రారంభమైన చారిత్రక యుగాలు మరోపక్క ఉన్నాయి. ముందు చెప్పిన నాలుగు యుగాలు ఐతిహాసిక, పౌరాణిక యుగాలుగా గౌరవించటానికే తప్ప, చరిత్రను కొలవటానికి పనికిరావని చరిత్ర పరిశోధకులకు తెలుసు. అశోకుని శాసనాలు, బుద్ధుడు, అశోకుని పై వచ్చిన సింహళ బౌద్ధగ్రంథాలు, రెండు భాషలున్న నాణేలు, శాసనాలు, గ్రంథాల వల్ల గతంలో మనదేశాన్ని పాలించిన దేశీ, విదేశీరాజుల చరిత్ర తెలుస్తుంది. మౌర్యుల తరువాత శుంగులు, శాతవాహనులు, కళింగ ఛేదిరాజులు తమ తమ శాసనాల్లో సింహాసన మెక్కినప్పట్నించి ఆయా రాజుల జీవిత కాలంలో చోటు చేసుకొన్న ప్రధాన సంఘటనల తేదీలను రాసుకొన్నారు. ఇలా ప్రారంభమైన చారిత్రక కాల నమోదు కార్యక్రమానికి విదేశీయులైనా శకులు, మన దేశపు భూభాగాన్ని పాలించి మనకొక చారిత్రక స్పృహను కలిగించే ఒక యుగాన్ని అందించారు. అదే శక సంవత్సరం శకం.

కర్నాటక, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో క్రీస్తు శకం వాడుకలోకి రాకమునుపు, శాలివాహన శకమే చరిత్రకు కొలమానంగా ఉండేది. అసలు శాలివాహన శకమనేది లేదు. నిజానికి 'శక' అన్న పదం పర్షియాలో ఒకజాతి అయిన సిథియన్లను సూచిస్తుంది. ఎప్పుడో క్రీ.పూ. మన దేశానికొచ్చిన ఈ వలస పాలకులు, క్రమంగా వాయవ్య భారతం దిగువ భాగాన్ని ఆక్రమించి పాలించారు. శకుల్ని మరచిపోయి వారిపేర ఒకయుగం ప్రారంభమై, ఆ యుగాన్నే (శకుల తర్వాత) శకంగా పిలుచుకొన్నాం. ఆమాటకొస్తే, మన దేశంలో ఏదో ఒక సందర్భాన్ని పురస్కరించుకొని ఏర్పడిన యుగాలన్నీ (కృత, త్రేత, ద్వాపర, కలియుగాలుతప్ప) శకాలు గానే చెప్పుకోవచ్చు. ఎన్ని శకాలొచ్చినా 'శకులు' ప్రారంభించిన శకవర్షం, శక సంవత్సరం మాత్రం స్వతంత్ర భారతంలో 1959 దాకా జాతీయ సంవత్సరమానంగా కొనసాగింది. మధ్య, పశ్చిమ భారతదేశంలో క్రీ.శ. 1వ శతాబ్ది 78వ సంవత్సరంలో ప్రారంభించబడిన శక సంవత్సరం, లేక సంవత్ లేక శకసంగా శాసనాల్లో పేర్కొనబడింది.

క్రీ.శ.78లో ఏ నేపథ్యంలో శక సంవత్సరం ప్రారంభమైందనే విషయానికి సంబంధించి ప్రామాణిక, ప్రత్యక్ష ఆధారాలు లేనందువల్ల పరిశోధకులు రకరకాల ఊహాగానాలు చేశారు. కొందరు కుషాణ వంశానికి చెందిన మొదటి కనిష్కుడు, ఒక సంవత్సరాన్ని ప్రారంభించాడనీ, దాన్ని ఆయన సామంతులైన శకులు తమ పేరుతో కొనసాగించారనీ, అందుకే కనిష్కుడు ప్రారంభించిన సంవత్సరం శక సంవత్సరంగా, 'శకం'గా గుర్తింపు పొందిందన్నారు. కనిష్కుడు శక సంవత్సరాన్ని ప్రారంభించాడన్న దాన్లో నిజం లేకపోయినా, శకులు క్రీ.శ.78లో ప్రారంభించిన శక సంవత్సర గణన 41 నుంచి 310 దాకా వారి శకంలో కొనసాగింది. ఇదే సందర్భంలో శక సంవత్సరాన్ని ఇతర ప్రాంతాలవారు, మతాలవారు, ముఖ్యంగా జ్యోతిష్యులు, ఖగోళ శాస్త్రవేత్తలు ఎక్కువగా వాడారు. శకుల పాలనలో నున్న గుజరాత్-కథియవాడ్ ప్రాంతంలో జైనుల ప్రభావం ఎక్కువగా ఉండేది. దాంతో శకులు ప్రవేశపెట్టి చరిత్రను లెక్కపెట్టే పద్ధతి (శకం) ని జైనులు, తమ విశ్వాసాలకు ప్రచారం కలిగించటంలో భాగంగా వినియోగించారు. ఈ సందర్భంగా ప్రముఖ జైనాచార్యుడైన సింధూరి కంచిలో రాసిన లోకవిభాగమనే గ్రంథాన్ని శక సంవత్సరం 380 (క్రీ.శ. 458)లో పూర్తి చేసినట్లుగా రాసుకొన్నాడు.

శకుల పాలనలో నున్న పశ్చిమ మాల్వాలోని ఉజ్జయినిలో ఈ శక సంవత్సర గణన ప్రాధాన్యత సంతరించుకోవటంతో అక్కడి ఖగోళ శాస్త్రవేత్తలు కూడా శక సంవత్సరాన్నే పరిగణనలోకి తీసుకున్నారు. ఉజ్జయినీకి చెందిన మాఘ - బ్రాహ్మణుల్లో (పర్షియాలో శకద్వీపం నుంచి వలస వచ్చిన మాఘీయులని కొందరి నమ్మకం) ప్రముఖుడు బృహత్సంహితను రాసిన వరాహమిహిరుడు కూడా ఈ శక సంవత్సరాన్నే వాడటంచేత, ఆ శకానికి బహుళ ప్రచారందక్కింది. బాదామీ చాళుక్యులు తొలుత జైనమతాన్ని అవలంబించటాన వారికోసం బాదామీ వద్ద గుహలను తొలిపించారు. ఆ గుహ కప్పు పైన ముందరి భాగంలో నున్న శాసనంలో బాదామీ కోటను మొదటి పులకేశి శక సంవత్సరం 465 (కీ.శ.543)లో కట్టినట్లు పేర్కొనబడింది. తరువాత ఐహోలులోని రెండో పులకేశి ప్రకటిత శాసనాన్ని రాసిన ఆయన ఆస్థానకవి, జైనాచార్యుడు అయిన రవికీర్తి ఆ శాసనాన్ని కలియుగాబ్ది 3735, మరియు శకాబ్ది 556 (కీ.శ. 634)లో రాసినట్లు పేర్కొన్నాడు. ఈ శాసనంలో కలియుగం, శకసంవత్సరం రెండూ పేర్కొనటాన ఈ శాసనం చరిత్రకారులకు ఎంతగానో వుపయోగ పడింది.

క్రీ.శ. 6-12 శతాబ్దాల మధ్య శాసనాల్లో శక సంవత్సరాన్ని 13వ శతాబ్ది తరువాత అటు కన్నడం, ఇటు తెలుగు శాసనాల్లో శకవర్షం, శకకాలం, శకనృప కాలం, శకనృప రాజ్యాభిషేక సంవత్సరమని వివిధ రకాలుగా శక సంవత్సరాన్ని పేర్కొన్నారు. ఈవిధంగా దేశంలో ముఖ్యంగా మధ్య, పశ్చిమ, దక్షిణ భారతదేశంలో అటు కవులు, పండితులు ఇటు రాజులు, కాలాన్ని శకయుగంలో కొలిచారు. క్రీ.శ. 13వ శతాబ్ది తరువాత మనదేశంలోకి మ్లేచ్ఛులు (ముస్లింలు) ప్రవేశించి, పాలించి, స్థానిక సంప్రదాయాలకు ఆటంకం కలిగించటంతో వారంటే ఇష్టంలేక, శకులు కూడా మ్లేచ్ఛులే గాబట్టి శక సంవత్సరాన్ని వాడటానికి వెనుకాడి, స్వాభిమానంతో దానికి బదులుగా, శకుల సమకాలికులై, దక్షిణాపథాన్నంతా పాలించిన శక్తివంతులైన శాతవాహనుల పేర కాలాన్ని

కొలవాలని నిశ్చయించుకొన్నారు. ప్రతిష్ఠానపురం నుంచి పాలించి, అనేక శత్రురాజుల నుంచి దేశాన్ని కాపాడిన శాతవాహన చక్రవర్తుల ఔన్నత్యాన్ని మరోమారు గుర్తు చేసుకోవటమేకాక, ఘనంగా శ్లాఘించాలనుకొన్నారు. అందుకు వారిపేర ఒక శకాన్ని ప్రారంభించాలనుకొన్నారు. ఒక పక్క ఎప్పట్నించో వాడుకలో నున్న శక సంవత్సరాన్ని ఒక్కసారి విడనాడలేక, శాతవాహన రాజ్య స్థాపకుడని గట్టిగా నమ్ముతున్న శాతవాహనుడు లేక శాలివాహనుని పేర శకులు కూడా గుర్తుండేట్లు ఒక శకాన్ని ప్రారంభించారు. అదే శాలివాహన శకం.

చైత్ర శుద్ధ పాడ్యమి రోజునే శాలివాహన శకం లేక శక సంవత్సరం ప్రారంభం కావటం విశేషం. కొత్తగా ఒక యుగం, లేక శకం ప్రారంభమైంది గాబట్టి దీన్ని యుగాది అని పిలిచారు. మన రాష్ట్రంలో లేదుగాని, కన్నడ, మరాఠా ప్రాంతాల్లో ఈ యుగాదిని, గుడీపాడవా అనే పేరుతో పండుగ చేసుకొంటారు. గుడీ అంటే జెండా అనీ, పాడవా అంటే చైత్రమాసంలో మొదటిరోజు ప్రతిపదా లేక పాడ్యమి అని అర్థం. ఇప్పటికీ ఈ రోజున కర్ణాటక, మహారాష్ట్రలలో శాతవాహన చక్రవర్తి గౌతమీపుత్ర శాతకర్ణి, శకులనోడించి ఉజ్జయినీలో జయపతాకాన్నెగరేసిన గొప్ప చారిత్రక సంఘటనను గుర్తు చేసుకొంటూ, తమ ఇళ్లపై జయపతాక (గుడి)ల నెగరేసి అంబరాన్నంటే సంబరాలను జరుపుకొంటున్నారు. గుడీ పాడవా అనేది కన్నడ పదమనీ, ఈ పదం క్రీ.శ.10వ శతాబ్ది కన్నడ శాసనాల్లో ప్రస్తావించబడిందనీ, శాతవాహన సామ్రాజ్యంలో భాగమైన కన్నడ దేశంలో ఈ సంబరాలు అప్పట్నించే ఉన్నాయని కర్ణాటక చరిత్రను రాసిన పి.బి. దేశాయ్ పరిశోధనలో తేలింది. శాతవాహన సామ్రాజ్యంలో భాగమైన మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో శక సంవత్సరాది /యుగాది / ఉగాదిగా శాలివాహన శకసంవత్సరం ప్రారంభంగా పండుగ జరుపుకొంటున్నారు. ఇదీ యుగాది / ఉగాది కథ. శక శాలివాహన శకం గాథ.

ఈ శకయుగాన్ని గురించి పరిశోధించి, దాన్ని ప్రారంభించింది కార్దమక క్షాత్రపుడైన క్షేష్టనుడని బ్రిటీషు ఇండాలజిస్టు అలెగ్జాండర్ కన్నింగ్ హామ్ వందేళ్లకు ముందే చెప్పాడు. –(ఎ.కన్నింగ్ హామ్, జర్నల్ ఆఫ్ బొంబే బ్రాంచ్ ఆఫ్ రాయల్ ఏసియాటికల్ సొసైటీ వా ××, ఎఫ్.277, న్యూమిస్మెటిక్ క్రానికల్ (1888), పే.252) అసలీ శక సంవత్సరం ఎలా ప్రారంభమైందనే దానికి గుజరాత్ లోని భుజ్ ప్రాంతంలోని కచ్ మ్యూజియంలో ప్రదర్శనలోనున్న ఛేష్టనుని అంధౌ శాసనమే ఆధారం. 1968-69లో డి.సి.సర్కార్ సంపాదకత్వంలో కలకత్తా నుంచి వెలువడిన జర్నల్ ఆఫ్ ఏన్షియంట్ ఇండియన్ హిస్టరీలో శోభనాగోఖలే రాసిన 'అంధౌ ఇన్‌స్క్రిప్షన్ ఆఫ్ ఛేష్ట: ఇయర్-2' అన్న వ్యాసం (పే. 104-111) ప్రచురితమైన తరువాత అంతకుముందు శక సంవత్సరాన్ని ప్రారంభించింది ఎవరు? అనే విషయంపై గల అనేక అపోహలకు తెరదించినట్లైంది.

క్షహరాట నహపణుడు, బలం పుంజుకొని, పశ్చిమ తీరంలోని అపరాస్త, మూలక ప్రాంతాలను, కుంతల దేశంలోని వైజయంతిని సొంతం చేసుకొన్నాడు. ఈ ప్రయత్నాల్లో భాగంగా, నహపణుడు శాతవాహన రాజైన మొదటి పులుమావిని ఓడించటమే కాక, పైథాన్ (నాసిక్-పునా ప్రాంతాల ముఖ్యపట్టణము, శాతవాహనుల రెండో రాజధాని అయిన ప్రతిష్ఠానపురం) ను వశపరచుకొన్నాడు. దీనితో పగ పెంచుకొన్న పులుమావి తరువాత రాజైన అతని కొడుకు, గౌతమీపుత్ర శాతకర్ణి తండ్రి కాలంలో కోల్పోయిన భూభాగాలను తిరిగి సొంతం చేసుకోవాలనుకొన్నాడు. అప్పుడు ఉజ్జయిని నుంచి నహపణుడు పాలిస్తున్నాడు. క్రీ.శ. 54లో సింహాసన మెక్కిన గౌతమీపుత్ర శాతకర్ణి, 17 సంవత్సరాల్లో అనేక ప్రాంతాలను జయించటంలో నిమగ్నమైనాడు. అతడు దక్షిణానికి మరలినపుడు, క్షేష్టనునిపై దాడిచేసి, అతన్ని వధించి, 18వ సంవత్సరంలో పోగొట్టుకొన్న ములక, అపరాంత, కుంతల ప్రాంతాలను జయించి, వైజయంతికి పెద్ద సైన్యాన్ని పంపి, గెలుచుకొని, ఉత్తరానున్న ఆవంతి, అకర ప్రాంతాలను సొంతం చేసుకొన్నాడు. అన్ని ప్రాంతాలను జయించి శాతవాహనాధికారాన్ని పునఃప్రతిష్ఠించిన గౌతమీపుత్ర శాతకర్ణి, శాతవాహనకుల యశః ప్రతిష్ఠాపనకర అని చెప్పుకొన్నాడు.

ఆ తరువాత అతడు దక్షిణ ప్రాంతంపై దాడిచేసి తీరాంధ్రాన్ని కూడా జయించి ఆంధ్రాపథంలో నున్న ధాన్యకటకాన్ని స్వాధీనం చేసుకొన్నాడు. అప్పుడే దక్షిణాపథపతి అని బిరుదును పొందటమేకాక తన నాణేలను తీరాంధ్రంలో చలామణిలో ఉంచాడు. ధాన్యకటకాన్ని మరో రాజధానిగా ప్రకటించాడు. నహపణుని చంపిన తరువాత, అతడు విడుదల చేసిన వెండి, రాగినాణేల పై తన రాజముద్రలను ఒత్తించినట్లు జోగల్తంబి దగ్గర దొరికిన నాణేల నిధి రుజువు చేస్తుంది. గౌతమీపుత్ర శాతకర్ణి మూడు సముద్రాల మధ్యగల దక్షిణాపథాన్ని జయించి, దాన్ని సుస్థిరం చేసుకోవటంలో నిమగ్నమైనాడు. ఇదే అదనుగా, సౌరాష్ట్ర-రాజపుత్ర ప్రాంతాలను పాలిస్తున్న శక, యవన, పహ్లవ ముఖ్యులు, ఛేష్టనుని ఆజ్ఞలపై గౌతమీపుత్ర శాతకర్ణి ఆధీనంలో నున్న ప్రాంతాలపై దాడి చేశారు. శాతవాహన చక్రవర్తి పాలనలోనున్న కొన్ని ప్రాంతాలతోపాటు అవంతిని సొంతం చేసుకొని ఛేష్టనుడు ఉజ్జయినిని తన ముఖ్యపట్టణంగా చేసుకొన్నాడు. జునాగఢ్, పుష్కర్, అజ్మీర్ ప్రాంతాలకు తన కొడుకైన జయదాముడిని పాలకునిగా చేశాడు.

ఇక ఇప్పుడు ఇంతకుముందు చెప్పుకొన్నట్లు ఛేష్టకుని 11 వ సంవత్సరం (పర్షాయె-11) గురించి మళ్లీ చెప్పుకోవాలి. కచ్ మ్యూజియంలో నున్న ఆ శాసనంలోని మొదటి లైనులో (రాజ్ఞోక్షా (తపస/ మహాక్షాత్రపస అన్న ఛేష్టనుని బిరుదు మహారాజుతో సమానం. రుద్రదాముడు తన జునాగఢ్ శాసనంలో తన తాత, ఛేష్టనుడు మహాక్షాత్రపుడని ప్రకటించాడు. ఆ శాసనంలో రాజో మహాక్షాత్రపస్యదు *(స్వ)గృహీతనామ్నహ స్వామి ఛేష్టనస్య పౌత్రం అని ఉంది.* మహాబలవంతుడైన దక్షిణాపథపతి గౌతమీపుత్రునిపై ఛేష్టనుడు సాధించిన విజయానికి కుషాణులతో సహా అందరు రాజులూ ఆశ్చర్యపోయారు. మహాక్షాత్రప/ మహా రాజస్థాయికి ఎదిగిన శకుడైన క్షేష్టనుడు ఉజ్జయినిలో తన విజయాన్ని తాను రాజైన 11 సంవత్సరాలకు ఆ సంవత్సరాన్ని కొత్త సంవత్సరానికి, కొత్త యుగానికి ప్రారంభంగా ప్రకటిస్తూ ఘనంగా ఉత్సవాలు జరిపించాడు. అదే శక సంవత్సర ప్రారంభ సంవత్సరం.

**(తరువాయి 26వ పుటలో...)**

**తెలుగులో పరిపాలించనప్పుడు మనవి తెలుగు రాష్ట్రాలెలా అవుతాయి?**

పెండ్యాల సత్యనారాయణ, అడ్వకేట
9866442034

# న్యాయస్థానాల్లో మాతృభాష

2018 ఫిబ్రవరి 18న విజయవాడలో జరిగిన
'న్యాయస్థానాలలో తెలుగు వినియోగంకోసం-ఉద్యమ సమాలోచన సదస్సు' లో సమర్పించిన పత్రం

న్యాయస్థానాల్లో మాతృభాషలో కార్యకలాపాల నిర్వహణ అనేది ఒక ప్రత్యేకమైన అంశం. మన దేశానికి స్వతంత్రం వచ్చి 70 సంవత్సరాలు పూర్తి అయినా ఇప్పటికీ దిగువ న్యాయస్థానాలతో సహా ఉన్నత న్యాయస్థానాలైన హైకోర్టు, సుప్రీంకోర్టులలో కూడా పరాయి భాష అయిన ఆంగ్లభాషదే పెత్తనం. ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లోని దిగువ న్యాయస్థానాలు, హైకోర్టులో పూర్తిగా ఆంగ్లభాష మాత్రమే రాజ్యమేలుతున్నది. సివిల్ దావాలు, క్రిమినల్ ఫిర్యాదులు, సమాధాన పత్రాలను దాఖలు చేయటం, సాక్ష్యమును రికార్డు చేయటం, తీర్పు, అప్పీలుతో సహా మొత్తం న్యాయ ప్రక్రియ అంతా ఇంగ్లీషులోనే. న్యాయ వ్యవస్థకు మూలమైన న్యాయ శాస్త్ర విద్యాబోధన అంతా ఇంగ్లీషులోనే. న్యాయవ్యవస్థకు మూలమైన న్యాయశాస్త్ర విద్యాబోధన అంతా ఇంగ్లీషులోనే. దీనికి కారణం ఏమిటి? మన మాతృభాష అయిన తెలుగులో న్యాయశాస్త్రాన్ని ఎందుకు బోధించలేక పోతున్నాం? ఈ దురవస్థ నుండి ఎప్పటికి బయట పడగలం? ఒక్కసారి ఆలోచిద్దాం.

కొన్ని శతాబ్దాల క్రితం వరకు అన్ని పంచాయితీలు చెట్టు క్రిందే జరిగేవి. ఒక గ్రామంలోని కరణం, మునసబులే న్యాయ నిర్ణేతలు. అప్పటి స్థానిక ఆచారాలు, మతం కట్టుబాట్లు, సాంప్రదాయాలను అనుసరించి వివాదాలను వారే పరిష్కరించేవారు. వారు చెప్పిందే వేదం, అదే తీర్పు. మరి కొన్ని గ్రామాలలో, గ్రామ పెద్దలతో కూడిన కమిటీ లేక మండలి వివాదాలను పరిష్కరించి తీర్పును వెలువరించటం జరిగేది, రాజరికం రోజులలో రాజే న్యాయాధికారి, కాల క్రమంలో చిన్నపాటి న్యాయవ్యవస్థలకు అంకురార్పణ జరిగింది. మొగల్ రాజైన అక్బర్ 'సదర్ దివానీ అదాలత్', 'సదర్ నిజామత్ అదాలత్' పేరుతో వ్యవస్థీకృత సివిల్ మరియు క్రిమినల్ న్యాయస్థానాలకు విడివిడిగా వ్యవస్థీకరించటం జరిగింది. మొగల్ సామ్రాజ్యం అస్తమించిన తర్వాత ఈస్టిండియా కంపెనీ రాకతో బ్రిటిష్ వలస పాలన ప్రారంభమైంది. తమ దేశపు న్యాయ వ్యవస్థ, న్యాయ సూత్రాలను ప్రామాణికంగా తీసుకుని, సందర్భానుసారంగా కొంత మేరకు స్థానిక సంప్రదాయాలు, అలవాట్లతో సమ్మిళతం చేసి న్యాయ సంబంధిత చట్టాల క్రోడీకరణకు శ్రీకారం చుట్టారు ఆనాటి బ్రిటిష్ వలస పాలకులు. ఆ క్రమంలో సివిల్ ప్రొసీజర్‌కోడ్, క్రిమినల్ ప్రొసీజర్‌కోడ్, భారతీయ శిక్షాస్మృతి, సాక్ష్యాధారాల చట్టం, ఆస్థి బదలాయింపు చట్టం, ఒప్పందాల చట్టం, లిమిటేషన్ చట్టం తదితర అతి ముఖ్యమైన చట్టాలను 1820-1900 సంవత్సరాల మధ్యకాలంలో బ్రిటిష్ వలస పాలకులచే రూపొందించబడి అమలులోకి వచ్చాయి. ఆ చట్టాలన్నీ వారి మాతృభాష అయిన ఇంగ్లీషులోనే రూపొందించబడినాయి. న్యాయశాస్త్ర బోధన కూడా ఇంగ్లీషులోనే. అప్పట్లో న్యాయమూర్తులు కూడా ఆంగ్లేయులే.

ఇదే సమయంలో 1947 లో మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. తెల్లదొరతనం పోయి నల్లదొరతనం అధికారంలోకి వచ్చింది. అయినా, మన పాలకులకు తెల్లదొరలపై అమితమైన ప్రేమ, గౌరవం. స్వరాజ్యం వచ్చినా బానిసబుద్ధి పోలేదు. ఆంగ్లభాషపై వ్యామోహం ఏ మాత్రం తగ్గలేదు. బ్రిటిష్ వలస పాలకులచే రూపొందించబడిన చాలా చట్టాలు ఇప్పటికీ కొద్దిపాటి సవరణలతో యధాతథంగా కొనసాగుతున్నాయి. ఆ చట్టాలు సమూలంగా ప్రక్షాళన చేయబడలేదు. భారతీయం చేయబడలేదు.

ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లో న్యాయ వ్యవస్థ, చట్టాలు, న్యాయ పాలన, న్యాయ శాస్త్రంలో విద్యాబోధన, ఏ విధంగా ఆంగ్లభాషా వలయంలో చిక్కుకున్నామో, ఇందుకు బాధ్యత ఎవరిదో తెలుసుకుందాం. ఈ అంశాలను గురించి మరింత లోతుగా తెలుసుకోవటానికి ముందు, ఇతర రాష్ట్రాలలోని పరిస్థితిని గురించి తెలుసుకోవటం అవసరము. మన రాష్ట్రంలో న్యాయశాస్త్ర విద్యాబోధన అంతా ఇప్పటికీ ఆంగ్లంలోనే, కానీ, ఈ విషయంలో ఉత్తరాది రాష్ట్రాలు ఎంతో పురోగతిని సాధించాయి. మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్ వంటి చాలా ఉత్తరాది రాష్ట్రాలలో న్యాయ శాస్త్ర విద్యాబోధన పూర్తిగా ఆ రాష్ట్రాలలోని అధికారభాష అయిన హిందీలోనే జరగటానికి అవకాశం లభించింది. ప్రశ్నా పత్రాలు హిందీలోనే ఉంటాయి. హిందీలోనే సమాధానం వ్రాయవచ్చు. అదే సమయంలో ఆ రాష్ట్రాలలో న్యాయశాస్త్ర విద్య అభ్యసించే ఇతర రాష్ట్రాల వారికి (హిందీయేతర) విద్యాబోధన ఆంగ్లంలో ఉంటుంది. ప్రశ్నా పత్రాలు ఆంగ్లంలో ఉంటాయి. సమాధానాలు ఆంగ్లంలోనే వ్రాయవచ్చు.

కానీ, ఆ స్థాయిని మనం ఎందుకు అందుకోలేక పోయాం? మనలో అంతర్లీనంగా దాగి ఉన్న ఆంగ్ల భాషా వ్యామోహము, ఆంగ్లభాషా బానిస భావ జాలమే ఇందుకు కారణమా? సుదీర్ఘ కాలం రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ పాలకులు, తెలుగు రాష్ట్ర ప్రజల ఆత్మాభిమానం, ఆత్మ గౌరవం నినాదంగా ఆవిర్భవించి చాలా సంవత్సరాలు మన రాష్ట్రాన్ని పాలించి, ఇప్పుడూ పరిపాలన సాగిస్తున్న తెలుగుదేశం పార్టీలు రెండూ ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సి ఉంటుంది. కారణాలు ఏమైనప్పటికీ, ఎవరు ఏ విధంగా చెప్పినప్పటికీ ఆంధ్రప్రదేశ్ అవతరణ నుండి ఇప్పటివరకు ఏ ఒక్క న్యాయశాస్త్ర గ్రంధాన్నీ ఆంధ్రీకరించటానికి, న్యాయశాస్త్ర విద్యను మన మాతృభాష అయిన తెలుగులోనికి మార్చటానికి ఏ ఒక్క పార్టీ, ఏ ఒక్క ముఖ్యమంత్రి ఎటువంటి ప్రయత్నమూ చేయలేదన్నది మాత్రం అందరూ అంగీకరించాల్సిన కఠోర సత్యం. ఇతర ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే ఈ విషయంలో మనం ఎంత వెనుకబడి ఉన్నామో, ఆంగ్లభాషా వ్యామోహం, భావదాస్యం మనలో ఎంత తీవ్ర స్థాయిలో ఉందో తెలుసుకునేందుకు ఇది ఒక ఉదాహరణ.

### న్యాయస్థానాల్లో తెలుగు మృగ్యం

ఆంగ్లంలో న్యాయశాస్త్ర విద్యాబోధన ప్రభావం సహజంగానే మనరాష్ట్రంలోని న్యాయస్థానాల్లో విచారణ ప్రక్రియపై తీవ్రంగానే పడింది.

మన రాష్ట్రంలోని న్యాయస్థానాల్లో తెలుగుభాష వాడుక ఎక్కడా లేదు. "మన మాతృభాష తెలుగే అయినా, చట్టాలన్నీ ఇంగ్లీషులో ఉన్నాయి. మేము చదువుకున్నది కూడా ఆంగ్లమాధ్యమంలోనే. వాదించేందుకు ప్రామాణికాలైన సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల తీర్పులన్నీ ఆంగ్లంలో ఉంటున్నాయి. సాధారణ వ్యవహారిక తెలుగు వేరు. న్యాయ భాషా పదజాలం వేరు. చాలా న్యాయ పదాలకు తెలుగు అనువాదమే లేదు. అందువలన, అనివార్యంగానే ఇంగ్లీషును ఆశ్రయించవలసి వస్తున్నది" అంటున్నారు చాలామంది అడ్వకేట్లు, ఈ వాదనలోకూడా కొంత వాస్తవం లేకపోలేదు. తెలుగులో న్యాయ ప్రక్రియ శూన్యం కావటానికి గల కారణాలపై మరింత లోతుగా అధ్యయనం చేయటానికి ముందు "న్యాయస్థానాల భాష" గురించి రాజ్యాంగంలోను, ఇతర శాసనాలలోను ఏమి పేర్కొనబడిందో తెలుసుకోవటం అవసరం.

## కేంద్రంలో రాష్ట్రాలలో అధికారభాష

కేంద్ర ప్రభుత్వం, వివిధ రాష్ట్ర ప్రభుత్వాల అధికార భాష, సుప్రీంకోర్టు, హైకోర్టులలోని భాష, చట్టాలు ఏ భాషలో ఉండాలి తదితర అంశాలను గురించి భారత రాజ్యాంగంలోని విభాగం. 17లోని 1,2,3, అధ్యాయంలలో పేర్కొనటం జరిగింది (343,344,345,346,347, 348, 349 అధికరణాలు) 343 వ అధికరణం హిందీని కేంద్ర ప్రభుత్వ అధికార భాషగా ప్రకటించింది. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తేదీ నుండి 15 సంవత్సరాల వరకు కేంద్ర ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ ఆంగ్లంలోనే జరగాలనీ, ఆ15 సంవత్సరాల కాలవ్యవధి ముగిసినప్పటి నుండి కేంద్ర ప్రభుత్వ ఉత్తర ప్రత్యుత్తరాలన్నీ తప్పని సరిగా హిందీలో జరగాలని పేర్కొంటూనే, ఆ కాలవ్యవధి ముగిసిన తర్వాత కూడా ఆంగ్లభాష కొనసాగే విధంగా పార్లమెంటు శాసనం చేయవచ్చు అంటూ ఒక మెలిక కూడా అదే అధికరణంలో పెట్టటం జరిగింది. ఆ అధికరణం ద్వారా నిర్దేశింప బడిన 15 సంవత్సరాల కాలవ్యవధి 1966 తోనే ముగిసింది. కానీ, వివిధ రాజకీయ అవసరాలు, హిందీయేతర రాష్ట్రాల నుండి వచ్చిన ఒత్తిడి పర్యవసానంగా 343 అధికరణం స్ఫూర్తికి తూట్లు పొడుస్తూ, ఆ అధికరణం నిర్దేశించిన 15 సంవత్సరాల కాల వ్యవధి ముగియక ముందే, 1963లో 'అధికార భాషా చట్టం' పేరుతో ఒక చట్టాన్ని పార్లమెంటు ఆమోదించింది. 1966 తర్వాత కూడా అనిర్దిష్టకాలంపాటు (ఇన్‌డెఫినిట్లీ) ప్రభుత్వ పాలనా వ్యవహారాలు ఆంగ్లంలో కొనసాగే విధంగా ఆ చట్టం రూపొందించబడింది. అంటే అధికారికంగా మనదేశ అధికారభాష హిందీ అయినప్పటికీ, అనధికారికంగా వాస్తవంలో ఆంగ్ల అధికార భాషగా కొనసాగేందుకు ఈ చట్టం రాచబాట వేసింది. ఆంగ్లభాష కొనసాగింపుపై 1975 జనవరి 26 తర్వాత సమీక్ష జరగాలని ఆ చట్టంలో పేర్కొనబడినప్పటికీ, ఇప్పటి వరకు అటువంటి సమీక్ష జరగలేదు. అంటే, ఇప్పటికీ అనధికారికంగా ఆంగ్ల భాషా ప్రభావం కొనసాగుతున్నట్లే, జరుగుతున్నదీ అదే.

రాష్ట్ర ప్రభుత్వాలు ఒకటి లేక అంతకన్న ఎక్కువ భాషలను గాని, లేక హిందీనిగాని అధికార భాషలుగా ప్రకటిస్తూ శాసనాలను రూపొందించుకోవచ్చని అధికరణం 345 నిర్దేశిస్తున్నది. అదే సమయంలో, ప్రస్తుతం కేంద్రంలో అధికార వ్యవహారాలు ఏ భాషలో కొనసాగుతున్నాయో, అదే భాషలో వివిధ రాష్ట్ర ప్రభుత్వాల మధ్య, రాష్ట్రములకు కేంద్ర ప్రభుత్వానికి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు జరుగవలెనని అధికరణం 346 నిర్దేశిస్తున్నది. మన రాష్ట్ర అధికార భాష తెలుగే అయినా అధికరణం 346 మరియు అధికార భాషా చట్టం ప్రభావం మూలంగా మన రాష్ట్రానికి ఇరుగు పొరుగు రాష్ట్రాలకు మధ్య, మన రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వానికి మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు ఆంగ్ల మాధ్యమం ద్వారానే జరుగుతున్నాయి. మన రాష్ట్ర ప్రభుత్వ అధికార నోటిఫికేషన్లు ఇంకా ఆంగ్లంలో కొనసాగటానికి ఇది ఒక కారణం, మన రాష్ట్రంలోని న్యాయస్థానాలలో తెలుగు వాడకం మృగ్యం కావటానికి ఇవి అన్నీ పరోక్ష కారణాలే.

## సుప్రీంకోర్టు, హైకోర్టు శాసనముల భాష

మనదేశానికి అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు. వివిధ రాష్ట్రాలకు ఉన్నత న్యాయస్థానం హైకోర్టు. 343, 344, 345, 346, 347 అధికరణాలు ఏ విధముగా ఉన్నప్పటికీ, సుప్రీంకోర్టు, హైకోర్టులలో న్యాయ ప్రక్రియ అంతా ఆంగ్లంలో మాత్రమే కొనసాగాలని అధికరణం 348 నిర్దేశిస్తున్నది. అంతేకాకుండా పార్లమెంటు, రాష్ట్ర శాసన సభలలో ప్రవేశపెట్టబడే బిల్లులు, చట్టాల అధీకృత మూలము (authoritative), రాష్ట్రపతి, గవర్నర్లు జారీ చేయు ఆర్డినెన్సులు, పార్లమెంటు, రాష్ట్ర చట్టసభలు ఆమోదించు రూల్సు, రెగ్యులేషన్స్ మొదలయినవన్నీ తప్పనిసరిగా ఆంగ్లంలో మాత్రమే ఉండాలని కూడా ఈ అధికరణం నిర్దేశిస్తున్నది.

మొత్తం మీద అర్థం చేసుకోవలసింది ఏమిటంటే కేవలం సుప్రీం కోర్టులో మాత్రమే కాకుండా, హైకోర్టులో భాష కూడా ఆంగ్లమే. పర్యవసానం ఏమిటంటే మన రాష్ట్ర అధికారభాషకు స్థానమెక్కడ?

## దిగువ న్యాయస్థానాలలో తెలుగు దీనగాథ

మన హైకోర్టులో తెలుగు పరిస్థితి పై విధంగా ఉంటే, దిగువ న్యాయస్థానాలలో తెలుగు పరిస్థితి మరింత దయనీయంగానూ, దీనాతి దీనంగానూ ఉన్నది. మన రాష్ట్రానికి సంబంధించి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు, సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, జిల్లా కోర్టు, సెషన్సు కోర్టులు దిగువస్థాయి న్యాయస్థానాలుగా పరిగణింపబడతాయి. మరొక రకంగా చెప్పాలంటే హైకోర్టుకన్న తక్కువస్థాయి సివిల్ మరియు క్రిమినల్ కోర్టులు (ఏ పేరుతో పిలువబడినప్పటికి) అన్నీ దిగువ న్యాయస్థానాలే.

దిగువ స్థాయి న్యాయస్థానాలలో భాష గురించి రాజ్యాంగంలో ఎక్కడా నిర్దిష్టంగా పేర్కొనబడిఉండలేదు. అయితే, సివిల్ న్యాయ ప్రక్రియకు సంబంధించి ప్రామాణికమైన సివిల్ ప్రొసీజర్‌కోడ్‌లోను, క్రిమినల్ న్యాయ ప్రక్రియకు సంబంధించి ప్రామాణికమైన క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోను దిగువ న్యాయస్థానాలలో భాష గురించి పేర్కొనబడింది. సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్ 137 ఈ క్రింది విధముగా ఉన్నది.

"సెక్షన్ 137 దిగువ స్థాయి న్యాయస్థానాలలో ఉపయోగించతగిన భాష"

1) ఈ చట్టము అమలులోనికి వచ్చు సమయమున హైకోర్టు పరిధిలో గల ఒక న్యాయస్థానములో ఏ భాష అమలులో ఉన్నదో, ఆ తర్వాత కూడా అదే భాష కొనసాగుతుంది ( రాష్ట్ర ప్రభుత్వము మరొక విధముగా ఆదేశించు వరకు)

2) ఒక న్యాయస్థానములో న్యాయ ప్రక్రియ ఏ భాషలో

కొనసాగవలెనో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించవచ్చు.

3) సాక్ష్యము నమోదు చేయుట మినహాయించి, మిగిలిన లిఖిత పూర్వక ప్రక్రియ ఏ భాషలోనైనా ఉంటుటకు కోర్టు అవకాశము కల్పించినట్లయితే, ఆ భాష ఆంగ్లభాష కావచ్చు. అయితే, కక్షిదారునికి గాని లేక అతని న్యాయవాదికిగాని ఆంగ్లభాష రానట్లయితే (కక్షిదారుని అభ్యర్థన మేరకు) సదరు ఇంగ్లీషు ప్రతులను కోర్టుభాషలోనికి అనువదించి ఆ వ్యక్తికి ఇవ్వ వలెను. ఆ విధముగా అనువదించినందుకగు ఖర్చులకు సంబంధించి కూడా న్యాయస్థానము తగు ఉత్తర్వులను వెలువరించ వలెను".

ఈ సెక్షన్ సారాంశం ఏమిటంటే దిగువస్థాయి న్యాయస్థానాలలో సివిల్ ప్రొసీజర్‌కోడ్ అమలులోకి వచ్చు సమయానికి ఏ భాష అమలులో ఉంటుందో, ఆ తర్వాత కూడా అదే భాష కొనసాగుతుంది. అయితే, న్యాయ ప్రక్రియ ఏ భాషలో కొనసాగించాలో అంతిమంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించాలని ఈ సెక్షన్ పేర్కొంటున్నది. కానీ, కారణాలు ఏవైనప్పటికీ దిగువ స్థాయి సివిల్ న్యాయస్థానాలలో ఉపయోగించ తగిన భాషపై ఇప్పటి వరకు ఏ తెలుగు ప్రభుత్వమూ ఎటువంటి నిర్ణయము తీసుకోలేదు, (ఇక్కడ గమనించవలసిన విషయము ఏమిటంటే చాలా ఉత్తరాది రాష్ట్రాలు ఈ సెక్షన్‌ను సవరించి హిందీనే దిగువ న్యాయస్థానాలలో భాషగా ప్రకటించుకున్నాయి). అందువలన, సివిల్ న్యాయ ప్రక్రియకు సంబంధించి మన రాష్ట్రంలోని దిగువ స్థాయి న్యాయస్థానాలలో ఆంగ్లభాషే పెత్తనం చేస్తున్నది. తెలుగు ఎక్కడా కనపడదు. హతవిధీ, తెలుగు భాషకు ఇంతటి దీనావస్థా! దీనికి బాధ్యులు ఎవరు? ఆంధ్రరాష్ట్ర అవతరణ నుండి ఇప్పటి వరకు మన రాష్ట్రాన్ని పరిపాలించిన రాజకీయ పార్టీలది కాదంటారా?

ఇక దిగువస్థాయి క్రిమినల్ న్యాయస్థానాలలో భాష గురించి నేర విచారణ ప్రక్రియా స్మృతిలో పేర్కొనబడింది. ఆ చట్టములోని సెక్షన్ 272 ఈ క్రింది విధముగా ఉన్నది.

"సెక్షన్ 272 : దిగువ న్యాయస్థానములలో భాష" :

ఈ చట్టమునకు సంబంధించి హైకోర్టు మినహాయించి దిగువ న్యాయస్థానములలో ఏభాష వాడబడవలెనో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వములు నిర్ధారిస్తాయి".

ఈ సెక్షన్‌కు అనుగుణముగా అప్పటి అవిభక్త ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 29.3.1974న 485 నెంబరు నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఆ క్రమంలో మోసపూరితంగా రాష్ట్రంలోని దిగువస్థాయి క్రిమినల్ న్యాయస్థానాలకు ఒకే భాష కాకుండా, అనేక భాషలను ఆ నోటిఫికేషన్‌లో పేర్కొనటం జరిగింది. కోస్తా, రాయలసీమ జిల్లాల విషయంలో ఇంగ్లీషు, తెలుగు భాషలను తెలంగాణా జిల్లాల విషయంలో ఇంగ్లీషు, తెలుగు, ఉర్దూ భాషలను దిగువస్థాయి క్రిమినల్ కోర్టుల భాషగా పేర్కొనటం జరిగింది. పొరుగు రాష్ట్రాలను ఆనుకుని ఉన్న సరిహద్దు జిల్లాల విషయంలో అదనంగా మరాఠీ, కన్నడ, తమిళం, ఒరియా భాషలను కూడా చేర్చటం జరిగింది. మొత్తం మీద అన్ని జిల్లాల విషయంలోను ఇంగ్లీషును పేర్కొనటం వెనుక ఉన్న మోసపూరిత కుట్రను, అప్పటి రాష్ట్ర ప్రభుత్వ దురుద్దేశ్యాన్ని గమనించటం అవసరం. దిగువస్థాయి క్రిమినల్ న్యాయస్థానాలలో ఎక్కువ శాతం గ్రామీణ, మండలస్థాయిలోని మేజిస్ట్రేట్ కోర్టులే ఉంటాయి. ఇక్కడి ప్రజలలో ఎక్కువ మంది నిరక్షరాస్యులే. తెలుగు కూడా మాట్లాడటం తప్ప వ్రాయటం, చదవటం వారికి తెలియదు. పై పెచ్చు మన రాష్ట్ర అధికార భాష తెలుగు, ఇటువంటి పరిస్థితులలో దిగువస్థాయి క్రిమినల్ న్యాయస్థానాల భాషలలో ఇంగ్లీషును చేర్చటాన్ని ఏ విధంగా అర్థం చేసుకోవాలి? యాదృచ్ఛికమా, కాకతాళీయమా, లేక ఉద్దేశ్య పూర్వకమా? మోసపూరితమైన ఈ నోటిఫికేషన్ అడ్వొకేట్లకు అయాచిత వరంగా మారింది. ఇంతకు ముందే చెప్పినట్లుగా అడ్వొకేట్లు న్యాయశాస్త్ర విద్యను ఆంగ్లంలో అభ్యసించటం, చట్టాలన్నీ ఆంగ్లంలో ఉండటం అడ్వొకేట్లకు కలిసి వచ్చింది. పర్యవసానంగా దిగువస్థాయి క్రిమినల్ న్యాయస్థానాలలో ఆంగ్లం యథేచ్ఛగా, నిరాటంకంగా, దర్జాగా కొనసాగుతున్నది.

మిత్రులారా,

న్యాయస్థానాలలో మాతృభాష గురించి అర్థం చేసుకునే క్రమంలో సాక్ష్యమును నమోదు చేయటం గురించి కొద్దిగా అయినా తెలుసుకోవటం అవసరం. సాక్షి తెలుగులో చెప్పిన విషయాన్ని యథాతథంగా రికార్డు చేయకుండా న్యాయమూర్తులు ఆంగ్లంలోకి అనువదించుకుని రికార్డు చేస్తున్నారు. అంత అవసరం ఏమిటి? సాక్షి తన మాతృభాష అయిన తెలుగులో చెప్పిన విషయాన్ని ఆంగ్లంలోకి అనువదించే క్రమంలో సాక్షి ఉద్దేశ్యం అంత స్పష్టంగా రికార్డుకాని దృష్టాంతాలు ఎన్నో ఉన్నాయి. తప్పుడు అనువాదం జరిగిన సందర్భాలూ ఉన్నాయి. ఒక చిన్న ఉదాహరణ. (ఇది నిజంగా జరిగింది) ఒక గ్రామీణ రైతు "నా పొలంలో ఇరవై 'తాళ్ళు' ఉన్నాయి" అని సాక్ష్యం చెప్పాడు. న్యాయమూర్తి ఆ వాక్యాన్ని (There are twenty ropes in my land) అని అనువదించారు. పట్టణ ప్రాంతానికి చెందిన ఆ న్యాయమూర్తికి 'తాళ్ళు' అనేది తాటిచెట్టుకు బహువచనం అనేది తెలియక పోవటం వలనే ఈ తప్పుడు అనువాదం, గతంలో తెలుగు టైపు రైటర్లు ఉండేవి. ఇప్పుడు అన్ని కంప్యూటర్ల కీబోర్డులలోనూ తెలుగును నిక్షిప్తం చేసే అవకాశం ఉన్నది. కాని క్రిమినల్ న్యాయస్థానాలలోని న్యాయమూర్తులు సాక్ష్యాన్ని యథాతథంగా తెలుగులోనే రికార్డు చేయటం ద్వారా మాతృభాష యెడల తమ నిబద్ధతను, గౌరవాన్ని ఎందుకు చాటుకోలేక పోతున్నారు?

మిత్రులారా!

ఎవరోవచ్చి, ఏదో చేస్తారని ఆశించే రోజులు కావివి. కేవలము అధికారము, తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలు తప్ప మరేమీ పట్టవు. అధికారము, తాత్కాలిక రాజకీయ ప్రయోజనాలు తప్ప మరేమీ పట్టని. రాజకీయ పార్టీలు, ప్రభుత్వాలు, న్యాయస్థానాలు, న్యాయ వ్యవస్థ, న్యాయస్థానాల్లో మాతృభాష వినియోగాన్ని ప్రోత్సహించటం, చట్టాల ఆంధ్రీకరణ యెడల నిర్లక్ష్యంగా ఉన్నాయంటే ఆశ్చర్యం లేదు. బార్ అసోసియేషన్, అడ్వొకేట్లకు ప్రాతినిధ్యం వహించే ఆంధ్రప్రదేశ్ బార్ కౌన్సిల్ కూడా ఈ విషయంలో ఘోరంగా విఫలం అవుతున్నాయి. ఇవి యాదృచ్ఛికమా, కాకతాళీయమా, ఉద్దేశ్య పూర్వకమా అన్న ప్రశ్నకు

**తెలుగులో పేరుపలక (బోర్డు) లేని అంగళ్లలో కొనుగోళ్లు చెయ్యవద్దు**

సమాధానం చెప్పటం కొంచెం కష్ట తరమే. ఈ ప్రశ్నకు సమాధానం సమస్యపట్ల మనకున్న అవగాహనను బట్టి ఉంటుంది.

కానీ, నిజానికి ఇందుకు అడ్వకేట్లను గాని, బార్ అసోసియేషన్లనుకాని, బార్ కౌన్సిల్‌నుగాని తప్పు పట్టవలసిన అవసరం లేదు. లోపం ఈ వ్యవస్థలో ఉన్నది. మనం నివసిస్తున్న వ్యవస్థ పెట్టుబడిదారీ దోపిడీ వ్యవస్థ. ఈ వ్యవస్థ డబ్బు చుట్టూ, దోపిడీ చుట్టూ పరిభ్రమిస్తుంటుంది. డబ్బుకు కులం, మతం, ప్రాంతం, ఆడ, మగ, భాష మొదలైనవాటితో సంబంధం ఉండదు. ఈ రాజ్యాంగ పరిధిలో ఇటువంటి వ్యవస్థ కొనసాగినంత కాలం దోపిడీ దారుల, పెట్టుబడి దారుల పార్టీలే – అధికారంలో ఉంటాయి. అందువలన, తెలుగుతో సహా ఏ స్థానిక భాషలు ఎదగవు. అభివృద్ధి చెందవు. అభివృద్ధి చెందేది ఆంగ్లం మాత్రమే, మాతృభాషా దినోత్సవాల సందర్భంగా వివిధ పేర్లతో నిర్వహించబడే తెలుగు భాషా సదస్సులు, సభలు, సమావేశాల సందర్భంగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు తెలుగు భాష గురించి, తెలుగు భాష పరిరక్షణ గురించి ఎన్ని మాటలు చెప్పినా, చేతలు మాత్రం శూన్యం. తదనుగుణంగానే ఇప్పటి వరకు న్యాయస్థానాలలో తెలుగు కనపడలేదు. ఇక ముందు కూడా కనపడదు.

అందువలన –

మాతృభాషాభిమానులైన అడ్వొకేట్లు తమకు తాముగానే ఉద్యమించి తెలుగులోనే దావాలను దాఖలు చేయటం, వాదించటం తదితర న్యాయ ప్రక్రియకు శ్రీకారం చుట్టాలి. అదే విధంగా భాషాభిమానులైన న్యాయమూర్తులు కూడా సాక్ష్యాన్ని తెలుగులోనే రికార్డు చేయటానికి, తెలుగులోనే తీర్పులను వెలువరించటానికి శ్రీకారం చుట్టాలి. అప్పుడే, న్యాయస్థానాలలో తెలుగు పతాకం రెపరెపలాడుతుంది.

కొందరు న్యాయమూర్తులు తెలుగులో తీర్పులను వెలువరించినట్లు, కొందరు అడ్వొకేట్లు తెలుగులో దావాలను దాఖలు చేసినట్లు ప్రసార మాధ్యమాల ద్వారా తెలుస్తున్నది. ప్రముఖ పాత్రికేయులు శ్రీ ఎ.బి.కె. ప్రసాద్‌గారు అవిభక్త ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం అధ్యక్షులుగా ఉన్న తరుణంలో 'తెలుగులో న్యాయస్థానాలలో తీర్పులు" అనే పేరుతో ఒక సంకలనాన్ని 2009 లో ప్రచురించారు. అయితే, సదరు న్యాయ మూర్తులు అన్ని తీర్పులను తెలుగులోనే వెలువరిస్తున్నారా, సదరు అడ్వొకేట్లు తమ వద్దనున్న అన్ని దావాలను తెలుగులోనే దాఖలు చేస్తున్నారా అన్న విషయంపై పూర్తి సమాచారం లేదు. వారు ఇప్పటికీ అదే ప్రక్రియను, అలవాటును కొనసాగిస్తుంటే సంతోషమే, వారికి ధన్యవాదాలు, అలా కానట్లయితే, కేవలం కీర్తికండూతి కోసమో, లేక తమకున్న తెలుగు భాషా పాటవాన్ని చాటుకోవటానికో ఆ విధంగా ప్రయత్నించి ఉంటారని భావించుకోవలసి ఉంటుంది.

మిత్రులారా!

నేనొక సామాన్య తెలుగు భాషాభిమానిని. "న్యాయవాది" అని పిలిపించుకోవటానికి ఇష్టపడని అడ్వకేట్‌ని (ఎందుకంటే, అడ్వొకేట్ అనే పదానికి 'న్యాయవాది' అనేది తప్పుడు, దుష్ట అనువాదం). నా అభిప్రాయాలతో మీరు ఏకీభవించక పోవచ్చు. కాని, ఆలోచించండి. అదే నా కోరిక.

**(...22 వ పుట తరువాయి)**

ఖచ్చితంగా క్రీ.శ. 78లో ఈ శకం ప్రారంభమైంది.

పై ఆధారాలనన్నింటినీ పరిశీలిస్తే, శకుడైన ఛేష్టనుడు తన 11వ పాలనా సంవత్సరంలో ఉజ్జయినిలో తన విజయ పరంపరకు గుర్తుగా క్రీ.శ. 78కి సరి అగు సంవత్సరంలో. శతాబ్దాన్ని ప్రారంభించాడనీ, ఆ సంవత్సరంలో గౌతమీపుత్ర శాతకర్ణి తన 24వ పాలనా సంవత్సరంలో ఉన్నాడని చెప్పటానికి వీలు చిక్కింది.

మొదటిసారిగా శాలివాహన శకాన్ని (ఏకాదశ శత వర్షాంగత దాధికం షోడశం చవిక్రమేద్రేషం సంవత్ 111. నవ శత ఏకాశీతి శకగతశాలి వాహనంచ నృపధీశ–శాకే 981) పేర్కొనబడింది.

శ్రీమునీశ్వరుడనే జైనాచార్యుడు తన సిద్ధాంత సార్వభౌమంలో గాథాసప్తశతిని రాసిన శాలివాహనుడే శక సంవత్సరాన్ని ప్రారంభించాడని రాశాడు. మరో సందర్భంలో శాలివాహననృపనిర్ణీత శకవర్షక్రమాగతై (ఎ.ఇ. వా. xvii పే.199) అని (అంటే శాలివాహనుడనే రాజు నిర్ణయించిన శక వర్షం నుంచి), శకేంద్రకాలమనీ (గతాన వర్షాణి శకేంద్ర కారాద్ధతాని రుద్రైగుణ యెచ్చతుర్భిః నదాష్ట సంచాష్ట 8589 యుతాని కృత్వా బిభాజయే చ్ఛూన్యశరాగరామైః బృహత్సంహిత : viii 20) అని చెప్పబడింది.

శక సంవత్సరాన్ని విక్రమాదిత్యుడు ప్రారంభించాడన్న ఒక అపోహ కూడా ఉంది. క్రీ.శ. 1180లో ఖండఖాద్యక వ్యాఖ్యాత అయిన ఆమరాజు శకరాజును విక్రమాదిత్యుడు చంపిన తరువాత శక సంవత్సరం ప్రారంభమైందన్నాడు. (శకా నామ మ్లేచ్ఛా రాజనసేయస్మి కాలేవిక్రమా దిత్యేన వ్యాపాదితః స శక సంబంధీకాలః శాక ఇత్యాచ్ఛ్యతే).

**తరతరాలుగా తెలుగువారు జరుపుకొంటున్న ఉగాదికి శక సంవత్సరమే పునాది.**

శిశువు శారీరక వికాసానికి తల్లిపాలు
మానసిక వికాసానికి తల్లి భాష
గుండెలోతుల్లోంచి వచ్చేదీ, మనసు
విప్పి చెప్పగలిగేది అమ్మనుడిలోనే.

* * *

అమ్మనుడిపై నెనరు లేనివాడు
కన్నతల్లినీ, పుట్టిన నేలనీ
ప్రేమించలేడు..

డా॥ వేదగిరి రాంబాబు
9391343916

# తెలుగు కోసమే పుట్టారు

సాహితీ మహనీయులు తమ అతిసామాన్య జీవితాలనే అనుభవసార విశేషాలతో మేళవించి, అపురూపంగా సాక్షీభూతం చేస్తారు. అంతరంగాలను విప్పి తమ మౌన సందేశాలనే తమ మరణవాంగ్మూలంగా ప్రజలకందజేస్తారు. వాటిని కేవలం పఠనకే గాక ఆచరణాత్మకంగా స్వీకరిస్తే ఎంత బావుంటుంది. అట్టి ఓ కథకుని సజీవ కథనాలు హృదయాలకు హత్తుకుంటాయి.

సూర్యుని లేలేత కిరణాలు లోకం మీద పడి ఒక వింత అందానిస్తున్నాయ్. అందమైన లోకంలో విపరీతమైన సంఘటనలు జరగకూడదా?

ముఖం కడుక్కోవడానికి చేతిని పైకెత్తబోయిన ఆయన చేతిలోంచి హఠాత్తుగా ఆ చెంబు జారి కిందపడింది. ఆ చుట్టుపక్కల ముఖాలు కడుక్కుంటున్న ఇతరత్రా అందరి దృష్టీ ఆ పెద్దాయన మీద పడింది. చేతిలోంచి చెంబు పడటమే ఆలస్యం, ఆయన వెనక్కి విరుచుకుపడిపోయాడు.

ఆయన వయస్సు డెబ్భై దాటి ఉంటుందనిపిస్తోంది. ఆ ఆజానుబాహుడు మూతి వంకర తిరిగి మాటరాక ఇబ్బంది పడుతున్నాడు.

ఇంతలో చాలామంది అక్కడకు చేరారు. ఆ విద్యావిశారదుని దీనావస్థను చూడలేకపోతున్నారు.

అతని నోట మాటరావడంలేదు గాని కళ్ళల్లో ఆవేదన...!

ఏదో గొణుగుతున్నాడు. అదెవ్వరికీ అర్థం కావడం లేదు. ఆయన పెదాల కదలికను బట్టి ఆయన భార్య సీతమ్మ ఆయన నోటవెంట పదే పదే వస్తున్న అర్థంకాని ఆయన మాటలకు ఇంకా అర్థం చెప్పింది.

'ఈ పక్షవాతం వలన నా స్వంతరచనల్నే సాపు ప్రతుల్ని రాయలేని స్థితికొచ్చానే! అంతేకాదు నా స్వంత రచనలను కూడా జాతికి ముద్రించి ఇవ్వలేని స్థితికి వచ్చానే" అని బాధపడుతున్నారు. అంటూ వారు తపన పడుతున్నారు" అంటూ భోరుమంది.

కొందరు ఆయనను హాస్పటల్‌కి తీసుకెళ్ళే హడావుడిలో ఉంటే, ఆ విపత్కర స్థితిని చూసి బాధపడుతున్నారు కొందరు.

ప్రతి మనిషికి జీవితంలో ఈ అనారోగ్య బాధలు తప్పవేమో! వయస్సుతో పాటు ఆయనలో పెరిగిన ఈ తెలుగుపై భాషాభిమానాలు పెద్దవయ్యాయి. అతి చిన్నవయస్సులోనే తండ్రి ఆదేశించినట్టు వైదికశాస్త్రం వేపు మొగ్గుచూపక తెలుగు నేర్వాలని పట్టుపట్టారు. అందుకు తండ్రితోనూ, సోదరుడితో కూడా విభేదించారు. ఆఖరికి తెలుగునే నేర్చుకుంటానని ఇంట్లోంచి బయటకొచ్చేశారు. వారాలు చేసుకొని మరీ తెలుగుని అభ్యసించారు. తెలుగువాళ్ళకి వసంతవాచకాలు ద్వారా 'అ','ఆ'లు మొదలు రామాయణ మహాభారతాలు తెలుగించడం వరకూ అవిరళ సాహిత్యకృషి చేశారు.

'రచయితకి చేయి నోట్లోకి వెళ్ళడానికి మాత్రమే సంపాదన కావాలి. అతని జీవితం జాతి భవిష్యత్ కోసం పాటు పడాలి' అంటూ ప్రబుద్ధాంధ్ర



శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి

అనే పత్రికను తెలుగుభాషా సాహిత్యోద్ధరణకై తీసుకొచ్చారు.

తెలుగుజాతిలో నిబద్ధత, నిజాయితీ లాంటివి పెంచడం కోసమే తాను సాహిత్యసృష్టి చేస్తున్నారు.

సాహిత్య నిబద్ధతే కాదు, గొప్ప వ్యక్తిత్వం ఉన్న వారు కూడా కావడంతో మరణించే ముందు తనమిత్రుడు ఒక లేఖ రాశారు. ఆ లేఖలో ఇంతకుముందు సరస్వతీ పవర్‌ప్రెస్ అప్పు తీర్చడానికి, తన రచనలను అమ్మాలని చూసినా కుదర్లేదనీ ఇప్పుడిక తాను అవసానదశకు రావడంతో తాను సాపు రాసిన రచనలన్ని ఎంతోకొంతకు అమ్మేసి తన రణం తీర్చమని, ఇంకా ఏమైనా మిగిలితే భార్య సీతమ్మకివ్వమని కోరారు.

గొప్పవ్యక్తిత్వం అనడానికి ఇంతకన్న ఉదాహరణ ఏం కావాలి?

గజమెత్తు... అంటే ఏనుగు ఎత్తు రచనలు చేయాలని ఆయన కోరిక. జీవితాంతం కృషిచేసి తన కోరికని నెరవేర్చుకోవడమే కాదు, తెలుగు సాహిత్యాన్ని పండించారు కథక చక్రవర్తి. ఆయన తలుచుకుంటేనే తెలుగువాడి తనువు పులకిస్తుందనడంలో సందేహం లేదు.

ఇలా ఆయన జీవిత ప్రారంభం నుంచీ చివరవరకూ కూడా తెలుగుభాషకే అంకితమై పోయారు.

ఆయన జీవితం – ఆయన ఇష్టపడేది తెలుగు. కష్టపడింది తెలుగు కోసం. తెలుగుకి కీర్తిని తేవడానికోసం ఎన్నో కష్టనిష్ఠూరాల్ని ఎదుర్కొన్నారు. ఇదంతా ఎందుకు? ఒక్క మాటలో చెప్పాలంటే – తెలుగుకోసం పుట్టారు, తెలుగుకోసం కష్టపడ్డారు, తెలుగును తలచుకుంటూనే వెళ్ళిపోయారు. అదే ఆయన మరణవాంగ్మూలం!

మన భాషని గౌరవించాలి. మనమూ తెలుగుకోసం పాటు పడాలి.

ఏప్రిల్ 29
బుద్ధ జయంతి ప్రత్యేకం

అనువాదం:డి. చంద్రశేఖర్
9290091232

# బుద్ధుడు నిరాకరించిన మూడు అక్రియావాదాలు

(అంగుత్తరనికాయ 3:61)



"భిక్షువులారా, మూడు వాదాలు పరంపరగా వస్తున్నాయి. పండితులు వాటిని లోతుగా పరిశీలించి, పరిశోధించి, విశ్లేషించినప్పుడు అవి అంతిమంగా అక్రియావాదం లోనే అంతమవుతాయి. ఆ మూడు వాదాలు ఏవి?

భిక్షువులారా, కొందరు శ్రమణ బ్రాహ్మణులు 'మనిషికి కలిగే సుఖ, దుఃఖ, తటస్థ అనుభవాలన్నీ గత కర్మల కారణంగానే పొందుతాడు' అనే దృష్టి కలిగి వున్నారు.

ఇంకొందరు శ్రమణ బ్రాహ్మణులు 'మనిషికి కలిగే సుఖ, దుఃఖ, తటస్థ అనుభవాలన్నీ ఈశ్వరసృష్టి (దేవుని సృష్టి) కారణంగానే పొందుతాడు' అనే దృష్టి కలిగి వున్నారు.

మరికొందరు శ్రమణ బ్రాహ్మణులు 'మనిషికి కలిగే సుఖ, దుఃఖ, తటస్థ అనుభవాలన్నీ కారణం లేకుండానే పొందుతాడు' అనే దృష్టి కలిగి వున్నారు.

భిక్షువులారా, 'మనిషికి కలిగే సుఖ, దుఃఖ, తటస్థ అనుభవాలన్నీ గత కర్మల కారణంగానే పొందుతాడు' అనే దృష్టి కలిగిన శ్రమణ బ్రాహ్మణులను కలిసి, నేను యిలా ప్రశ్నించాను: "ఆయుష్మంతులారా, 'మనిషికి కలిగే సుఖ, దుఃఖ, తటస్థ అనుభవాలన్నీ గత కర్మల కారణంగానే పొందుతాడు' అని మీరు బోధించటం నిజమేనా?" అందుకు వారు 'అవును' అని చెప్పగా, నేను వారితో యిలా అన్నాను. అటువంటప్పుడు, ఒక వ్యక్తి గత కర్మల కారణంగానే హత్యలు, దొంగతనాలు, వ్యభిచారం, అబద్ధాలాడటం, దురుసుగా మాట్లాడటం వంటివి చేస్తాడు. అతడు గత కర్మల కారణంగానే పిసినారి, దుర్మార్గుడు, తప్పుడు దృష్టి కలవాడు అవుతాడు.

కాని, గత కర్మలు నిర్ణయాత్మకమైనవని వాటిపై ఆధారపడే వారు, ఇది చేయాలి, అది చేయకూడదు అనే సంకల్పం లేనివారవుతారు. ఏది చేయదగినదో, ఏది చేయకూడనిదో తెలియక, అయోమయంలో పడి దిక్కులేనివారవుతారు. అటువంటివారు నిజానికి శ్రమణులు అనే (ధార్మికంగా శ్రమించేవారనే) పేరుకు అనర్హులు. ఇది నేను ఖండించిన మొదటి శ్రమణబ్రాహ్మణ వాదం.

భిక్షువులారా, 'మనిషికి కలిగే సుఖ, దుఃఖ, తటస్థ అనుభవాలన్నీ ఈశ్వరసృష్టి కారణంగానే పొందుతాడు' అనే దృష్టి కలిగిన శ్రమణ బ్రాహ్మణులను కలిసి, నేను యిలా ప్రశ్నించాను: "ఆయుష్మంతులారా, 'మనిషికి కలిగే సుఖ, దుఃఖ, తటస్థ అనుభవాలన్నీ ఈశ్వరసృష్టి కారణంగానే పొందుతాడు' అని మీరు బోధించటం నిజమేనా?" అందుకు వారు 'అవును' అని చెప్పగా, నేను వారితో యిలా అన్నాను. అటువంటప్పుడు, ఒక వ్యక్తి ఈశ్వరసృష్టి కారణంగానే హత్యలు, దొంగతనాలు, వ్యభిచారం, అబద్ధాలాడటం, దురుసుగా మాట్లాడటం వంటివి చేస్తాడు. అతడు ఈశ్వరసృష్టి కారణంగానే పిసినారి, దుర్మార్గుడు, తప్పుడు దృష్టి కలవాడు అవుతాడు.

కాని, ఈశ్వర సృష్టి నిర్ణయాత్మకమైనదని దానిపై ఆధారపడే వారు, ఇది చేయాలి, అది చేయకూడదు అనే సంకల్పం లేనివారవుతారు. ఏది చేయదగినదో, ఏది చేయకూడనిదో తెలియక, అయోమయంలో పడి దిక్కులేనివారవుతారు. అటువంటివారు నిజానికి శ్రమణులనే పేరుకు అనర్హులు. ఇది నేను ఖండించిన రెండవ శ్రమణబ్రాహ్మణ వాదం.

భిక్షువులారా, 'మనిషికి కలిగే సుఖ, దుఃఖ, తటస్థ అనుభవాలన్నీ అహేతుకంగానే, కారణం లేకుండానే పొందుతాడు' అనే దృష్టి కలిగిన శ్రమణ బ్రాహ్మణులను కలిసి, నేను యిలా ప్రశ్నించాను: "ఆయుష్మంతులారా, 'మనిషికి కలిగే సుఖ, దుఃఖ, తటస్థ అనుభవాలన్నీ అహేతుకంగానే, కారణం లేకుండానే పొందుతాడు' అని మీరు బోధించటం నిజమేనా? అందుకు వారు 'అవును' అని చెప్పగా, నేను వారితో యిలా అన్నాను. అటువంటప్పుడు, ఒక వ్యక్తి అహేతుకంగానే, కారణం లేకుండానే హత్యలు, దొంగతనాలు, వ్యభిచారం, అబద్ధాలాడటం, దురుసుగా మాట్లాడటం వంటివి చేస్తాడు. అతడు అహేతుకంగానే, కారణం లేకుండానే పిసినారి, దుర్మార్గుడు, తప్పుడు దృష్టి కలవాడు అవుతాడు.

కాని, అహేతుకత, కారణరాహిత్యం నిర్ణయాత్మకమైనదని దానిపై ఆధారపడేవారు, ఇది చేయాలి, అది చేయకూడదు అనే సంకల్పం లేనివారవుతారు. ఏది చేయదగినదో, ఏది చేయకూడనిదో తెలియక, అయోమయంలో పడి దిక్కులేనివారవుతారు. అటువంటివారు నిజానికి శ్రమణులనే పేరుకు అనర్హులు. ఇది నేను ఖండించిన మూడవ శ్రమణబ్రాహ్మణ వాదం.

భిక్షువులారా, పండితులు లోతుగా పరిశీలించి, పరిశోధించి, విశ్లేషించినప్పుడు అక్రియావాదంలో అంతమయ్యే మూడు వాదాలు యివి."

పరభాషా ద్వేషం, పరభాషా దాస్యం - రెండూ తప్పే



# బౌద్ధం - వైజ్ఞానిక మార్గం

బొర్రా గోవర్ధన్
93906 00157

## 12. బౌద్ధుల వైద్య విధానాలు

వినయపిటకంలోని మహావగ్గలోని ఆరో స్కంధం భైషజ్య స్కంధం. ఏడోదైన చీవర స్కంధంలో జీవకుని వృత్తాంతం ఉంది. బుద్ధుణ్ణి "భైషజ్య గురువు" అంటారని గతంలో చెప్పుకున్నాం. భైషజ్యాలు అంటే మందుల్లు, ఔషధాలు. అంటే శారీరక రుగ్మతలకి ఔషధాలు నిర్దేశించినవాడు బుద్ధుడు' అని దానర్థం.

చరిత్రకు అందిన దాన్నిబట్టి ఏయే రోగాలకు ఎలాంటి ఔషధాలు వాడాలో చెప్పిన తొలి గ్రంథంగా వినయపిటకం నిలుస్తుంది. రుగ్ యజుర్వేదాల్లో ఇలాంటి ఖచ్చితమైన వివరణలు లేవు.

ఈ స్కంధాన్ని తరచి చూస్తే...ఆ తర్వాతి వారైన చరకుడు, సుశృతుడు తమ గ్రంథాల్లో ఈ పద్ధతినే పాటించినట్లు చాలా స్పష్టంగా తెలుస్తుంది. అయితే, వారి రచనల్లో మరింత విస్తృతి ఉంది. దాదాపు ఇదే పద్ధతిని ఇద్దరు వాగ్భటులూ (తాతా మనవళ్ళు) పాటించారు. అందుకే చరక, సుశ్రుతుల్ని బౌద్ధ భైషజ్య వారసులుగా గుర్తిస్తారు. వాగ్భటులైతే 'తాము బౌద్ధులమే' అని చెప్పేశారు. చరక, సుశృతులు కూడా బౌద్ధులేనని కొందరి చారిత్రకుల వాదం.

భారతీయ వైద్య వారసత్వం బౌద్ధంతో మొదలైంది అనడానికి ఎట్టి సందేహం లేదు. ఎందుకంటే వైద్యాన్ని సంస్థాగతం చేసింది బౌద్ధమే! బౌద్ధ సంఘ సభ్యులకు తప్పనిసరి చేసింది. ఈ విషయంలో బుద్ధుని పాత్ర శ్లాఘనీయం.

"తాను ఎంతటి వైద్యుణ్ణయినప్పటికీ తనకు బుద్ధసేవ చేసుకునే అవకాశం కల్పించ"మని జీవకుడు బింబిసారుణ్ణి వేడుకొన్నది అందుకే!

మనం అనుకొన్నట్లు ఇప్పుడు బౌద్ధ వైద్య విధానాల్ని చూద్దాం.

**1. ఐదు ఔషధాలు :-** వాటిలో జీవుల నుండి ఉత్పత్తి అయ్యేవి మూడు. నేయి, వెన్న, తేనె. వృక్ష సంబంధాలు రెండు : నూనె, చక్కెర. ఈ ఐదింటిని భిక్షువులు ఆహారంగా స్వీకరించకూడదు. కానీ, ఔషధాలుగా తీసుకోవచ్చు. వాటిని ఉదయం, సాయంకాలం వేళల్లో స్వీకరించాలి అని బుద్ధుడు చెప్పాడు.

బౌద్ధులు వర్షావాసం చేయాలి. నాలుగు నెలలు అడవుల్లో ఉండాలి. ఆ సమయంలో భిక్షకు వెళ్ళకూడదు. అడవిలో రాలి పడిన పండ్లు మాత్రమే భుజించాలి. ఎక్కువ సమయం ధ్యానంతో గడపాలి -

ఇలా, వర్ష, హేమంత రుతువులు గడిపి, శిశిరం వచ్చేసరికి తిరిగి ఆరామాలకి చేరాలి. కాబట్టి వారికి బలహీనత, ఇతర ఉదర సంబంధ వ్యాధులు వచ్చేవి. ఈ వ్యాధుల్నుండి కోలుకోడానికి కొన్ని మందులు అవసరం అయ్యేవి. అవి కొవ్వు, వేరు మందులు. వీటిలో కాలేయానికి బలం చేకూర్చేవి ముఖ్యమైనవి.

**2. కొవ్వు మందులు :** బుద్ధుడు భిక్షువులకి ఐదు రకాల జంతు కొవ్వుల్ని ఔషధాలుగా తీసుకోడానికి అనుమతి ఇచ్చాడు. వాటిలో

1. ఎలుగుబంటి కొవ్వు (అచ్చ వసం)2. చేపకొవ్వు (మచ్ఛ వసం) 3. మొసలి కొవ్వు (సుసుకా వసం)

4. పంది కొవ్వు (సుకర వసం) 5. గాడిద కొవ్వు (గద్రభ వసం).

వీటిని ఉదయ కాలంలో వండిన వెంటనే ఔషధంగా మాత్రమే గ్రహించాలి. దాచుకొని మరోసారి తినకూడదు.

**3. వేరు మందులు(మూలికలు) : -** ఈ స్కంధంలో ఎనిమిది రకాల మూలికలను గురించి ప్రత్యేక ప్రస్తావన ఉంది.

1. పసుపు (హిలిద్దిం) 2. అల్లం (సింగవేదం) 3. వస (వచం) "వక్తీతి వచ' అంటారు. అంటే పలికేది అని అర్థం. వస మంచి ఉచ్ఛారణ కలిగిస్తుంది. 4. తెల్ల వస (వచత్తం)

5. అతివస (అతి విషం) : "విషమతి క్రాంతా" అంటారు. అంటే విషాన్ని అధిగమించేది అని. ప్రతి విషం అన్నమాట. శరీరంలో ఉన్న విష దోషాల్ని విరిచివేసే ఔషధం. ఈ అతివస శాస్త్రీయనామం అకానిటం హెటిరో ఫైలం. దీని విత్తనాలు తేనెతో సేవిస్తే టాన్సిల్స్, గొంతు వ్యాధులు

తగ్గుతాయి. జీర్ణక్రియ పెరుగుతుంది. మూత్ర వ్యవస్థ శుద్ధి అవుతుంది.

6. కటుక రోహిణి (కటుక రోహిణిం) : ఇది త్రిదోష నివారిణి. దీన్ని తిక్త రోహిణి, అశోక రోహిణి అంటారు. హిమాలయాల్లో దొరుకుతుంది. ఇది రోగాల్ని అడ్డగిస్తుంది కాబట్టి "కటు కటుంబరా..." అంటారు. 7. వట్టివేళ్ళు (ఉసీరం) :

8. భద్ర ముస్తలు (బద్ధముత్తకం) : వీటిని నాగముస్తలు అని కూడా పిలుస్తారు. తుంగ జాతి మొక్కలు. "స్యాద్భద్రముస్తకోగుంద్రా" అంటుంది అమరకోశం. ఆరోగ్యాన్ని కూర్చేవి, దోషగుణాల్ని బాధించేవి అని అర్థం.

ఈ అష్టమూలికల్ని ఆహారంతోగానీ, చూర్ణంగా గానీ, పొడులుగా గానీ సేవించవచ్చు.

**4. కషాయాలు : –** ఈ స్కంధంలో పంచ కషాయాల ప్రస్తావన ఉంది. ఆకుల్ని, వేళ్ళని, బెరళ్ళని నీటితో మరగించి తీసిన సారమే కషాయం. ఈ కషాయాలే ఆధునిక కాలంలో టానిక్కులుగా రూపొందాయి.

1. వేప కషాయం (నింబ కసావం). వేప ఆకులు, వేళ్ళ కషాయం.

2. కొడిసె చెట్టు వేళ్ళ కషాయం (కుటజ కసావం) 3. చేదు పొట్ల వేళ్ళ కసాయం ( పటోల కసావం)

4. పగ్గవ కషావం (చేదు కాయల చెట్టు)

5. గానుగ కషాయం (నత్తమాల కసావం) దీన్ని కరంజకం, క్షుద్రరస, తిక్త గుంజ, నక్తమాల అంటారు."చిరంబిల్వో నక్తమాలః కరజశ్చ కరంజకే..." అంటారు. అంటే చిరకాల రోగాన్ని మటుమాయం చేస్తుంది" అని. *(అమరకోశం)*

**5. ఔషధ ఆకులు : –** పంచ ఔషధ పత్రాల ప్రస్తావన ఉంది.

1. వేపాకులు (నింబ పణ్ణం) 2. కొడిశె ఆకులు (కుటజ పణ్ణం) 3. చేదుపొట్ల ఆకులు (పటోల పణ్ణం) 4. తులసి ఆకులు (సులసి పణ్ణం) 5. ప్రత్తి ఆకులు (కప్పాస పణ్ణం ) –

ఈ ఆకులతో కూరలు, పచ్చళ్లు చేయడం భిక్షువులకి తగదు. కాబట్టి వారు ఈ ఆకుల్ని పచ్చిగానో, ఎండబెట్టి పొడిగానో తీసుకోవాలి.

మనం ఇంత వరకు చెప్పుకొన్న వాటిలో కొవ్వు ఔషధాలు తప్ప మిగిలిన వేర్లు, కషాయాలు, ఆకుల్ని భిక్షువులు ఎల్లప్పుడూ తమ వెంట ఉంచుకోవచ్చు.

**6. ఫల ఔషధాలు : –** ఏడు రకాల ఫల ఔషధాల వివరణలు ఈ స్కంధంలో ఉన్నాయి.

1. విడంగం (విళంగం). దీని శాస్త్రీయనామం "ఎంబేలియా రైబ్స్'. వీటిని వాయు విళంగాలు అని కూడా అంటారు. మిరియాల్లాగా ఉంటాయి. సున్నగా ఉంటాయి. ఈ ఫలం రోగాల్ని మాయం చేస్తుంది కాబట్టి "విడతి రోగం విడంగే" అంటారు. ప్రేగుల్లో ఉండే పురుగులు, చర్మరోగాలు, మలబద్ధకం, అంటు వ్యాధుల్ని అరికడుతుంది.ప్రేవుల్లో నులిపురుగులు లేదా ఇతర పురుగులు ఉంటే(హుక్ వామ్స్, టేప్ వామ్స్,రౌండ్ వామ్స్) ఉంటే చర్మం మీద దద్దుర్లు లేస్తాయి. దురదలు పుడతాయి. కొన్ని చర్మరోగాలకి ప్రేవుల్లోని పురుగులు కారణమని గ్రహించడం గొప్ప విషయం.

2. పిప్పళ్ళు (పిప్పలిం). దీని శాస్త్రీయనామం "పైపర్ లాంగం. ఇదీ మిరియాల్లాంటివే. పూ మొగ్గలే ఇలా ఫలంగా మారతాయి. హిమాలయ ప్రాంతాల్లో వీటితో పచ్చళ్ళు చేస్తారు. ఉబ్బసం, దగ్గు, ఇతర ఊపిరితిత్తుల వ్యాధుల్ని అరికడతాయి. "పిప్పళ్ళ బస్తా" అంటూ లావుగా ఉన్నవాళ్లని అంటాం చూడండి, ఈ పిప్పళ్ళను బట్టే!

3. మిరియం (మరిచం) : మిరియాలు. కూరల్లో కారం కోసం ఇవే వాడేవారు. (బ్రిటీషువారు చిలీదేశం నుండి తెచ్చిన చిల్లీలు వచ్చాక మిరియాల తగ్గి, మిరపకాయల వాడకం పెరిగింది. మిరియాల్లాంటి ఘాటు ఉన్న కాయలు కాబట్టి ఈ చిల్లీలను మిరపకాయలంటాం).

4. కరక్కాయ (హరీతకం) : ఇది విరోచనాలు అరికడుతుంది. కాలేయానికి బలాన్నిస్తుంది. నాడీ ఇబ్బందులు తొలగిస్తుంది. ఎసిడిటీని అరికడుతుంది. వాతరోగ నివారిణి.

4. తానికాయ (విభీతకం) : దీన్ని తాంద్ర అని కూడా అంటారు. వగరుగా ఉంటుంది. ఘాటుగా ఉంటుంది. ఎలర్జీలని నివారిస్తుంది. 'ఏ' విటమిన్ అధికం. కఫ దోష నివారిణి. ప్రేగుల్లోని క్రిమి సంహారిణి. ఉబ్బసాన్ని తగ్గిస్తుంది.

6. ఉసిరికాయ (ఆమ్లకం) : ఇది పిత్తదోష నివారిణి. సి విటమనిక అధికం. శరీరంలో వేడిని తగ్గిస్తుంది.

పైన చెప్పిన కరక్కాయ, తానికాయ, ఉసిరికాయల మిశ్రమమే త్రిఫల చూర్ణం. వాత, పిత్త, కఫ, ఈ త్రిదోషాల్ని నివారించే ఔషదం.

త్రిఫల చూర్ణం విషయం ఈ భైషజ్య స్కంధంలో లేదు. కానీ, వాటి మాతృకలు మాత్రం ఉన్నాయి. బౌద్ధానంతర కాలంలోని ఆయుర్వేదంలోని త్రిఫల చూర్ణానికి ఇక్కడే పునాది పడింది అనేది నిర్వివాదాంశం.

7. ఎండుద్రాక్ష : (గోట్ఠఫలం) గోస్తనీ ఫలం అంటారు. దాక, ద్రాక్ష, యక్షఘ్ను అని కూడా అంటారు. యక్ష అంటే క్షయ. ఈ వ్యాధిని రాకుండా చేస్తుంది.

పైన చెప్పుకున్న ఈ ఏడు ఫలాలు కూడా భిక్షువులు నిరంతరం తమ వెంట ఉంచుకోవచ్చు.

**7. జిగురు ఔషధాలు : –** పాళీ భాషతో వీటిని "జతూహి బేజ్జహి" అన్నారు. 'జతు' అనేదాన్ని 'లక్క' అంటున్నాం. ఇవి కొన్ని వాసనలు కలిగి ఉంటాయి. ఒకరకమైన రుచినీ కలిగి ఉంటాయి. హిమాలయాల్లోని ఫైర్, పైన్ జిగుర్లు ప్రసిద్ధి పొందిన లక్కలు. ఈ స్కంధంలో ఏడు జిగుర్ల ప్రస్తావన ఉంది.

1. ఇంగువ (హింగు) : ఇది పొడి. 2. ఇంగువ జిగురు (హింగు జతుం) 3. ఇంగువ స్ఫటికం (హింగు సిపాటిక) ఈ మూడు ఇంగువ రకాలు. ఇక 4. తక,5. తక్ పత్తి. 6. తక్ పర్ణి – ఈ మూడూ ఒక జాతి జిగుర్లు అయి ఉంటాయి. ఇక 7. సజ్జులసం. (సంస్కృతంలో సర్జరసం).

కూరల్లో ఇవి విశేషంగా ఉపయోగిస్తాం. భిక్షువులకు వంటలేదు. కాబట్టి పొడులుగా, భిక్షాహారం మీద చల్లుకు తినేవారు.

**8. లవణాలు : –** శరీరంలో లవణాలు సరైన పాళ్లలో లేకపోతే రక్తంలో సోడియం తగ్గిపోయి 'హైపో నేట్రీమియా' సంభవిస్తుంది. తలనొప్పి, విసుగు, వాంతులు, అలసట, కాళ్లు లాక్కుపోవడం లాంటివి సంభవిస్తాయి.

హిమాలయ ప్రాంతాల్లో వారికి ఈ 'పొలిపోయే' రోగం అధికంగా ఉంటుంది. బౌద్ధ జాతక కథల్లో పరివ్రాజకులై హిమాలయాలకు వెళ్ళిన వారు, "ఉప్పు" కోసం హిమాలయాలు దిగి గ్రామాలకు వస్తారు. నిస్సత్తువ నుండి తేరుకోవడం కోసం యోగులు కూడ ఉప్పుకోసం హిమాలయాలు దిగి రావల్సిందే!

అంటే మనకు ఖనిజ లవణాలు ఆవశ్యకత అంత ఉందన్నమాట!

భిక్షువులు కూడా వర్షవాసం నాలుగు నెలలూ ఉప్పుకి దూరమవుతారు. భిక్షువుల్లో సర్వ సాధారణంగా కనిపించే లక్షణాల్లో ఖనిజ లవణ లోపం ఒకటి. వారి జీవనశైలి అలాంటిది. ఈ శారీరక ధాతు లోప నివారణకోసం బుద్ధుడు ఐదు లవణాల్ని స్వీకరించమని భిక్షువులకు చెప్పాడు. విశ్వాసానికి గుర్తుగా మనం "నీ ఉప్పు తిని బ్రతికాను" అంటాం. నీ "అన్నం తిని బతికాను" అనం. ఉప్పు శరీరానికి ఎంత అత్యావశ్యకమో ఈ నానుడి తెలియజేస్తుంది.

1. సముద్రపు ఉప్పు (సముద్ధలోణం). ఇది సోడియం క్లోరైడ్. దీన్లో 60 రకాల మినరల్స్ ఉన్నాయి. ఇది డీ హైడ్రేషన్‌ని తగ్గిస్తుంది. కలరా, అతిసార వ్యాధి సమయంలో ఉప్పు, పంచదార కలిపిన నీరు పదేపదే త్రాగాలి. దీన్ని ఇప్పుడు రీహైడ్రేషన్ డ్రింక్ అంటున్నాం. ఈ ఉప్పు నాడీ కండరాల వ్యవస్థని పటుత్వంగా ఉంచుతోంది.

2. నల్లుప్పు (కాళలోణం). కాల లవణం. కాలనమక్. ఇది ముదురు పింక్ రంగులో ఉండి నల్లగా కన్పిస్తుంది. ఇది ఒక రకం రాతి ఉప్పు. దీన్లో సోడియం క్లోరైడ్‌తోపాటు, ఇనుము కూడా ఉంటుంది. ఇది శరీరంలోని కొలెస్ట్రాల్‌ని నియంత్రిస్తుంది. శరీర పిహెచ్‌ని కంట్రోల్ చేస్తుంది. హై బీపీ నుండి సంరక్షిస్తుంది. దీన్లో సల్ఫర్ కూడా ఉండటం వల్ల వాసనగా ఉంటుంది.

3. సైంధవ లవణం (సింధవ లోణం) ఇది రాతి ఉప్పు. కొద్దిగా తీపి. దీన్లో అయోడిన్, లిథియం, మెగ్నీషియం, ఐరన్, జింక్‌లాంటి ఎన్నెన్నో మినరల్స్ ఉంటాయి. ఇది మంచి పిత్తరోగ నివారిణి.

4. ఉప్పాకు : (ఉబ్బిద లోణం) అద్భిజాలు అంటే మొక్కలు. సముద్ర తీర ప్రాంతాల్లో, చౌడు నేలల్లో బ్రతికే ఉప్పాకు మొక్కలు. వీటిల్లో లవణ జలం అధికంగా ఉంటుంది. కొన్ని మొక్కల ఆకుల నుండి, మట్టల నుండి లోపలి నుండి నీరు బైటకు వచ్చి అది సొనలా మారి తెల్లగా గడ్డ కడుతుంది. ఆ గడ్డలు కూడ ఉప్పుగా ఉపయోగ పడతాయి.

5. విడా ఉప్పు (బిలా లోణం)బిడా లవణం, బిడము, చౌటుప్పు అంటారు. ఇది కృత్రిమ లవణం. దీన్ని జంతు విసర్జకాలైన మల మూత్రాల్నుండి తయారు చేస్తారు. దీని తయారీ ఈ స్కంధంలోలేదు. కానీ, బౌద్ధానంతరం వచ్చిన కొన్ని గ్రంథాల్లో దీని తయారు చేసే విధానం ఉంది.

రసేంద్ర చూడామణిలో – ఆవు, ఒంటె, గొర్రె, మేకల మల మూత్రాలతో తయారు చేస్తారని ఉంది. అలాగే రసరత్న సముచ్చయంలో ఒంటె, మానవ మల మూత్రాలతో తయారు చేస్తారని ఉంది. రసేంద్ర చూడామణిలో కూడా ఐదు లవణాల గురించే ఉన్నప్పటికీ బౌద్ధంలోని "ఉప్పాకు' ల ప్రస్తావన లేదు. దాని స్థానంలో రోమకం లేదా సంభార లవణం (ఎర్రెర్త్ సాల్ట్) గురించి ఉంది. ఇక రసరత్న సముచ్చయంలో ఆరు రకాల ఉప్పుల గురించి ఉంది. పై వాటితో పాటు "చుళ్ళికలవణం" గురించి ఉంది. ఇది అమ్మోనియం క్లోరైడ్. దాన్ని నవాసారం అంటాం. సారా తయారీలో ప్రధాన భూమిక ఈ లవణానిదే!

మొత్తం మీద బుద్ధుడు చెప్పిన లవణ ధాతు వైద్య విధానమే ఆ తర్వాత తరంవారు అందిపుచ్చుకున్నారన్నది నిజం –

ఐతే... ఆ తర్వాతి తరంవారైన ఆయుర్వేదీయులకు 'బౌద్ధం ఉప్పుతిన్నామన్న' విశ్వాసం లేకపోవడం విచారించాల్సిన విషయం. విస్మరించ కూడని విషయం కూడా.

**9.బురద మట్టి వైద్యం : –** వేలట్టి సీనుడు అనే భిక్షువుకి తామర వ్యాధి సోకింది. ఇంకా కొందరికి గజ్జి. పుండ్లు, చీము పొక్కుల లాంటి చర్మ వ్యాధులుండేవి. వాటికి బాగా పిసికిన పాటిమట్టిలో పేడను, ఎర్రరంగు పొడిని కూడ కలిపి శరీరానికి పూస్తారు. ఆ బురద ఎండి రాలి పోయేదాకా ఎండలో నిలబడతారు. ఆ రంగు పొడి ఏమిటో తెలియదు.

ఈ విధానంలో గజ్జి, తామరలు తగ్గించుకునే వారు ఇప్పటికీ ఉన్నారు.

**10.పచ్చిమాంసం వైద్యం :–** వివిధ జంతువుల మాంసాల్ని, రక్తాల్ని ఔషధాలుగా ఉపయోగించే విధానాలు చాలా ఆయుర్వేద గ్రంథాల్లో ఉన్నాయి. చరక సంహిత, సుశ్రుత సంహిత, వాగ్భటీయాల్లో కూడా ఉన్నాయి. పంది, ఒంటె, గాడిద, ఆవు, పిచ్చుక, మాంసాలను ఇప్పటికీ వైద్యంగా ఉపయోగించేవారున్నారు.

"కోడి మాంసం అంత కీడు – మేక మాంసం అంత మేలు" లేదనే సామెత ఉండనే ఉంది. కొన్ని వ్యాధులకు పంది, గాడిద నెత్తుర్లు పులుముకునేవారు, తాగేవారూ ఉన్నారు. ఇవ్వన్నీ నాటు వైద్యాలుగా మారిపోయాయి.

బుద్ధుడు కూడ ఈ వైద్య ప్రక్రియకు అనుమతినిచ్చాడు. ఒక భిక్షువుకి "అమనుష్య రోగం" పట్టుకుంది. అది ఎలాంటి రోగమో వివరణ లేదు. మానసిక రోగం అని కొందరు, భూత ప్రేత రోగం అని ఇంకొందరి వాఖ్యానం. ఆ భిక్షువుకి ఎన్ని రకాలుగా మందులు వాడినా తగ్గలేదు. చివరికి అతను పచ్చి పంది మాంసం తిని, పచ్చి పంది రక్తం త్రాగాడు. ఆ తర్వాత అతనికి తగ్గింది. ఈ విషయం బుద్ధునికి తెలిసింది. అలాంటి రోగులకి "పచ్చి పందిమాసం తిని రక్తం తాగేందుకు" అనుమతినిచ్చాడు.

**11. కాటుకలు : –** సౌందర్యం కోసం లేపనాలు, పౌడర్లు, సెంట్లు, అగరు, అత్తర్లు వాడడం భిక్షువులకి నిషేధం కానీ, ఔషధాలుగా కొన్నింటిని ఉపయోగించడానికి నిషేధం లేదు. వాటిలో కొన్ని –

1. కాటుక (కాలాంజనం), 2. రసాంజనం (రసాంజనం), 3. స్రోతాంజనం (స్రోతాంజనం), 4. జేగురు మట్టి (గైరికం) ఇది ఎర్ర బంక మట్టి. 5. మసి (కపల్లం). దీపం మంటపై నుండి వెలువడే పొగమసి. దీపపు మసిని, అదే దీపం నూనెతో రంగరించి, దానికి పచ్చ కర్పూరం కలిపి మెత్తగా నూరి తయారు చేసేదే కాటుక. అలాగే... స్రోతాంజనం అనేది పారేనది బురద నుండి తయారు చేసే కాటుక.

**తెలుగు మాధ్యమాన్ని తీసివేస్తే తెలుగు వర్ధిల్లదు**

ఈ లేపనాలన్నీ కంటి వ్యాధుల కోసమే!

**12. పొడులు :** –అలాగే పౌడర్లు కూడా ఉన్నాయి.

1. చందనం పొడి (ఎర్ర గంధం పొడి). 2. తగరు(జవ్వాది). 3. కాలానుసారి (నల్లని సాదు). 4. తాలీస పొడి (హిమాలయ ప్రాంతాల్లో సూచిక ఆకారంగా పెరిగే ఫర్ ఫైన్ జాతి మొక్క) దీని ఆకులు కాల్చి చేసిన బూడిద పొడి. 5. తుంగ పొడి (తుంగ మొక్కలు కాల్చిన పొడి). ఇలా ఐదు రకాల కాటుకలు, ఐదు రకాల పొడులు ఔషధాలుగా బుద్ధుడు వాడేందుకు అనుమతినిచ్చాడు.

**13. మర్దనం : –**

1. తలనొప్పికి నూనెతో మర్దన చేయడం. బెణుకులకు మర్దనలు. అలాగే శరీరానికి తగినంత 'మాలీసు' చేసే వైద్య ప్రక్రియలు కూడా ఉన్నాయి.

**14. పొగపీల్చడం : –**1. ముక్కులోంచి నస్యాన్ని పోయడం. 2. మందు కలిపిన వత్తిని వెలిగించి, గొట్టంలో ఉంచి పొగ పీల్చడం.

3. ఔషధంలో మద్యం చాలా కొద్దిగా కలిపి సేవించడం – ఈ ప్రక్రియల్ని తల నొప్పి నివారణ కోసం వాడారు.

**15. స్వేదన కర్మలు: –** దీన్ని స్వెట్టింగ్ థెరపీ అంటాం. శరీరానికి చెమట (స్వేదం) పుట్టించడం ద్వారా రోగం నయం చేసే ప్రక్రియలు.

1. తాప స్వేదన : రోగం సోకిన భాగం మీద వేడి గుడ్డతోగానీ, ప్లేటుతోగానీ తాపడం పెట్టడం.

2. ఉపనహ స్వదన : కిణ్వ, దేవదారు ఆకుల ఆవిరి పట్టించి చెమట పట్టించడం.

3. ఉష్ణ స్వేదన : గుడ్డలో వేడిచేసిన విత్తనాలుగానీ, ఆకులుగానీ, జంతు ప్రేవులుగానీ, మట్టి, ఇసుక లాంటి పదార్థాలుంచి కాపడం పెట్టడం. వీటివల్ల, దగ్గు, బెణుకులు, గొంతు బొంగురు, వాత దోషాలు, వళ్ళు నొప్పులు, గడ్డలు – మొదలైన రోగాలు నయమవుతాయి.

4. ఉదక కోష్టక స్వేదన : రోగిని వేడి నీటి పాత్రలుంచిన ఆవిరి గదిలో ఉంచడం. నేటి స్టీం బాత్.

**16. గాట్లు : –** పర్వవాతా(పబ్బవాతం)నికి వాడే ప్రక్రియ. పిళిందవత్స అనే భిక్షువుకి ఈ రోగం పట్టుకుంది. పర్వ అంటే అతి పెద్ద అతి పెద్ద వాతరోగం, ఇది వాత జ్వరం. తక్కువ ఆహారం తీసుకోవడం, రాత్రి వేళల్లో నిద్రకాయడం,ఎండిన పండ్లు ఎక్కువగా తినడం, అధిక నడక నడవడం వల్ల ఈ రోగం సంక్రమిస్తుంది. ఇది చివరికి వాత అర్శ (పైల్స్) గా మారుతుంది. దీనికి సన్నని కొమ్ములాంటి సాధనం గుచ్చి శరీరం నుండి రక్తం తీస్తారు.

**17. విష చికిత్సలు :** బౌద్ధ వైద్య విధానంలో చెప్పుకోతగ్గవి విషాల విరుగుళ్ళకోసం ఉపయోగించిన విధానాలు. ఈ విషాల విరుగుళ్ళను నాలుగు రకాలుగా విభజించారు.

1. పాము, తేలు లాంటి జంతు విషాలు. 2. పండ్లు, కాయలు లాంటి ఫల విషాలు. 3. కృత్రిమ రస విషాలు. 4. విషం కలిపిన ఆహారాలు – ఇలా ఇన్ని రకాల విషాల విరుగుళ్ళకి అన్ని రకాల వైద్యపద్ధతులున్నాయి –

1. పాము విషాలకి విరుగుళ్ళుగా మలం, మూత్రం, బూడిద, మట్టి పదార్థాల్ని వాడడం. లేదా అగ్నితో కాల్చి విష బాధ తొలగించినట్లుంది.

2. ఒక భిక్షువు విషం మింగాడు. అతనికి 'మలం' త్రాగించారు. చాలా గ్రామాలలో ఈనాటికీ ఈ పద్ధతి ఉంది. విషాలు తాగినా, ఎలుకల మందు, గన్నేరు పప్పులు తిన్నవారికి మలాన్ని నీటిలో కలిపి తాగిస్తారు. దానితో వారికి వాంతులు అవుతాయి. విష ప్రభావం పోతుంది.

3. కృత్రిమ విషాల (ఘరదిన్నక బాధ) ప్రభావం నుండి రక్షించడానికి 'బురదనీరు' తాగించాలి. ఇవి పూర్తిగా విషాలు కాదు. ఆహార పదార్థాలతో కలిసిన విషాలు. పాము విషం రక్తంలోకి పోతుంది. నేరుగా తీసుకున్న విషం అయితే, జీర్ణక్రియలో ఆ తీసుకున్న విషం ఒక్కటే ఉంటుంది. ఈ ఘరదిన్నక విషం అయితే ఆహారంతోపాటు కలసి ఉంటుంది. కాబట్టి ఈ విషప్రభావం నెమ్మదిగా ప్రభావం చూపుతుంది.

**18. శస్త్ర చికిత్సలు :** గుహ్యస్థానంలో చేసే చికిత్సలకి, వస్తికర్మ (ఎనిమా)లకు బుద్ధుడు అంగీకరించలేదు. ఈ విషయంలో ఆకాశగోత్తుడు అనే వైద్యుణ్ణి నిలువరించాడు. ఆ రోజుల్లో ఎనిమా తడిగుడ్డలు చొప్పించి చేసేవారు. వెదురు కర్రలు ఉపయోగించేవారు. ఈ మొరటు విధానాల్ని బుద్ధుడు అంగీకరించలేదు. కానీ ఇదే పద్ధతులు జీవకుడు అవలంబించినట్లు ఉంది. జీవకుణ్ణి వ్యతిరేకించినట్లు ఎక్కడా లేదు. అంటే ఆ నాటికి మొరటు విధానాల్ని ఆయన అంగీకరించలేదన్నమాట.

అలాగే... శరీరం మీద లేచిన గడ్డల్ని కోసి తొలగించే విధానాలు కూడా ఉన్నాయి. గడ్డలకీ, పుండ్లకు మలాం పట్టీలు (తెలకపిండి కట్లు), మినప పిండి, ఉప్పు, ఆవ మొక్క కాడలతో నూరి కట్టేకట్లు కూడా బౌద్ధ వైద్య ప్రక్రియల్లో భాగాలే!

అలాగే...

అతిసార వ్యాధికి అమిషోదకం అనే ఆకుల రసం, జుల్పిత్తి అనే చర్మరోగానికి గంధలేపనం, పాండు రోగానికి ఆవు మూత్రంలో కరక్కాయలు కలిపి ఉడికించి తయారు చేసిన ముత్త హరీతకం, ముదిరిన మలబద్ధకం (కామెర్లు) వ్యాధికి అచ్చకంజ (పుల్లని గంజి) అకటయూస (పెసర గంజి), కటాకటం (కొద్దిగా నూనె వేసిన రసం), పటిచ్ఛదనీయం (ఎముకల చారు).

ఆ విధంగానే...

పొట్ట ఉబ్బరానికి ఉప్పు కలిపిన పున్నీళ్ళు త్రాగాలి. లేదా తైదులు, బార్లీ, పెసలు కలిపి,వాటిని ఒక వంతు పాలు, నాల్గు వంతుల నీళ్లు పోసి ఉడికించిన పులగాన్ని తినాలి. ఈ పులగం కడుపులో పూత (స్టమటైటిస్) కి, భగందర (ఫిస్టులా) రోగానికీ కూడా పనిచేస్తుంది.

**అశోకుని కృషి:–**

ప్రజా ఆరోగ్యం కోసం బౌద్ధచక్రవర్తి అశోకుడు చేసిన కృషి ఎనలేనిది. మనుషుల కోసమే కాదు, పశువుల కోసం, పక్షుల కోసం ఉచిత ప్రభుత్వ వైద్యశాలలు నిర్మించాడు. ఇలా వైద్యాన్ని ప్రభుత్వ కార్యక్రమంగా మలచిన మొట్టమొదటి చక్రవర్తి ప్రపంచంలో అశోకుడే! అంతేకాదు, వేలాది ఎకరాల్లో ఔషధమొక్కలు నాటించిన ఘనత కూడా అశోకునిదే! దేశ విదేశాల నుండి

**(తరువాయి 44వ పుటలో...)**

సంకేపల్లి నాగేంద్రశర్మ
9441797650.

# కోటిలింగాల శాతవాహన స్థావరంలో ఆగిన తవ్వకాలను చేబట్టాలి! టూరిజం కేంద్రంగా అభివృద్ధిపరచాలి!



సుమారు రెండువేల సంవత్సరాల క్రితం శాతవాహన రాజుల చరిత్రను మలుపు తిప్పిన పావన గోదావరి తీరంలోని కోటిలింగాలలో పూర్తిస్థాయిలో తవ్వకాలను, పరిశోధనలను చేబట్టాలని తెలంగాణా చరిత్రకారులు డిమాండ్ చేస్తున్నారు. గత ముప్పయి ఏళ్ళలో మూడుసార్లు తవ్వకాలు చేబట్టారు. కరీంనగర్ పూర్వ జిల్లాలోని ప్రధాన శాతవాహన స్థావరమైన కోటిలింగాల గ్రామం, శ్రీపాదసాగర్ ప్రాజెక్టు నిర్మాణంలో గత దశాబ్దంన్నర కిందటే ముంపు గ్రామంగా ప్రకటించబడింది. ప్రస్తుతం ఈ గ్రామాన్ని సంబంధిత అధికార గణం ఖాళీ చేయిస్తున్నా, ఇక్కడ పూర్తిస్థాయిలో పురావస్తు తవ్వకాలను చేబట్టక పోవడాన్ని తెలంగాణా చరిత్రకారులు ఎత్తిచూపుతున్నారు. మరో మెహంజొదారో హరప్పాగా పిలువబడుతున్న ఈ గ్రామంలో ఆగిపోయిన తవ్వకాలను కొనసాగించాలని తెలంగాణా చరిత్రకారులు డిమాండ్ చేస్తున్నారు.

గోదావరి ఒడ్డున గుర్తించిన వంద పది ఎకరాల ప్రదేశాన్ని, రైతుల నుండి కొనుగోలు చేసి, పురావస్తుశాఖ పూర్తిస్థాయిలో తవ్వకాల్ని జరపాలని చరిత్రకారులు కోరుతున్నారు. 2014లో భారీ నీటిపారుదలశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, కోటిలింగాల స్థావరం, మరియు మధ్యయుగాల నాటి కోటేశ్వరస్వామి దేవాలయం, శ్రీపాదసాగర్ ప్రాజెక్టులో మునగకుండా ఒక సర్వే జరిగింది. ఉత్తరం, తూర్పు దిశల్లో గోదావరి నది ముఖద్వారం వద్ద రక్షణ గోడలు కట్టడానికి ఇంజనీరింగ్, ఆర్కియాలజీ నిపుణులతో ఉమ్మడిగా సర్వే చేయించారు. నాలుగేళ్ళయినా సర్వే నివేదికలు భారీ నీటిపారుదల మంత్రిత్వశాఖలో ఎలాంటి చర్యలకు నోచుకోలేక మూలుగుతున్నాయి. కోటిలింగాలకు సుమారు 50 కోట్ల రూపాయల నిధిని కేటాయిస్తే, వంద పది ఎకరాల శాతవాహన ప్రదేశాన్ని కొనుగోలు చేయడమే కాకుండా, తవ్వకాలు జరిపి అభివృద్ధి పరచాలని కోరుతున్నారు. గద్వాల జిల్లా ఆలంపురం జోగులాంబ క్షేత్రం మరియు, ఇక్కడి బ్రహ్మదేవాలయాలు మునగకుండా 1956లో రక్షణ గోడలు నిర్మించిన రీతిలో, పూర్తిస్థాయిలో పురావస్తుశాఖ ఆధ్వర్యంలో తవ్వకాలు జరపాలని చరిత్రకారులు అంటున్నారు. పూర్వ కరీంనగర్ జిల్లాలోని శాతవాహన క్షేత్రమైన పెద్దబొంకూర్ లో ఇటీవల పురావస్తుశాఖ పాక్షికంగా తవ్వకాలను మొదలుపెట్టారు. ఇందులకై 3నెలల పాటు తవ్వకాలు కొనసాగించి, 21లక్షల రూపాయలను ఖర్చు చేయడానికి ముందుకు వచ్చింది. కోటిలింగాల గ్రామం ఆవల వున్న మంచిర్యాల జిల్లా లక్సెట్టి పేట ప్రాంతంలోని కర్ణమామిడి గ్రామంలో గత సంవత్సరం పాక్షికంగా పురావస్తుశాఖ తవ్వకాలను జరిపించింది. సరైన ఫలితాలు వచ్చే వరకు ఆగకుండానే, ఎందులకో అర్థాంతరంగా సదరు తవ్వకాలను ఆపివేశారు. గోదావరి నదికి ఈవల కోటిలింగాల గ్రామం వుండగా, గోదావరికి ఆవల కర్ణమామిడి శాతవాహన సైట్ ఉంది. గోదావరిలో కోటిలింగాల నుండి కర్ణ బోటింగ్ ద్వారా కర్ణమామిడి సైట్‌కు చేరుకొనేవీలుంది. కోటిలింగాల వద్ద శ్రీపాదసాగర్ ప్రాజెక్టు ముంపు నీరు నిలుస్తున్నది. ఇక్కడ ప్రాజెక్టులో 20 టీఎంసీల నీటిని నిల్వచేసుకొనే సామర్థ్యం కల్పించారు. ఎల్లంపల్లి నుండి కోటిలింగాల, రాయపట్నం, ధర్మపురి వరకు ప్రాజెక్టు ముంపునీరు నిల్వవుంటున్నాయి. పాత రాయపట్నం బ్రిడ్జి స్థానంలో, సుమారు 50కోట్లు వెచ్చించి, కొత్తవంతెనను గత నాలుగేళ్ళక్రితం ప్రారంభించారు. ఆదిలాబాద్, కరీంనగర్ పూర్వ జిల్లాలోని 17 గ్రామాలను ఈప్రాజెక్టు కోసం, ముంపు గ్రామాలుగా ప్రకటించి, పునరావాసం కల్పించారు. 2004లో అప్పటి ముఖ్యమంత్రి డా.వైఎస్.జలయజ్ఞం లో భాగంగా, ఈబృహత్తర ప్రాజెక్టు నిర్మాణానికి శంకుస్థాపన చేయగా, 2013-14లో దాదాపుగా పూర్తయింది. 2014-15లో ఈ ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటిసామర్థ్యాన్ని కల్పించారు. కర్ణమామిడి సైతం గోదావరి నదిపై చేబట్టిన శ్రీపాదసాగర్ ముంపు ప్రాజెక్టు గ్రామంగానే ప్రకటించడంతో, పురావస్తుశాఖ వారు అక్కడ కొద్దికాలం మాత్రమే తవ్వకాలు జరిపారు. కోటిలింగాల శాతవాహనుల తొలి స్థావరమే కాక, పూర్వ శాతవాహనుల స్థావరమని 1978లో పురావస్తుశాఖ జరిపిన తవ్వకాల వల్ల రూఢి అయింది. ఇక్కడే శాతవాహనుల వంశస్థాపకుడైన చిముకుడి నాణాలు ఆరు వరకు దొరికాయి.

భారతదేశంలో మరెక్కడా శాతవాహనుల స్థావరంలో చిముకుడి నాణాలు దొరకలేదు. ధర్మపురికి చెందిన కీ.శే.సంగనభట్ల నరహరి 1975-76లో వెల్గటూర్ మండలంలోని కప్పుర్ రావుపేట గ్రామంలో పోస్టుమాస్టర్ గా పనిచేస్తుండగా, ఆయనకు సమీప గ్రామమైన గోదావరి తీరాన వున్న కోటిలింగాల పొలాలలో పురాతన కాలపు దుబ్బనాణాలు దొరికాయి. వాటిని ఆయన రాష్ట్ర పురావస్తుశాఖ ఉప సంచాలకులు డా.పివి. పరబ్రహ్మశాస్త్రిగారి దృష్టికి తీసుకొనిరావడంతో, కోటిలింగాల సైట్ శాతవాహనుల తొలి స్థావరమే కాకుండా, శాతవాహనుల పూర్వరాజుల స్థావరమని, కోటిలింగాలలో తవ్వకాలు జరిపితే ఎన్నో నిజాలు బయటపడగలవని తన పరిశోధనల ద్వారా స్పష్టం చేశారు. ఇక్కడి పొలాలలో ఎడమవైపుకు శాతవాహనుల కాలం నాటి ఇటుక బావులు, కుడివైపుకు పురాతన ఇటుక కట్టడాలు బయటపడ్డాయి. అంతేకాక, గోదావరి సంగమ పెద్దవాగు తీరంలో శాతవాహన రాజుల మట్టికోట

ఒకటి బయటపడింది. ఇక్కడ 1979-84వరకు రాష్ట్ర పురావస్తుశాఖ తవ్వకాలను,పరిశోధనలను చేబట్టింది. తదుపరి 2009,2011లో పాక్షికంగా తవ్వకాలను కొనసాగించింది. శాతవాహన రాజులవే కాకుండా, పూర్వశాతవాహన రాజులైన మౌర్య, శృంగ,కణ్వ రాజుల నాణాలు ఇక్కడ బయటపడ్డాయి. సమగోపుని నాణాలు దొరికాయి. ఏడు పొరలలో సుమారు రెండువేల ఐదు వందల సంవత్సరాల చరిత్ర కల విశేషాలు, నాణాలు, కుండ పెంకులు, గాజు పూసలు, కంఠ హారాలు, బొమ్మలు, లేబుల్ శాసనాలు, ఇనుప వస్తువులు బయటపడ్డాయి. శాతవాహన రాజులు 30మంది పురాణాల్లో పేర్కొన్నట్లుగా, ఒకప్పటి మట్టి కింది మహానగరంగా, కోటిలింగాలనే తొలి రాజధానిగా చేసుకొని పరిపాలన సాగించిన సత్యాలు బహిర్గతమైనాయి. దక్కన్ నుండే శాతవాహనులు ఆంధ్రాకు, ఇటు మహారాష్ట్ర పైఠాన్ వరకు తమ సామ్రాజ్యాన్ని విస్తరించి, కొనసాగించినట్లు చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. ఇక్కడ తవ్వకాలు నిర్వహించిన అప్పటి పురావస్తుశాఖాధికారులు కృష్ణంరాజు, డా. వి.వి. కృష్ణశాస్త్రి, డా. ఎంఎస్.రామచంద్రమూర్తివంటి వారల నివేదికల్లో కోటిలింగాల శాతవాహన రాజుల మూలాలు, వైభవ ప్రశస్తి ఎంతో బయటపడింది. ఈమేరకు రాష్ట్ర పురావస్తుశాఖ 2007లో ఎంఎస్.రామ చంద్రమూర్తిరాసిన కోటిలింగాల తవ్వకాల నివేదికను తవ్వకాలు జరిపిన 24సంవత్సరాల తర్వాత అధికారికంగా విడుదల చేసింది. ప్రఖ్యాత నాణాల శాస్త్రవేత్త డా॥ దేమె రాజిరెడ్డి, ఈ కోటిలింగాల నాణేలపై విశేషమైన పరి శోధనలు జరిపి, ఎన్నో కొత్తవిషయాలను ఆవిష్కరించారు. క్రీ.పూర్వం 3వశతాబ్దంలో గ్రీకు రాయబారి మెగస్తనీస్ తాను రాసిన ఇండికా గ్రంథంలో పేర్కొన్నట్లుగా, కోటిలింగాల సైతం ఆంధ్రలోని బలిష్టమైన 30 దుర్గాలలో ఒకటని తెలియవస్తున్నది. కోటిలింగాల సమీపంలోనే మొక్క ట్రావు పేటలో, పాశిగాం, ధూళికట్ట, మీర్జంపేట, వడుకాపూర్, పెద్దబొం కూర్ తదితర చోట్ల శాతవాహన స్థావరాల్ని కనుగొన్నారు. మొక్కట్రావు పేటలో గత నాలుగేళ్ల కిందట ఒక రైతు పొలంలో, బ్రాహ్మీలిపితో రాయబడిన రెండు శాసనాలు బయటపడగా, వాటిని కరీంనగర్ మ్యూజియానికి పురావస్తు అధికారులు తరలించారు. సంగారెడ్డికి సమీపంలోని కొండాపూర్లో శాతవాహన స్థావరమొకటి బయటపడింది.

**ప్రస్తుత పరిస్థితి:** కోటిలింగాల ప్రస్తుతం 2016లో జరిగిన తెలంగాణాలో జిల్లాల పునర్విభజనలో జగిత్యాల నూతన జిల్లా పరిధిలోకి వచ్చింది. ఇక్కడి ధర్మపురి ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ గారు రాష్ట్ర అసెంబ్లీలో చీఫ్ విప్‌గా అధికారికమైన ఉన్నత పదవిలో కొనసాగుతున్నారు. ఎమ్మెల్యే ఈశ్వర్ రాజకీయ ప్రాతినిధ్యం జరిపితే కోటిలింగాలలో ఆగిపోయిన తవ్వకాలు తిరిగి మొదలయ్యే అవకాశాలు పుష్కలంగా వున్నాయి. ప్రస్తుతం వున్న పురావస్తుశాఖ సంచాలకురాలు విశాలాక్షి కోటిలింగాల శాతవాహన స్థావరంలో ఆగిపోయిన తవ్వకాలు కొనసాగించడానికి సుముఖంగానే వున్నట్లు తెలియవచ్చింది. ఇందులకై కేంద్ర ప్రభుత్వానికి అనుమతులకై రాసినట్లు తెలిసింది. అనుమతులు లభిస్తే, ఇక్కడ పురావస్తుతవ్వకాలు మొదలు పెడుతామని పురావస్తుశాఖాధికారులు అంటున్నారు. గత మూడు నెలల కిందట, కోటిలింగాల బ్యాక్ వాటర్ లో టూరిజం శాఖ వారి యాభైమంది కూర్చునే సామర్థ్యంగల రెండు బోటులను తిప్పుతున్నారు. 2015లో గోదావరి పుష్కరాల సమయంలో ఇక్కడ సుమారు యాభైలక్షల మంది సందర్శించి, పుణ్యస్నానాలు చేశారు. ఇక్కడ విశాలమైన స్నానాల ఘాటును మెట్లువేసి నిర్మించారు. గుడి ముందరి మోకాలు లోతు వరకు, మెట్లు మునిగే వరకు, కోటిలింగాల ఊరు చుట్టూతా, ఊరి పొలాలు మునిగే వరకు శ్రీపాదసాగర్ ప్రాజెక్టు గోదావరి జలాలు చుట్టుముట్టాయి. అంతేకాక, వెల్గటూర్ నుండి కోటిలింగాలకు వెళ్ళే తారురోడ్డుమార్గంలోని లో లెవల్ వంతెన సైతం పూర్తిగా వరదనీటిలో మునిగిపోయింది. ప్రస్తుతం మరో హైలెవల్ వంతెన నిర్మాణానికి టెండర్లు పూర్తయినట్లు తెలిసింది. ఈదృష్ట్యా కోటిలింగాల గ్రామాన్ని ముంపునుండి మినహాయించేలా, పాతమహబూబ్‌నగర్ జిల్లాలోని ఆలంపురంలో చేబట్టినట్లుగా రక్షణ గోడలు నిర్మించాల్సి వుంది. ఇక్కడి వంద పది ఎకరాల సైట్లో ఆగిపోయిన తవ్వకాలను పునరుద్ధరించాలని చరిత్రకారులు కోరుతున్నారు. ఇక్కడ తవ్వకాలలో దొరికిన వస్తువులను ఇక్కడే సైట్ మ్యూజియం ఏర్పాటు చేసి, ప్రదర్శించాల్సి వుంది. ఆలంపురంలో లాగే ఇక్కడ సైతం సైట్ మ్యూజియాన్ని ఏర్పాటు అవశ్యం వుంది. ఇంతే కాకుండా, కోటిలింగాలను టూరిజం ఆకర్షణలతో తీర్చిదిద్దాల్సివుంది. ఇక్కడ బోటింగ్ ప్రారంభోత్స వానికి విచ్చేసిన ఆర్థిక శాఖ మంత్రి ఈటెల రాజేందర్, ఎంపి బి.వినోద్ కుమార్, ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్, రాష్ట్ర టూరిజం కార్పోరేషన్ ఛైర్మన్ పేర్వారం రాములు తదితరులు కోటిలింగాల అభివృద్ధికి సహకరిస్తామని హామీలు ఇచ్చారు. ఈదృష్ట్యా ఇక్కడ సమీపాన జైన మునుల గుట్ట గ్రానైట్ మాఫీయా కోరల్లో పడకుండా, కాపాడుకోవాల్సి వుంది.

కోటిలింగాల గ్రామంలో శాతవాహనులు నిర్మించిన బురుజులు, మట్టికోటలు, స్నానవాటికలు, ఇటుక కట్టడాలు బయటపడటంతో 5వేల సంవత్సరాల కాలం నాటి సింధునాగరికతను తేటతెల్లం చేసిన మరో మొహంజొదారో - హరప్పాలాంటి స్థావరంగా ఇక్కడి సైట్ ను చరిత్రకారులు అభివర్ణించారు. గుంటూరుజిల్లా అమరావతి ధాన్యకటకం, బౌద్ధ స్తూపం, నాగార్జునకొండ శాతవాహనుల తొలి ఆయువుపట్టుగా అంతకుముందు నిర్ధారణకు వచ్చిన చరిత్రకారులు, శ్రీముఖుడి నాణాలు కోటిలింగాలలో దొరకడంతో చరిత్ర ఆనవాళ్ళే తారుమారైపోయాయి.

**పరిశోధనలు కొనసాగించాలి**

శాతవాహనులు, పూర్వరాజుల చరిత్రకు పురావస్తు నిధియైన కోటిలింగాలలో పూర్తిస్థాయిలో శాస్త్రీయంగా తవ్వకాలు కొనసాగించాలని, ఇందులకు భారీ నీటి పారుదల శాఖవారు తగిన బడ్జెట్ మంజూరు చేయాలని ఈ ప్రాంత చరిత్రకారులు డిమాండ్ చేస్తున్నారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టు, శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో మహబూబ్ నగర్ జిల్లా ఆలంపురం గుళ్ళు, శాసనాల పరిరక్షణ, నల్గొండజిల్లా నాగా ర్జునకొండ మ్యూజియం ఏర్పాటు కొరకు భారీనీటిపారుదల శాఖే ముందుకువచ్చింది. శ్రీపాద సాగర్ ప్రాజెక్టు ముంపులో వున్న కోటిలింగాల గ్రామంలో పురావస్తు తవ్వకాలతోపాటుగా, ఇక్కడి పార్వతీ కోటేశ్వరస్వామి దేవాలయాన్ని పరిరక్షించాలని, దొరికిన వస్తువులతో సైట్ మ్యూజియం ఏర్పాటు చేయాలని చరిత్రకారులు కోరుతున్నారు. కోటిలింగాలను కాపాడి అభివృద్ధి చేస్తే గొప్ప చారిత్రిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందగలదు.

ప్రజల భాషలో పరిపాలించేదే ప్రజాస్వామ్య ప్రభుత్వం

ఆచార్య దేవినేని హైమవతి
92471 08431

# భాషావికాసం - మహిళల పాత్ర

ఏ వ్యక్తికైనా ధైర్యస్థైర్యాలతో కూడిన ఆత్మవిశ్వాసాన్నిచ్చేది ఆ వ్యక్తికున్న వారసత్వ సంపదే. మన గతం మనకు తెలియకుండానే నీడలా వెన్నంటి నడుస్తుంది. అది కుటుంబ చరిత్ర అయినా, ప్రాంతీయ చరిత్ర అయినా లేదా జాతి చరిత్ర అయినా ధర్మనిరతితో కూడిన సుందరచిత్రంలా ఉంటే ఎంతో ఆత్మస్థైర్యాన్ని, దర్పాన్నీ ఇస్తాయి. దాంతో ఆ సాంస్కృతిక ఆవరణ నుండి బయటకు రావాలని అసలే అనుకోం. ఇంకా ఉత్తమ / పరమోన్నతస్థాయికి చేరుకోవాలనే లక్ష్యం ఏర్పడుతుంది. తెలుగుజాతి, భాషాచరిత్రలు మనం గర్వించదగిన స్థాయిలో ఎదిగి ఎందరెందరి మెప్పునో పొందాయి. మన పొరుగు రాష్ట్రానికి చెందిన తమిళకవి సుబ్రహ్మణ్యభారతి వ్రాసిన గీతాన్ని ఈ సందర్భంగా నేను తలచుకోకుండా ఉండలేను. "సుందరాంధ్ర పదమ్మును పాడుతు సింధునదీ తీరంలో విహరించాలని ఉందని" ఆయన అన్న మాటల్ని తలచుకున్నపుడల్లా నా అణువణువూ పులకరించి, హృదయం నాట్యమంటపం అవుతుంది. ఇది నిజంగా నిజం!

నేనిక్కడొక ముఖ్యవిషయం చెప్పి, ఆ తర్వాత మహిళలు నిర్వహించిన, నిర్వహించవలసిన పాత్రను గురించి ప్రస్తావిస్తాను. కొందరు తెలుగులో మాట్లాడటం 'నామోషీ' అనుకుంటున్నారు. ఈ జాడ్యం ఒకరిని చూసి మరొకరికి అంటువ్యాధిలా పాకిపోతున్నది. ఈ దుస్థితికి కారణాల నేకం. ప్రమాదకరమైన ఈ ఆత్మన్యూనత అనే జబ్బును ఎదుర్కోవాలంటే భాషబలాన్ని గుర్తించేటట్లు చెయ్యాలి. "అత్యంత ప్రభావవంతమైన భాష మనది" అనే నమ్మకం కలిగితే ఎవరిలోనైనా మరింత గురి, గౌరవం ఏర్పడి అది భాషపై ఆపేక్షను పెంచుతుంది. అందుకే మన భాషకు సంబంధించిన అనేక గొప్ప గుణాల్లో రెండు మౌలిక విషయాలను సదా స్మరించుకుందాం.

1. తెలుగు ఉచ్చారణలోని ధ్వని వైవిధ్యం మరే భాషలోనూ కన్పించదు. అందుకే ఏ భాషలోనైనా చక్కని ఉచ్చారణ చేయగల గొప్ప లక్షణం తెలుగువారి సొంతం. సంస్కృతాన్ని తెలుగువారు ఉచ్చరించినంత స్పష్టంగా మరెవరూ ఉచ్చరించలేరు. దానికి కారణం మన అక్షరమాల గొప్పతనమే.

2. తెలుగుభాష ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన భాష అని నిరూపించటానికి మధ్య ఆసియాలో శాసనాధారాలున్నాయి. క్రీ.పూ. 2750 నాటికే మనవారు అక్కడికి వలస వెళ్ళి వ్యాపారం, వ్యవసాయం చేశారు. ఎన్నో వేల పలకల్లో తమ సాహిత్యాన్ని పదిలపరచారు. తీతువు (ఇత్తీదు) పక్షి, ఇందుగుడు (హంస/అంచ), గిజిగాడు పక్షులు అనే పేర్లతో ఆ గీతాల్లో కన్పిస్తాయి. మచ్చుకి ఒక వైద్యచిట్కా రాసి ఉన్న లేఖనాన్ని చదువుతాను.

"నూమునిగినగార సరసి మరగ గాచి
ఉఖసు అనుముయు గాచి
కషాయ ఊటు అలనాకనాక" (ఈ ఔషధ ద్రవ్యాలను గురించిన వివరణ ఇక్కడ ఇవ్వను)

ఈ విధంగా "అలనాక నాక" అనే మకుటంతో 12 చికిత్సలు చెప్పి ఉన్నాయి. వీటిలో ఉన్న భాష ఖచ్చితంగా తెలుగేనని మనకు తెలుస్తుంది. ఈవిధంగా ఆ సాహిత్యమంతా వెలుగు చూస్తే ప్రపంచంలో తెలుగుభాషే ప్రాచీనమైనదిగా ఋజువవుతుంది. అయితే ఏమాత్రం ప్రయత్నం చేయకుండా చాలామంది ఈ విషయాన్ని ఖండిస్తున్నారు. "ఇందుగుడు" అంటే ఇందుప / చిల్లగింజ. దీనికి నీటిని మట్టిని వేరు చేసే గుణం ఉంది. హంసకు పాలనుండి నీటిని వేరుచేసే గుణం ఉన్నట్లు చెప్పుకుంటాం. అందువల్లే హంసను అంచ అనీ, ఇందుగుడు పక్షి అనీ అన్నారు. పక్షిని 'ముషిని' అన్నారు. ప్రాచీన తెలుగులో 'ముషిని' అంటే పక్షి, మనకు ముషినికొండ (గరుడాద్రి?) శాసనాలున్నాయి గదా! గిజిగాడు పక్షి తెలుగు రైతునేస్తం అని మనకు తెలుసు, 'డు' ప్రత్యయం మన తెలుగుకే ప్రత్యేకం. తెలుగులో ఉన్నన్ని పర్యాయ పదాలు ఇంకే భాషలోనూ ఉండవు. ఇక మన పద్యం గురించి చెప్పాలంటే అదొక యోగఫలం.

యువతీయువకులారా! ఇలా ఎన్నోవిధాలుగా విశిష్టమైన మన భాష గొప్పదనాన్ని తలుచుకుని గట్టిగా గాలి పీల్చుకొని ఆత్మవిశ్వాసంతో భాషాధ్యయనానికి ఉద్యమించండి. తెలుగు సాహిత్యంలోని రసానుభూతిని పొందండి. శరీరంలో ధాతుసామ్యాన్ని (హార్మోనల్ బ్యాలెన్స్‌ని), మేధో వికాసాన్ని పొందండి.

ఇక భాషావికాసంలో, భాషా పరిరక్షణలో మహిళలపాత్ర గురించి ముఖ్యంగా మాట్లాడుకుందాం. తల్లిగర్భంలో నుండే 'అమ్మనుడి'ని వింటూ, భూమిపై పడ్డ దగ్గర్నుండి ఆలకిస్తూ, అమ్మ పలుకులకు మురిసిపోతూ నెమ్మదినెమ్మదిగా ముద్దు ముద్దు మాటలు బిడ్డ అల్లనల్లన పలుకుతుంటే పరమానందపడుతుంది. తొలి గురువుగా తల్లి. అమ్మ లాలిపాటల్లో లీనమై నిద్రలోకి జారటం, నిద్రలో కమ్మని కలలు కని బిడ్డ ఆనందించటం చూస్తాం. ఈ దశలోనే పిల్లలకు తల్లిభాషపై ఆత్మీయానుబంధం ఏర్పడుతుంది. వేగంగా మారుతున్న ఈనాటి సామాజిక పరిస్థితుల్లో మరి ఈ నేపథ్యం అన్ని ఇళ్ళలోనూ ఉందా? సందేహమే!

సంస్కృతీ పరిరక్షకులుగా మహిళలకు విశిష్టస్థానం ఉంది. కుటుంబవ్యవస్థ ఎన్నో యుగాలుగా కొనసాగటంలో ముఖ్య భూమికను నిర్వహించినదీ, నిర్వహిస్తున్నదీ మహిళలే. ముఖ్యంగా పిల్లల వ్యక్తిత్వ వికాసానికి పునాది వేయటంలో ఇంతకాలంగా ప్రధానపాత్ర నిర్వహించింది మహిళలే అనటంలో ఎలాంటి సందేహం లేదు. తెలుగులో ఉన్న సుసంపన్నమైన జానపద సాహిత్యాన్ని వారు పుష్కలంగా వాడుకున్నారు. ముఖ్యంగా విజ్ఞానాన్ని జోడించి చెప్పే బాలసాహిత్యం తరతరాలుగా వస్తున్నది. మా చిన్నతనంలో నానమ్మ నేర్పిన బాలసాహిత్యం ఎంతో వైవిధ్యంతో ఉండేది. దానిలో అనుభవ వైద్యానికి, చికిత్సలకు సంబంధించిన గేయాలు, తేలికపాటి భక్తి గీతాలు, ప్రకృతి అందాల గురించి, పశుపక్ష్యాదుల గురించి, పరమానందయ్య శిష్యుల కథలు,

చందమామ కథలు, పేదరాసి పెద్దమ్మ కథలు, శ్రీనాథుని చాటువులు – ఇలా అనేకానేకం ఆరు, ఏడు ఏళ్ళ వయసు వచ్చేసరికి నేర్చేసుకున్నాం. వీటిల్లో చాలావరకు మహిళలు తమ అనుభవ జ్ఞానంతో లయబద్ధంగా అల్లుకున్నవే. ఆనాడు వారు నిరక్షరాస్యులైన విద్యావంతులు, విజ్ఞులు. తరతరాల అనుభవసారంగా ఏర్పడిన సామాజిక, సాంస్కృతిక తాత్వికతను మౌఖిక సాహిత్యం ద్వారా ఒక తరం నుండి మరో తరానికి అందించిన వారసత్వ జ్ఞానసారథులు మహిళలే. నవరసాలొలికించే కథలు, సామెతలు, గేయాలతో కూడిన ఈ విద్యాబోధనతో పిల్లల వ్యక్తిత్వానికి మానవీయతతో కూడిన గట్టి పునాది పడేది. భాషాపదసంపదతో పిన్నవయస్సులోనే పరిచయం ఏర్పడేది. ఈనాటి పట్టణ విద్యార్థులకు చాలా మామూలు తెలుగు పదాలకు కూడా అర్థాలు తెలియటం లేదు. అలాగని ఆంగ్లంలో ఆరితేరుతున్నారా? అంటే అదీ లేదు. పైగా పైన పేర్కొన్న పసితనపు విద్యాశిక్షణ లేకపోవటంవల్ల బేలతనంతో అనేక అనర్థాలకు పాల్పడు తున్నారు.

ఇక చరిత్రలో విద్యావంతులైన మహిళలు భాషావికాసం కోసం, తద్వారా శాంతియుత సమాజ స్థాపన కోసం చేసిన కృషి గురించి రెండు మాటలు చెప్పుకుందాం. శాతవాహనులకాలంలో అణులక్ష్మి, మాధవి, రేవా, శర్మల వంటి కవయిత్రులెందరో ప్రాకృతంలో వ్రాసిన వాటిని హాలుడు గాధాసప్తశతిలో సంకలనం చేశాడు. అవన్నీ కుటుంబ అనుబంధాలను, సామాజిక సంబంధాలను బలపరచే లక్ష్యంతో వ్రాసినవిగా కన్పిస్తాయి. ఇక మధ్యయుగంలో తెలుగులో తాళ్ళపాక తిమ్మక్క, ఆతుకూరి మొల్ల, మోహనాంగి, తిరుమలాంబ, శారద, రామభద్రాంబ, మధురవాణి, కృష్ణాజమ్మ, రంగాజమ్మ, ముద్దుపళని, తరిగొండ వెంగమాంబ మొదలైన అనేకమంది కవయిత్రులు రచించిన కావ్యాలు, వారు తెలుగు భాషా వికాసానికి చేసిన సేవకు అద్దం పడతాయి. స్వాతంత్ర్యోద్యమకాలంలో బెంగాల్ తర్వాత అంతటి భావస్ఫూర్తి, ఉద్యమ ఉద్ధృతి, ప్రజాచైతన్య స్థాయిలను మళ్ళీ ఆంధ్రప్రాంతంలోనే చూస్తాం. దానికి ప్రధానకారణం రచయితలు, రచయిత్రులు చేసిన భావప్రచారమే. ముఖ్యంగా ఎన్నడూ ఇల్లు విడచి బయటకురాని మహిళలు సైతం స్వాతంత్ర్యపిపాసతో బయటకు వచ్చి, విదేశీ వస్తుబహిష్కరణ, స్వదేశీ ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ఈవిధమైన మహిళాచైతన్యం వల్ల ఉద్యమం పరిపూర్ణత్వాన్ని సంతరించుకుంది. విద్యావంతులైన కొందరు మహిళలు తమ రచనల ద్వారా ఈ ఉద్యమస్ఫూర్తిని తారాస్థాయికి చేర్చారు. మాగంటి అన్నపూర్ణమ్మ, భారతీదేవిరంగా, పొణకా కనకమ్మ, వింజమూరి వెంకటరత్నమ్మ, జూలూరి తులశమ్మ, కాంచనపల్లి కనకాంబ, తల్లాప్రగడ విశ్వసుందరమ్మ, వాసిరెడ్డి రాజ్యలక్ష్మీదేవి మొదలైన ఎందరో రచయిత్రులు గృహలక్ష్మి, శారద, అనసూయ, ఆంధ్ర పత్రిక, భారతి వంటి పత్రికలకు వ్యాసాలు వ్రాసి మహిళాలోకాన్ని మహాచైతన్యస్థాయికి చేర్చారు. దువ్వూరి సుబ్బమ్మవంటివారు తెలుగు పద్యాలతో మొదలుపెట్టి తమ ఉపన్యాసాలతో ప్రజలను ఉద్రూతలూగించి ఉద్యమకారులుగా మార్చేశారు. వాసిరెడ్డి రాజ్యలక్ష్మమ్మగారి నాయకత్వంలో తెనాలి, విజయవాడ పట్టణాల్లో తెలుగు నాటక ప్రదర్శనలను ఏర్పాటు చేసి, నిధులను సేకరించి తెలంగాణాలో జరుగుతున్న విమోచన పోరాటయోధులకు అందించారు. ఆవిధంగా తెలుగు సాహిత్య, సాంస్కృతిక నేపథ్యాన్ని ఉద్యమ విజయాలకు నాటి మహిళలు చక్కగా ఉపయోగించుకున్నారు.

నేడు తెలుగు సంస్కృతికి జీవనాడి అయిన తెలుగుభాష సంక్షోభంలో పడింది. సమాజానికి, సంస్కృతికి పునాది కుటుంబం. ఆ కుటుంబనేపథ్యంలో పెనుమార్పులవల్ల భాషాపునాదులు బాగా దెబ్బతిన్నాయి. దీనికి వెంటనే స్పందించి కార్యాచరణ చేపట్టవలసిన బాధ్యత అందరిపై ఉంది. ముఖ్యంగా జనాభాలో సగభాగమైన మహిళలు అధికసంఖ్యలో స్పందించకపోతే పరిస్థితి చక్కబడదు. గాంధీజీ అన్నట్లు ఇంట్లో తొలి గురువు తల్లే. కాబట్టి ప్రతి మహిళ పిల్లలకు ఉగ్గుబాలతోనే తెలుగు తియ్యదనాన్ని రంగరించిపోసి వారిలో తెలుగు నుడికారంపై మమకారాన్ని పాదుకొల్పాలి.

అయితే ఇటీవలికాలంలో మహిళలపై కొన్ని అపవాదులు పడుతున్నాయి. పరభాషా వ్యామోహం మహిళల్లో ఎక్కువ అనీ, అందువల్లనే పిల్లల్ని ఆంగ్ల పాఠశాలల్లో చేర్పిస్తున్నారనీ, మమ్మీ, డాడీ అని పిలవమని ప్రోత్సహించేది తల్లేనని అంటున్నారు. ఇది పూర్తిగా అవాస్తవం. ఇల్లాలికి ఆలన బాధ్యత తప్ప పాలన బాధ్యతను ఇవ్వట్లేదు గదా! పోనీ, కొన్ని ఇళ్ళల్లో ఆలనాపాలనా ఆమె చేతుల్లోనే ఉన్నా కూడా ఇద్దరూ ఆలోచించి ఇంట్లో నిర్ణయాలు తీసుకోవాలిగాని కేవలం మహిళలే దీనికి కారకులని అనటం సరిగాదు. మహిళలకు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే విజ్ఞతగల విద్యాబుద్ధులు, లోకజ్ఞానం కలిగిస్తేగదా వారైనా సరైన నిర్ణయాలు తీసుకునేది? కాబట్టి ఇది పూర్తిగా వాదనకు నిలబడదు. పరస్పర ఆరోపణలు కాకుండా సమస్య పరిష్కారానికి మార్గాలను అన్వేషించాలి.

సమాజంలో సగభాగమైన మహిళల నిర్ణయాలను గౌరవించినపుడే ఏవిషయంలోనైనా సత్ఫలితాలను సాధించగలం. తల్లులు నేడు విద్యావిషయంలో పిల్లలు పడుతున్న వేదనను గుర్తిస్తున్నారు. కాని కొన్ని కుటుంబాల్లో నిర్ణయాలు వారిచేతుల్లో ఉండవు. ఏవో కొన్ని అపోహలతో సగటు తల్లిదండ్రులు పిల్లల్ని ఆంగ్లమాధ్యమంలోనే చదివించాలని కోరుకుంటున్నట్లు సర్వేలు కూడా అంటున్నాయి. ఏది ఏమైనా ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకొని మార్పు కోసం పూనుకోవాల్సిన సమయం వచ్చింది. ఆ మార్పు ఎవరో తెస్తారని ఎదురు చూడకుండా మహిళలే స్వయంగా చైతన్యస్థాయిగల పౌరులుగా, సాంస్కృతిక సైనికులుగా తయారై భాషాపరిరక్షణకు, తద్వారా జాతిపరిపుష్టికి ఉద్యమించే నాయకులుగా ముందడుగు వేస్తేనే మార్పు వస్తుంది. ఈ క్రమంలో భావప్రచారం ముందుగా జరగాలి. మహిళా అవగాహనా సదస్సులు జరగాలి.

ముఖ్యంగా ఈ విషయాల్ని గమనించాలి :

1. పసితనం నుండే తల్లిభాషపై మమకారాన్ని పాదుకొల్పాలి.

2. తల్లిభాషవల్లనే మనకొక చక్కని వ్యక్తిత్వం ఏర్పడుతుందని నమ్మకం కల్గించాలి.

3. మన భాషను మనం గౌరవించుకొంటేనే ఇతరులు మన భాషకే కాదు మనకూ గౌరవం ఇస్తారు.

(తరువాయి 44వ పుటలో...)

**తెలుగును బోధించడం కాదు ; తెలుగులోనే అన్నీ బోధించాలి**

ధారావాహిక

# మౌనంలోని మాటలు

6

సంచారి రావోళ్ళ నాగప్ప ఆత్మకథ

కన్నడ మూలం:
డా. ఆర్. వి. బి. కుమార్

తెలుగు అనువాదం :
రంగనాథ రామచంద్రరావు
9059779289



**సొంత స్థలం దొరకటం:**

మేము మత్స్యకారుల సంఘం స్థాపించుకున్న తరువాత మాధవరావ్‌గారు మాకు మరింత దగ్గరయ్యారు. ఒక రోజు మాధవరావ్‌గారి ఇంటికి వెళ్ళాను. ఆయన బుక్కసాగరలోని స్వాతికుంటెలో నివాసం ఉండేవారు. "ఏం వచ్చావ్?" అని అడిగారు.

"చిన్నబ్బా, అధికారులు వచ్చి మమ్మల్ని ఈ చోటు వదిలి పోండని అంటుండారు. మునిసిపాలిటి వాళ్ళు ఈ చోట్లో వేర్‌హౌస్ కట్టామని అంటుండారు. వాళ్ళు మమ్మల్ని ఈ చోటు నుంచి పంపిస్తే మేము యాడికి పోవాలో ఆ ద్యావరకే తెలియాలి? ఇంకెన్నాళ్ళని ఊళ్ళు పట్టుకుని తిరగాలి? దీనికి మీరే యేదైనా పరిష్కారం సూపించండి. మీరు పెద్దోళ్ళని మీ దగ్గరికి వస్తిని" అన్నాను.

దానికి ఆయన, "చూడు నాగప్ప, నేనొక మాట చెబుతాను. మనిద్దరం కలిసి ఒక చెట్టుకు రాయి విసరుదాం. ఎవరి రాయికైనా కాయపడాల్సిందే. నా ఖర్చు నేను పెట్టుకుంటాను. నీ ఖర్చు నువ్వు పెట్టుకో. ఇద్దరు తిరిగి అధికారులను కలుద్దాం. ముందేం జరుగుతుందో జరగనీ. అయితే మనిద్దరం కలిసి ప్రయత్నం చేస్తున్నామని ఎవరికి తెలియకూడదు" అన్నారు.

"అలాగే చిన్నబ్బ" అని చెప్పి ఊరికి బయలుదేరాను.

తరువాత ఒక రోజు మాధవరావ్‌గారు నన్ను హేమయ్యస్వామి దగ్గరికి పిల్చుకునిపోయారు.

ఆయన కంప్లి రాజకీయనాయకుల్లో బాగా పలుకుబడి ఉన్నవారు.

మాధవరావ్‌గారే మా పరిస్థితినంతా ఆయనకు వివరించారు.

"సరే, నేను ఏ.సి. దగ్గర మాటాడుతాను. మనకు సాధ్యమైంది చేద్దాం" అని ఆయన అన్నారు.

ఆ రోజు నుంచి రోజూ నేను నేను హేమయ్యస్వామి ఇంటి గుమ్మం బయట కూర్చునేవాడిని.

ఆయన లోపలి నుంచి వస్తుండగానే లేచి ఆయనకు నమస్కారం చేసి "మా సమస్యను ఏం చేశారయ్యా?" అని అడిగేవాడిని.

ఆయన ఈ రోజు రా, రేపు రా అనేవారు.

ఇలా నెల రోజులూ వారింటికి తిరిగాను.

ఇటు డి.ఎస్.ఎస్. జనంతో సంబంధాలు తగ్గించుకున్నాను.

నేను దూరం అవుతున్నాననే అనుమానం వాళ్ళల్లో మొదలైంది.

ఒక రోజు ఆ సంఘానికి చెందిన కొందరు నన్ను బజారులో కొట్టడానికి వచ్చారు.

"అయ్యా, మేము అడుక్కుని తినో టోళ్ళం. మీ ఎంబడి పొగలంతా తిరగడానికి కాదయ్యా" అన్నాను.

వాళ్ళల్లో కొందరు పోనీలే అని విడిపించారు.

ఆ జనం మా వాళ్ళతో నేను సరియైన వ్యక్తిని కాదని ఏవేవో చాడీలు నా మీద చెప్పారు.

అప్పటి నుంచి మా వాళ్ళు నన్ను అనుమానంగా చూడసాగారు.

ఇది జరిగిన కొద్ది రోజుల తరువాత హేమయ్యస్వామి ఇంటి దగ్గరికి వెళ్ళాను.

ఆయనకు నా విషయం అసహనం అనిపించిందో లేదా దయ కలిగిందో తెలియదు.

ఇంటి బయటికి రాగానే "మాధవరావ్ ఎక్కడ?" అని అడిగారు.

"రాలేదయ్యా" అన్నాను.

"సరే, నీకు ఒక లెటర్ ఇస్తాను. మాధవ రావ్‌ను పిల్చుకునిపోయి ఏ.సి.గారికి ఇవ్వండి" అన్నారు.

"అలాగే అయ్యా" అని వారు రాసిచ్చిన ఉత్తరం తీసుకున్నాను.

ఉత్తరం తీసుకుని నేరుగా మాధవరావ్ ఉన్న చోటికి వెళ్ళాను.

ఆయన, "రేపు ఉదయం రా, ఏ.సి .దగ్గరికి వెళదాం" అన్నారు.

మరుసటి రోజు మాధవరావ్‌గారి ఊరికి వెళ్ళాను. వారికొక టి.వి.ఎస్. ఉంది. దాని మీద నన్ను ఎక్కించుకుని హొసపేట ఏ.సి .ఆఫీసుకు తీసుకుని వెళ్ళారు. నేను ఏ.సి ఆఫీసు చూడటం అదే మొదటిసారి. ఉదయం నుంచి సాయంకాలం వరకు ఎదురుచూశాం. ఏ.సి. రాలేదు. వాళ్ళు మీటింగ్‌కు వెళ్ళారని ఆఫీసులో చెప్పారు. మాధవరావ్‌గారు "ఏం చేద్దాం?"



అన్నారు.

"చిన్నబ్బ, రేపు పొద్దున నేను ఏ.సి.ని కలిసి మాట్లాడించి ఉత్తరం ఇచ్చి వస్తాను" అన్నాను.

''ఏ.సి.ని చూస్తావా? ఆయన్ను పలకరిస్తావా?" అన్నారు.

"చిన్నబ్బ, ఇది ఆయన ఆఫీసు. ఆయన ఈడ్నే కుర్చుంటారు. నేరుగా వెళ్ళి ఉత్తరం ఇస్తాను" అని అన్నాను.

మాధవరావ్‌గారు నవ్వి "రాత్రికి ఎక్కడ బస చేస్తావు?" అని అడిగారు.

"చిన్నబ్బా, మా వాళ్ళు రైల్వే గేటు దగ్గర గుడారం వేసుకుని ఉండారు. వాళ్ళ దగ్గరికి పోయి ఈ రోజు ఆడ్నే పండుకుంటాను" అన్నాను.

'సరే రా' అని రైల్వే గేటు దగ్గర నన్ను దింపి వెళ్ళిపోయారు.

సాయంత్రం మా వాళ్ళు బిచ్చాటన నుంచి తిరిగి వచ్చిన తరువాత నాకు కొంచెం అన్నం పెట్టారు. భోజనం చేసి రైల్వేగేటు దగ్గర ఉన్న సమాధి పక్కన పడుకుని ఉదయం లేచాను. లేవగానే ముఖం కడుక్కుని నేరుగా ఏ.సి. ఆఫీసు వైపు నడుచుకుంటూ పోయాను. ఏ.సి. ఆఫీసు తలుపులు ఇంకా తెరవలేదు. 'ఏ.సి.ని కలవాలి' అని గొణుగుతూ నిలబడివుండగా పక్కనే ఆయన బంగ్లా ఉందని ఒకడు చెప్పాడు. బంగ్లా దగ్గరకి వెళ్ళాను. గేటు దగ్గర వాచ్‌మెన్ నిలబడివున్నాడు.

"ఏం కావాలి?" అని అడిగాడు.

"సార్‌ను కలవాలి" అన్నాను.

"ఆయన ఇప్పుడు కాఫి తాగుతున్నారు. వెళ్ళి కనిపించు" అని ఎంతో దయగా అన్నాడు.

మనస్సులోనే అతడనికి దండం పెట్టుకుని గేట దాటి లోపలికి వెళ్ళాను.

సార్ ఇంకా యువకుడు. దాదాపు నా వయస్సువుండొచ్చు.

కాఫి తాగుతూ పేపర్ చదువుతూ కూర్చున్నారు.

నేను దూరంగా నిలబడి నమస్కారం చేశాను.

"ఏం కావాలి? దగ్గరికి రా" అని పిలి చారు.

సార్ దగ్గరికి వెళ్ళి నేను హేమయ్య స్వామిగారు ఇచ్చిన ఉత్తరం ఇచ్చాను.

నాకు చదవటం రాదు. అయితే ఉత్తరం లో స్వామిగారు ఏం రాశారో అనే కుతూహలం. అందుకోసం ముందుగానే ఉత్తరాన్ని జీరాక్స్ తీసి పెట్టుకున్నాను. అది ఇప్పటికీ నా దగ్గర జాగ్రత్తగా ఉంది.

ఉత్తరం చూసిన ఏ.సి.గారు, "కంప్లి నుంచి వచ్చావా?" అని అడిగారు.

అవునన్నాను.

"సరే, వీలైనంత తొందరగా మీకు ఏదో ఒక ఏర్పాటు చేస్తాను" అని అన్నారు.

ఇది జరిగిన పది రోజుల తరువాత మా కుటుంబాలన్నిటికి ఇంటి స్థలాల పట్టాలు వచ్చాయి అనే వార్త తెలిసింది. అయితే సుడుగాడు సిద్దులకు పట్టాలు రాలేదు. వాళ్ళు తమకు పట్టాలు రాకుండా నేనే ఏదో కుట్ర చేశానని నా మీద మండిపడ్డారు. నిజానికి అలాంటి పాడుపని నేను ఏదీ చేయలేదు. పట్టాలు పంచే సమయంలో దాన్ని అందుకోవడానికి నేను ఊళ్ళో లేను. ఏదో పనివుండి రాంపురకు వెళ్ళాను. నేను ఊరి నుంచి తిరిగి వచ్చిన తరువాత నా పట్టా ఇప్పించుకున్నాను.

**పట్టా పంచే ప్రక్రియ :**

పట్టాలు మున్సిపాలిటికి వచ్చాయట. కొందరు నాయకులు ఆ పట్టాలు వచ్చేలా తామే పోరాటం జరిపామని మా వాళ్ళకు చెప్పారట. ఆ నాయకుల వెనుక మా వాళ్ళంతా వచ్చారట. మా వాళ్ళంతా నాలాగే అమాయకులు. దూరం లో మాధవరావుగారు కూర్చున్నారట. సుడుగాడు సిద్దులకు పట్టా దొరకలేదు. మత్స్యకారుల సంఘం నుంచి పట్టాలు దొరి కాయి అని తెలియగానే అక్కడ చేరిన నాయ కులంతా మాధవరావుగారితో గొడవకు నిల బడ్డారట.

"మీ వల్ల పని జరిగితే ఏమి? ఎవరి వల్ల పని జరిగితే ఏమి? మొత్తానికి పని జరిగింది కదా? బాధపడకండి" అని మాధవరావుగారు నచ్చజెప్పి పంపాడట.

**కారటగిలో ప్లాట్లు :**

మా పెదనాన్న పిల్లల వల్ల గంగావతి వైపు ఉన్న మా జనంతో సంబంధాలు కలిశాయి కదా ! అది సిందోళ్ళ సముదాయపు పోరాటానికి సహాయపడింది. మాకు కంప్లిలో మాధవరావ్ గారి సహకారం వల్ల ప్లాటులు, ఇండ్లు దొరి కాయి. అయితే మా జాతికి చెందిన ఎన్నో కుటుంబాలు ఇప్పటికీ ఒక నెలవు లేకుండానే సంచారులుగానే జీవిస్తున్నారు.

అలాంటి పరిస్థితే ఉన్నటువంటి వారు కారటగిలో ఉన్న సిందోళ్ళ జనం.

వాళ్ళు ఆ ఊరి షావుకారు తళవార ఫక్కీరప్పగారి రెండు ఎకరాల బయలుపొలంలో గుడారాలు వేసుకుని వున్నారు. ఆ పొలం ఊరి దగ్గరున్న రోడ్డుకు ఆనుకుని ఉంది. ఒకసారి విరుపణ్ణగారు, "మీరు ఎక్కడి జనం?" అని మా కులస్థులను ప్రశ్నించారు. మా వాళ్ళు తమకొక జాతి లేదని, తమ కొక నెలవు లేదని చెప్పారు. అది విన్న విరుపణ్ణగారు మా జనానికి తమ పొలాన్ని దానంగా ఇవ్వడానికి నిశ్చ

యించుకున్నారు. ఆయన ఆ మాట చెప్పగానే అది విన్న మా వాళ్ళు సంతోషంతో నాకు విరపణ్ణగారు చెప్పిన మాటను చెప్పారు. నాకు సంతోషం కలిగింది. నేను అదే విషయాన్ని మేత్రిగారికి చెప్పాను. మేత్రిగారు, "ఆయన మాట ఇచ్చినపుడే దాన్ని తీసుకోవటం మంచిది. ఒకసారి ఆ ఊరికి వెళ్ళివద్దాం" అన్నారు. సరే అని వారంలోపల వెళ్ళడానికి ఏర్పాట్లు చేసుకున్నాను.

నేను, మేత్రి, శికారి రాము మా సముదాయం గురించి పి. హెచ్.డి. చేసిన లోకరాజు కారటగికి వెళ్ళాం. మా జనం ఉన్న స్థలం చూసి, షావుకారు విరపణ్ణగారిని కలిసి మాట్లాడించి వారి మనస్సు మారకుండా చూశాం. విరపణ్ణగారు ఒకే మాట అన్నారు. "నేను ఆ జనానికి మాట ఇచ్చాను. ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటాను. మీరు ఎప్పుడు పిలిచినా వచ్చి వారి పేరిట పట్టాలు చేయిస్తాను" అన్నారు.

అయితే మా జనాల దురదృష్టం కొద్ది విరపణ్ణగారు మాట ఇచ్చిన కొద్ది రోజుల్లోనే అనారోగ్యం వల్ల మంచం పట్టారు. మేము ఆయన్ను ఎలాగైనా కొప్పళకు తీసుకునిపోయి బాగు చేయించాలని, స్థలాన్ని మా వాళ్ళ పేరిట చేయిద్దామని ప్రయత్నాలు చేశాం. అయితే మా ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి.

విరపణ్ణగారు చివరిశ్వాస పీల్చారు.

మాకు దిక్కుతోచలేదు.

ఇది జరిగిన కొన్నాళ్ళకు ఆయన కుమారుడు సణ్ణఫక్కీరప్పగారి దగ్గరికి వెళ్ళి మీ తండ్రిగారు మాకు మాట ఇచ్చారు. ఆయన మాటను మీరు జరిపిస్తే ఆయన ఆత్మకు శాంతి దొరికినట్టు అవుతుంది. మాలాంటి అనాథలకు నెలవు దొరికినట్టు అవుతుందని విన్నవించుకున్నాం.

"సరే, మా నాన్నగారి మాట నిలబెట్టుకుంటాను. మీరు విచారించకండి, ఈ కార్యక్రమాలన్నీ ముగియనీ" అన్నారు.

ఆయన మాటలు నమ్మి మేము వెనక్కు వచ్చాం. ఆయన చెప్పిన విధంగానే వైకుంఠ సమారాధన జరిగిన తరువాత సణ్ణఫక్కీరప్ప గారిని మళ్ళీ కలిశాం. ఈ సారి ఆయన నుంచి 'సరే చూద్దాం' అని సమాధానం వచ్చింది. వారి ప్రవర్తనలో కనిపించిన మార్పు గురించి మేత్రిసార్‌కు తెలిపాను. "మీరు అప్పుడప్పుడు



వెళ్ళి ఆ స్థలంవారిని కలుస్తుండండి" అని అన్నారు. ఇది జరిగిన కొద్ది రోజులలో మా వాళ్ళను ఆ స్థలం నుంచి తరిమేస్తున్నారనే వార్త నా చెవిన పడింది. విషయం తెలియగానే కారటగి వెళ్ళి విచారించాం.

సణ్ణఫక్కీరప్ప, "మా అన్న ఒకరు వకీల్‌గా ఉన్నారు. ఆయన చెప్పినట్టు విందాం. మనం గొడవ పడటం వద్దు" అన్నారు.

అలాగేనంటూ మేమూ ఒప్పుకున్నాం.

**లాయర్ నాగరాజు ప్రవేశం :**

సణ్ణ ఫక్కీరప్ప అన్న అని చెప్పుకుని వచ్చిన వ్యక్తి లాయర్ నాగరాజు !

"ఈ భూమి మీకు ఇవ్వటానికి కుదరదు. ఇవ్వాలని ఏ చట్టమూ లేదు" అని అతను బెదిరించటం మొదలుపెట్టాడు.

"అయ్యా, మీకు, మాకు సంబంధం లేదు. మేము చిన్న షావుకారును అడుక్కుంటాం. మీరు నడమ రావద్దండి" అని లాయర్‌తో అన్నాం.

అక్కడే ఉన్న సణ్ణ ఫక్కీరప్పగారితో, "అయ్యా, పెద్ద షావుకారుగారు ఈ భూమిని మా జనాలకు ఇస్తామని మాట ఇచ్చిండారు. వారి మాటను మీరు నిలబెట్టుకుంటే నిలబెట్టుకోండి. లేకపోతే వదిలేయండి. మీరు భూమి ఇస్తే మా అలమరులంతా మీ తండ్రిగారి పేరు చెప్పుకుని ఇక్కడ బతుకుతాం. ఈ కాలనీకి మీ తండ్రి పేరు పెట్టుకుంటాం" అని చెప్పాం.

సణ్ణఫక్కీరప్ప సందిగ్ధంలో పడ్డారు. ఒక వైపు ఆయకట్టు పొలం పోతుందనే విచారం, మరొకవైపు తండ్రి ఇచ్చిన మాట నిలబెట్టకోవడం ఎలా అనే ఆలోచన. ఏమీ నిర్ణయించుకోలేని స్థితిలో ఈ విషయం మరొక వారం వాయిదా పడింది.

వారం తరువాత మళ్ళీ కారటగి వెళ్ళాం. అంతలో లాయర్ మరొక కుట్రను రూపొందించారు. అదేమిటంటే ఊరుకు చాలా దూరంలో ఉన్న ఒకటిన్నర ఎకరం భూమిని చూపించి మాకు ఇస్తామన్న భూమికి బదులుగా దీన్ని ఇప్పిస్తాం. ఇక్కడికి వచ్చి ఉండండి అన్నారు. రోడ్డు, నీళ్ళు ఎలాంటి వసతులు లేని అలాంటి భూముల్లో నివాసం ఉండటానికి మా వాళ్ళు ఒప్పుకోలేదు. ఇది జరిగి మరలా ఒక వారం తరువాత కారటగికి వెళ్ళాం. ఆయన మళ్ళీ మరొక భూమి చూపించాడు. ఆ భూమి ఊరి పక్కనే ఊరి పొలిమేరల్లోనే ఉంది. పైగా అది కాలువ పక్కనున్న బంజరు భూమి. మా జనాలకు ఆ భూమి నచ్చింది. సరే, దీన్ని మాకు ఇప్పించండి, మేము మీ పొలాన్ని వదలి ఇక్కడికి వచ్చి నెలవుంటామని వారి సూచనకు మేము అంగీకారం తెలిపి వచ్చాం.

**లాయర్ కంత్రీ బుద్ధి :**

ఒక నెల తరువాత మా జనాలకు కారటగిలో పట్టాలు పంచుతారనే విషయం తెలిసింది. విషయం తెలియగానే నేను కారటగికి వెళ్ళాను. కారటగిలో మా వాళ్ళ కోసం కేటాయించిన స్థలం ఒకటిన్నర ఎకరాల స్థలం. అయితే ఆ లాయర్ మా వాళ్ళ ఒక్కొక్క కుటుంబానికి 10–15 అడుగుల సైటును ఇస్తున్నాడు. అది ధనవంతుల ఇంటి బచ్చలింటి

(స్నానాల గది) స్థలమంత ఉండొచ్చు. ఆ స్థలం ఒక కుటుంబానికి చాలుతుందా అనే ప్రశ్న నన్ను వేధించసాగింది. సణ్ణ ఫక్కీరప్పకు తెలియజేయాలంటే ఆ స్థలంలో ఆయన లేరు. ఎదురుగా ఉండి సైటు కొలిపిస్తున్నది లాయర్.

నాకు కోపం వచ్చింది. 'అయ్యా, కంటి తుడుపుకు ఇచ్చినట్టు ఎందుకు ఆ మాత్రం స్థలం ఇస్తున్నారు?' అన్నాను.

ఆ మనిషి, "పుక్కట్టుకు ఇచ్చేది ఇంకెంత ఇవ్వాలి" అని ప్రశ్నించాడు.

నాకు అసంతృప్తి కలిగింది. నేరుగా హంపికి వచ్చి మేత్రిగారికి ఆ లాయర్ చేస్తున్న అన్యాయం గురించి తెలిపాను. లాయర్ మా జనాలకు ఒక ఎకరంలో ప్లాటులు ఇచ్చి మిగతా అర ఎకరం తాను కొట్టేయటాలనే ఆలోచనలో ఉన్నాడు. ఆ విషయం విని మేత్రిగారు, 'తగినంత స్థలం ఇవ్వకపోతే తీసుకోకండి. సణ్ణ ఫక్కీరప్పకు విషయం తెలియజేయండి' అన్నారు. నేను వెంటనే ఆ విషయం సణ్ణ ఫక్కీరప్పగారికి తెలిపాను. ఆయన, "చూడయ్యా, నాకేమీ అర్థం కావటం లేదు. ఆ లాయర్ ఏం చేస్తాడో చూద్దాం" అన్నారు. మరోదారి కనిపించలేదు.

లాయర్‌కు బుద్ధి చెప్పాలని అనుకున్నాను. వాస్తవంగా మా వాళ్ళవి 48 కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. నేను 68 కుటుంబాలు ఉన్నాయని చెప్పి 68 ప్లాటులు వేయించాను. ఇక లాయర్‌కు మిగిలింది కేవలం పావు ఎకరం స్థలం. ఇందువల్ల లాయర్‌కు అర ఎకరం నష్టమైంది. అయినా పావు ఎకరం భూమి కొట్టేశాడు. దాంతోపాటు వాళ్ళ భూమి విడిపిస్తానని చెప్పి సణ్ణ ఫక్కీరప్పగారి నుంచి బాగానే డబ్బు గుంజాడు. అతను ఒక వైపు మా వాళ్ళను మోసం చేస్తూ మరొక వైపు భూస్వామియైన సణ్ణ ఫక్కీరప్పనూ మోసం చేశాడు. ఉపకారి వేషం ధరించిన లాయర్ కంత్రీ బుద్ధి చివరికి సణ్ణ ఫక్కీరప్పకూ అర్థమైంది. ఆయన కూడా చాలా బాధపడ్డారు.

అటు తరువాత సణ్ణ ఫక్కీరప్పగారు ఏమేమి ఏర్పాట్లు చేశారో ఏమో?

చివరికి మా వాళ్ళందరికీ ప్లాట్లకు సంబంధించిన పట్టాలు మున్సిపాలిటి ద్వారా లభించాయి.

**ఇండ్ల నిర్మాణం :**

అప్పట్లో శివరాజ తంగడగి ఎం.ఎల్.ఏ. గానో, మినిస్టర్‌గానో ఉన్నారు.

మాకు తెలియకుండానే కారటగికి చెందిన మా వాళ్ళు తంగడిగారిని పట్టుకుని ఇండ్లను సాంక్షన్ చేయించుకున్నారు. ఒక రోజు తంగడిగారిని పిలిచి సన్మానం చేయాలని మా వాళ్ళు తమలో తామే నిర్ణయించుకున్నారు. ఇండ్లు సాంక్షన్ చేయించినవారిని సన్మానించే హడావుడిలో ఇండ్లకు స్థలాలు ఇచ్చిన వ్యక్తిని మా వాళ్ళు మరిచిపోయారు. నాకు ఎవరి ద్వారానో తంగడిగారికి సన్మానం చేస్తున్న కార్యక్రమాల వివరాలు తెలిశాయి.

ఆ రోజు కారటగిలో మా వాళ్ళ ఇండ్ల దగ్గర పెద్ద షామియానా వేయించారు. సణ్ణ ఫక్కీరప్పగారికి విషయం తెలియజేశారా అని అడిగితే ఎవరూ ఆయనకు కార్యక్రమాల విషయాన్ని తెలియజేయలేదట. ఆ విషయం విని నాకు కోపం వచ్చింది. ఆయన లేకుండా కార్యక్రమం చేయడం సమంజసం కాదని మా జనాలను కోప్పడి, సణ్ణ ఫక్కీరప్పగారిని పిలుచుకుని రావడానికి వాళ్ళింటికి వెళ్ళాను. ఫక్కీరప్పగారు చాలా కోపంతో ఉన్నారు. "మా తండ్రిగారి పేరిట మీ వాళ్ళకు ఇచ్చిన స్థలాన్ని ప్రారంభోత్సవం చేసే హక్కును ఒక రాజకీయ నాయకుడికి ఇచ్చిన వాళ్ళెవరు? మీ వాళ్ళందరికి తలలు చెడిపోయాయి' అని కేకలు వేసి తమ అసంతృప్తిని వ్యకం చేశారు.

"షావుకారుగారు, క్షమించండి. మా కుర్రవాళ్ళకు బుద్ధిలేదు" అని కొద్దిసేపు బతిమిలాడిన తరువాత కాస్త మెత్తబడి, "నేను మాత్రం ఆ ఫంక్షన్‌కు రాను. కావాలంటే మా అమ్మ వస్తానంటే పిల్చుకుని పోండి. ఆమెకు నేను చెబుతాను" అన్నారు.

ఫకీరప్పగారు నచ్చజెప్పిన తరువాత వారి తల్లి అంగీకరించారు. ఆమెను ఆటోలో పంపి, నేను ఒక శాలువా, రెండు పూలదండలు తీసుకుని వెళ్ళాను. మా అదృష్టానికి నేను వెళ్ళేంత వరకు ఫంక్షన్ మొదలుపెట్టలేదు. వేదిక మీద కూర్చున్నవాళ్ళు అలాగే కూర్చుని ఉన్నారు. మేము అమ్మగారిని వేదిక మీదికి ఎక్కించిన తరువాత సభ ప్రారంభమైంది.

సభలో తంగడిగారు, "అమ్మా, నేను ఈ కార్యక్రమానికి రావడం నెపానికి మాత్రమే. మీ కుటుంబం ఇలాంటి సంచారులకు స్థలం ఇవ్వాలనే మనస్సు చేశారు. మీలాంటివాళ్ళు చాలా అరుదుగా ఉంటారు. మీ కుటుంబం ఇంకా ఇలాంటి మంచి పనులు చేయాలి. మాలాంటివారికి మార్గదర్శకం చేయాలి. మీకు మీ కుటుంబానికి నమస్కారం" అంటూ ఏమేమో మాట్లాడారు.

తంగడి ద్వారా అమ్మగారికి శాలువ కప్పి సన్మానం చేయించటం జరిగింది.

దాంతో ఫక్కీరప్పగారూ సంతృప్తి చెందారు.

కాలనీకి 'తళవార విరపణ్ణ షావుకారు' పేరు పెట్టాలని నిర్ణయం జరిగింది.

అటు తరువాత ఇండ్లు షాంక్షన్ అయ్యాయి.

దాని ఫలాన్ని మా వాళ్ళు ఎంతవరకు సద్వినియోగం చేసుకున్నారో దేవుడికే తెలుసు

కవిత

# స్నేహం

డా॥ ఈదూరు సుధాకర్

9347109266

అప్పుడు - వాన చినుకులం
ఇప్పుడు - జీవ నదులం
అప్పుడప్పుడు ఇలా కలిసినప్పుడు
మనం మహా సముద్రాలం
మనమెప్పుడూ ప్రాణ స్నేహితులం

అప్పుడు - మట్టి రేణువులం
ఇప్పుడు - ఇటుక బట్టీలం
అప్పుడప్పుడూ ఇలా కలిసినప్పుడు
మనం మహా సౌధాలం
మనమెప్పుడూ ప్రాణ స్నేహితులం

అప్పుడు - పలకా బలపాలం
ఇప్పుడు - పాఠ్య పుస్తకాలం
అప్పుడప్పుడు ఇలా కలిసినప్పుడు
మనం మహా గ్రంథాలం
గ్రంథాలయాలం
మనమెప్పుడూ ప్రాణ స్నేహితులం

మధురాంతకం నరేంద్ర
9866243659

# తెలుగు కథను ఎల్లలు దాటించిన కథకులు





గత సంవత్సరం డిసెంబరు 13వ తేదీన ఇచ్ఛాపురపు జగన్నాథ రావుగారు, ఫిబ్రవరి 24న మునిపల్లెరాజుగారు కాలమైపోయారు. జగన్నాథరావుగారు 1931లోనూ, మునిపల్లెరాజుగారు 1925లోనూ జన్మించారు. జగన్నాథరావుగారు విశాఖజిల్లా నర్సీపట్నంలో పుడితే మునిపల్లెరాజుగారు గుంటూరుజిల్లా గరికపాడులో జన్మించారు. స్వాతంత్ర్యానికి ముందు పుట్టిన యీ యిద్దరు కథకులూ స్వాతంత్రోద్యమంతో బాటూ ప్రత్యేక తెలుగు రాష్ట్ర వుద్యమాన్నీ, 1952లో ఆంధ్రప్రదేశ్ ఆవిర్భావాన్నీ, మూడేళ్లక్రితం జరిగిన తెలుగు రాష్ట్ర విభజననూ చూసిన వాళ్ళు. దాదాపుగా వొక శతాబ్దపు కాలంలో తెలుగువాళ్ల జీవన గమనాల్ని తెలుసుకోడానికి వాళ్ల జీవితాలూ, రచనలూ గొప్పగా ఉపకరిస్తాయి.

వీరకుంకుమ, బిచ్చగాళ్ల జెండా, వారాల పిల్లాడు, అరణ్యంలో మానవ యంత్రం మొదలైనవి మునిపల్లెరాజుగారి తొలి దశలోని కథలు. దాదాపు రెండు దశాబ్దాలపాటు మౌనంగా వుండిపోయిన మునిపల్లె రాజు గారు మిగిలిన కథలన్నీ ఆ తరువాత రాశారు.

గుంటూరు జిల్లాలో పుట్టిన మునిపల్లెరాజుగారు కడపలో డాక్టరుగా వుండిన తన అన్న మునిపల్లె పిచ్చిరాజుగారి దగ్గరికొచ్చి కొన్నాళ్లున్నారు. దాదాపు వందా, వందా యాభై సంవత్సరాల క్రితం కొందరు కోస్తా ప్రాంతపు వైద్యులు (వాళ్ళు యెంబీబీయస్ చదువుకున్న వాళ్ళుకారు. అప్పట్లో అలోపతీ, హోమియోపతీ కలగలిపి వైద్యం చేసే ఆర్‌యంపి డాక్టర్లు రాయలసీమలో వైద్యులుగా పేరు పొందారు) చిత్తూరు, కడప జిల్లాలకొచ్చి స్థిరపడ్డారు. మా బాల్యమిత్రుడు కేశవరాజు క్షీరసాగర్ తాతగారు కేశవరాజు శ్రీమంతరావుగారు మా దామల్ చెరువుకు యేడు మైళ్ళ దూరంలో వుండే కల్లూరులో డాక్టరుగా స్థిరపడ్డారు. అంతకుముందు ఆయన తూర్పుగోదావరి జిల్లా నుంచీ వేలూరు క్రిస్టియన్ మెడికల్ కాలేజీ ఆస్పత్రికొచ్చి చాలా యేళ్ళు డాక్టరుగా ప్రాక్టీసు చేశారట! ఆయన తర్వాత ఆయన కుమారుడు దుర్గా ప్రసాదరావుగారు మా వూళ్లో రెండు దశాబ్దాలు డాక్టరుగా ప్రాక్టీసు చేసి, పిల్లలు యెదిగివచ్చాక, వాళ్ళబ్బాయి విశాఖలో వుద్యోగంలో స్థిరపడ్డాక, తిరిగి ఆ ప్రాంతానికెళ్లిపోయారు. కల్లూరులో శ్రీమంతరావుగారు కట్టించుకున్న పాతకాలపు రెండస్థుల గారమిద్దె యెవరో కొనుక్కుని, తర్వాత దాన్ని పడగొట్టి ఆ స్థలంలో కొత్తయిల్లు కట్టేశారు. యిప్పుడు మా బాల్యపు జ్ఞాపకాల్ని వెదుక్కోడానికా యిల్లు లేదు. దాదాపుగా మూడు తరాలపాటూ చిత్తూరు జిల్లాలో జీవించినా మా మిత్రుడి యింట్లో, యిప్పుడూ, అప్పుడూ, స్పష్టమైన తూర్పుగోదావరి జిల్లా తెలుగు మాండలికమే స్థిరపడి వుంది. రాజుగారి అన్నగారి కుటుంబం కూడా ఆ ప్రాంతాల్లోని తిరిగి తమ ప్రాంతాలకు మునిపల్లె రాజుగారి కథల్లో గూడా గుంటూరు భాషే వుంటుంది. అయితే ఆయన తొలినాళ్లలో చిత్రించిన జీవితం మాత్రం యెల్లలు దాటి విస్తరించింది.

రాజుగారి ప్రసిద్ధ కథానిక 'వీర కుంకుమ' రాయలసీమలో యేడెనిమిది దశాబ్ధాల క్రితం వచ్చిన దారుణమైన కరువు నేపథ్యంలో వచ్చిన కథ. మోటరు బావుల్లో నీళ్లందక బక్కెద్దులు యీడిగిలబడినచోట, మిరపమళ్లూ జొన్న కంకులూ చీనీతోటలూ యెండిపోయిన నేలలో, కడపనుంచీ వచ్చిన సాయిబులకు ఆ పశువుల్ని కబేలాలకోసం అప్పగించిన రోజుల్లో, ప్రభుత్వం పెట్టిన గంజి కేంద్రాలను మోతుబరులూ దళారులూ దోచుకుంటున్న సమయంలో జరిగిన కథ యిది. ప్రతాపరెడ్డి

అనే రైతు మహానంది తిరనాళ్లకు ప్రభలు కట్టిస్తాడు. ఆయన కొడుకు చిట్టిరెడ్డి, నగరంలో కళాశాలలో చదువుకుంటున్నవాడు, సెలవుల్లో యింటికొచ్చినప్పుడు హంపీయాత్రకు పూనుకుంటాడు. అతగాడితోపాటు వచ్చిన సహాధ్యాయి రాజుకు తెలుగుకు సంబంధించినదేదయినా పరవశమే! కూలిపోయిన మండపాలు, పడిపోయిన మహళ్ళు, పాడుబడిన ఆలయాలు చూసి తెలుగు కవిత్వం, భాగ్యం, ఔన్నత్యం అంతా ఆ శిధిలాల కిందపడి శోకిస్తోందని నిట్టూరుస్తాడతను. హంపిలో వేయి స్థంభాల విఠలస్వామి ఆలయాన్ని చూసినప్పుడు, అత్యుత్సాహంతో వుద్రేకంతో ఆంధ్రుల చరిత్రనంతా యేకరువు పెట్టాక "కాలం ఎప్పటికీ యిలాగే వుండదు. మన నందికొండ! మన సిద్దేశ్వరం, మన రామపాద సాగరమూ వస్తాయి. తెలుగువారంతా దీపావళిలా వెలిగే రోజులు, కరువునూ, దారిద్ర్యాన్నీ, నిరాశనూ ఎరగని రోజులు వస్తాయి" అని పలవరిస్తాడు. దాదాపుగా 1952 ప్రాంతంలో, ప్రత్యేక తెలుగు రాష్ట్రం ఏర్పడ్డానికి అటో, ఇటో రాసిన కథ యిది. ఆనాటి తెలుగువాళ్ళ కలలూ, కోరికలూ, మాతృభాషాభిమానమూ ఆ కథలో కనిపిస్తాయి. ఆ కథలో కొంత భాగానికి నేపథ్యంగా వుండిన హంపి, తరువాత కన్నడ రాష్ట్రంలోకి వెళ్ళిపోయింది. పరిపాలనా సౌలభ్యం కోసం దేశాన్ని చిన్న భాగాలయిన రాష్ట్రాలుగా విభజించక తప్పదు. అయితే దానికి భాషను ప్రాతిపదికగా తీసుకోవడంలోనే పేచీ. రాష్ట్రమేదయినా యెవరి మాతృభాషను వాళ్ళు వాడుకోగలిగే ఆ ఆదర్శ కాలం మాత్రం యింకా రాలేదు.

అదే మునిపల్లెరాజుగారు పూనాలో వుండే తెలుగు బిచ్చగాళ్ల గురించి రాసిన కథ 'బిచ్చగాళ్ళ జెండా' అయితే అక్కడి బిచ్చగాళ్ళలో తమిళనాడు బిచ్చగాళ్ళే ఎక్కువైనా, రాయలసీమ, నైజాం బిచ్చగాళూ చెప్పుకో తగ్గ సంఖ్యలోనే వున్నారంటాడు కథకుడు.

రాజుగారి మూడో కథ కృష్ణాజిల్లాలో జరిగితే, నాలుగో కథ 'అరణ్యంలో మానవయంత్రం' పాపి కొండలు సానువుల్లో వుండే కోయ పల్లెలో జరుగుతుంది. పాపికొండల దగ్గరి యీ కథలోనే రాజుగారు కనీస జీవనాధారమయిన వస్తువుల్ని దాచిపెట్టి ధరలు పెంచే వో పెట్టుబడిదారుడ్ని దోచుకోవడం కోసం చీకట్లో ముసుగు మనుషులు రావడాన్ని చిత్రిస్తారు. ఆ తరువాత తెలుగుదేశంలో ప్రబలిన నక్సలిజానికున్న బీజాల్ని ముందుగా పసిగట్టి చూప గలిగిన 'ప్రవక్త' రచయితగా ఆయన గుర్తింపును పొందాడు.

1960 ప్రాంతాల్లో రాజుగారు కొన్నేళ్ళపాటూ మదరాసులోనూ వున్నారు. అప్పుడే ఆయనకు ఆనాటి చిత్ర పరిశ్రమతోనూ పరిచయం కలిగింది. ఆ పరిచయమే ఆయన నవల 'పూజారిణి' ఆధారంగా బి.యన్.రెడ్డిగారు 'పూజా ఫలం' అనే చిత్రం నిర్మించడానికి దారి తీసింది. 'పూజారిణి' నవల, ఆయన రాసిన 'వారాల పిల్లాడు', 'సవతి కొడుకు' వంటి కథలూ ఆయనపైన బెంగాల్ సాహిత్యపు ప్రభావాన్ని స్పష్టంగా చూపెడతాయి.

మంచి తెలుగు వచనం రాసిన రచయితల్లో మునిపల్లెరాజుగారికొక విశిష్టమైన స్థానం వుంది. తెలుగువాక్యానికి కవిత్వపు పరిమళాన్ని అద్దిన కథకుడాయన. రాజుగారు తెలుగు కథను బొంబాయికీ, దేశపు సరిహద్దులకూ (ఆయన సైన్యంలో వుద్యోగిగా వుద్యోగం చేసినవాడు) తీసుకెళ్తే ఇచ్ఛాపురపు జగన్నాధరావుగారు ఆగ్రాకూ, ఢిల్లీకీ, కలకత్తాకూ తీసుకెళ్ళాడు.

'సుజాత – జగన్' అనే భార్యాభర్తల గురించి జగన్నాధరావుగారు దాదాపొక డజను కథలు రాశారు ఆ కథలన్నీ కలకత్తాలోనూ, ఆగ్రాలోనూ జరుగుతాయి. జగన్నాధరావుగారు కస్టమ్స్ శాఖలో పెద్ద వున్నతోద్యోగిగా ఆ రెండు వూళ్లలోనూ చాలా కాలమున్నారు. ఆ కథలను చదివినవాళ్ళకు, మాధురి మిఠాయి అంగళ్ళూ, సదర్ బజారూ చిరపరిచయాలై పోతాయి. కలకత్తాకు ఆయనకంత సాన్నిహిత్యముండడానికి కారణమేమిటో తరువాత తెలిసి వచ్చింది.

రాయలసీమ వాసులకు మదరాసుతో యెంత దగ్గరి సంబంధముందో, కళింగాంధ్రులకు కలకత్తాతో అంత సాన్నిహిత్యముంది. విశాఖనుంచీ 10 గంటలు రైలు ప్రయాణం చేస్తే కలకత్తా వచ్చేస్తుంది. అందువల్ల చాలామంది ఆ ప్రాంతపు వాళ్ళు పై చదువులకోసం కలకత్తా వెళ్లేవాళ్ళు.

విజయనగరంలో ఆధునిక తెలుగు సాంస్కృతిక పునరుజ్జీవనం ప్రారంభంగావడానికి గూడా కలకత్తా దగ్గరగా వుండడమే కారణం. తొలి సాంస్కృతిక పునరుజ్జీవన భావాలు కలకత్తా నుంచీ భువనేశ్వర్ దాటి పర్లాకిమిడి మీదుగా విజయనగరం చేరి వుంటాయి. గిడుగూ, గురజాడ ఆ దారిలోనే వికసించి వుంటారు.

స్త్రీ పురుష సంబంధాలు చిత్రించిన రచయితలలో ఇచ్ఛాపురపు జగన్నాధరావుగారికొక విశిష్టమైన స్థానం వుంది. దాంపత్య జీవితపు చట్రంలో యిముడుతూనే సమానమైన హక్కుల్ని అనుభవించే గొప్ప స్త్రీ పురుషులనాయన చిత్రించాడు. చలం రచనలు చీకటి కాన్వాసుపైన అగ్ని గోళాలతో చిత్రించిన జ్వాలా చిత్రికల్లాంటివి. బుచ్చిబాబు కథలు చలువరాతిలో నిర్మించిన తాజ్‌మహల్‌లా, కొండరాళ్ళతో చెక్కిన బృహదీశ్వరాలయాల్లా కవ్విస్తాయి. చండీదాస్ తన రచనల్లో జలపాతాలకూ పాలపుంతలకూ స్నేహం చేయిస్తారు. జగన్నాధరావుగారు మాత్రం జపాన్ శిల్పాల్లా చిన్నచిన్న యేనుగు దంతాలపైనా, చందనపు కొయ్యలపైనా, యే చిన్న నగిషీనీ మరచిపోకుండా, జిలుగు వెలుగుల బొమ్మల్ని వోపికగా, నెమ్మదిగా, జాగ్రత్తగా, అద్భుతంగా చెక్కుతారు.

జగన్నాధరావుగారు యింగ్లీషులో ఆలోచించి తెలుగులో రాస్తూ వుంటారని కొందరు విమర్శకులంటూ వుంటారు. ఆయన వాక్యాలు చాలా వరకూ ఆంగ్ల వాక్యాల అనువాదాల్లా వుంటాయి. ఇంగ్లీషు నుడికారాన్ని అలంకరించుకునే ఆయన తెలుగు వాక్యాలు సూటు ధరించిన తెలుగువాడిలా హుందాగా, అదో రకమైన ప్రత్యేక అందంతో అలరిస్తాయి... ఉదాహరణకు కొన్ని వాక్యాలు చూడండి.

– మూడోసారి ఆమె జీవితంలో దురదృష్టం తేగలిగే స్వభావం అతణ్ణి క్షణమాత్రమే ఆపింది.

– ఈ లలిత నాకు భార్యగా కావాలి.

– కానీ ఆమె చిరునవ్వు ముళ్ళపొదలాగా గుచ్చుకుంది.

– ఆ సౌందర్యం అంతా తన చేతుల్లో ఉంచుకో గలిగే యోగం ఎంత ఆకర్షణీయంగా కనిపించినా, అతను చూడగలిగింది గులాబులు గాదు. వాటి చుట్టూ వుండి, తన ఆలోచనల్లో అతిశయోక్తిలాగే పెరిగిన ముళ్ళు మాత్రమే!

తెలుగువారి జీవన విస్తృతిని తమ రచనల్లో ప్రతిఫలించిన మునిపల్లె రాజుగారూ, ఇచ్ఛాపురపు జగన్నాధరావుగారూ ధన్యజీవులు.

డా॥ జి.వెంకటేశ్వర్రావ్
9491467496

# చరిత్ర సారాన్ని పిండిన మహోన్నత చరిత్రకారుడు
# డా॥ యం. రాధాకృష్ణశర్మ

డా॥ ముక్కామల రాధాకృష్ణశర్మ తెలుగు నేలతో జన్మించిన ప్రసిద్ధ చరిత్రకారుడు. చరిత్ర అధ్యాయంతో క్రొత్త పోకడలను ప్రవేశపెట్టి, చరిత్రను సృష్టించారు. వారు నీటి ముంపునుండి పురాతన సంపద పరిరక్షణలోనూ, దృశ్య మాధ్యమాల్లోనూ, విద్యాత్మక వాస్తు శిల్పంలోనూ ప్రాజెక్టులను చేపట్టి విజయవంతం చేశారు. క్రొత్త పాఠ్యాంశాలైన ఆలయ వాస్తు శిల్పం, వస్తు ప్రదర్శనా శాస్త్రం, లలిత కళలు, ప్రాచీన వ్రాత ప్రతుల అధ్యయనం పాఠ్యాంశాలను ప్రవేశపెట్టి భారతదేశ చరిత్రకు రాణింపు తెచ్చారు. రాధాకృష్ణశర్మగారు ఒక విద్యావేత్తగా, ఒక పరిశోధకునిగా హృదయానికి హత్తుకొనేటట్లు చరిత్ర పాఠాలు చెప్పిన ఆచార్యునిగా రాణించారు. వారు రచించిన చారిత్రకాంశాలు సాంస్కృతిక విలువలతో కూడినవి. ఆకాశవాణి కేంద్రంలో వారు చేసిన రేడియో ప్రసంగాలు అత్యంత విలువైనవి. ఉస్మానియా విశ్వవిద్యాలయం పురాతన చరిత్ర విభాగంలో పనిచేసి దేశ చరిత్ర, సంస్కృతి, పురావస్తు విషయాలకు ఆదరణ కల్పించి చరిత్ర శాఖను ఉన్నత శిఖరాలకు తీసికొని వెళ్ళిన మేధావి.

ముక్కామల రాధాకృష్ణశర్మ 1933 'మే' నెల 27వ తేదీ – గుంటూరు జిల్లా రేపల్లెలోని పేటూరు అనే గ్రామంలో జన్మించారు. వీరి తండ్రి శ్రీహరిరావు, తల్లి శ్రీమతి సుశీల. వీరు పాఠశాల విద్య మద్రాసులోని థియోసాఫికల్ పాఠశాలలో జరిగింది. ఆ తరువాత మద్రాసు క్రిష్టియన్ కళాశాల బి.ఏ. చదివినారు. 1953లో మద్రాసు విశ్వవిద్యాలయం నుండి ఎం.ఏ హిస్టరీ చేసినారు. మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాల 1962లో పిహెచ్.డి చేశారు. ఆ తరువాత 1968లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి రష్యన్ భాషలో డిప్లొమో చేశారు. వీరు 1953 నుంచి ఆంధ్రప్రాంతంలోని అనేక కళాశాలలలో ఉపన్యాసకుడిగా పనిచేశారు. మొదట 1953లో చీరాలలోని వి.ఆర్.యస్ కళాశాలలో చరిత్రోపన్యాసకునిగా చేరినారు. ఆ తరువాత వీరు 1975లో ఉస్మానియాలోనే ఏన్షియంట్ ఇండియన్ హిస్టరీ, కల్చర్, అండ్ ఆర్కియాలజీ శాఖను ఏర్పరచి 1993 వరకు – అంటే పదవీ విరమణ వరకు ఈ శాఖకు అధిపతిగా పనిచేశారు.

వీరి విజ్ఞాన ప్రతిభకు మెచ్చిన యుజిసి సంస్థ 1995 – 97 సంవత్సరాలలో వీరిని ఎమిరిటస్‌ఫెలోగా నియమించింది. వీరు భారతదేశంలోని అనేక విశ్వవిద్యాలయాలకు విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. వీరి ప్రతిభకు ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఇండియన్ కౌన్సిల్‌ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ – ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రీసెర్చ్ సంస్థలు గుర్తించాయి. అనేక విశ్వవిద్యాలయాలు వీరిని రిసోర్స్ పర్సన్‌గా గుర్తించి ఆహ్వానించాయి. అనేక విశ్వవిద్యాలయాల్లో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు.

వీరు 1968లో సాల్వేజ్ ఆర్కియాలజీ (నీటి ముంపునుండి పురాతన సంపద పరిరక్షణ) పాఠ్యాంశాన్ని ప్రవేశపెట్టి శ్రీశైలం ప్రాజెక్టు ప్రాంతంలో మునిగిపోతున్న అమూల్యమైన దేవాలయ సంపదను కాపాడినారు. ఈ అంశం మీద శ్రద్ధతో వీరు తయారు చేసిన రిపోర్టు 1972వ సంవత్సరంలో ముద్రించబడినది. ఈ అంశంమీద వీరు 15 సంవత్సరాలపాటు ఉపన్యాసాల ద్వారా, వ్యాసాల ద్వారా, ఆకాశవాణి ఉపన్యాసాల ద్వారా అనేక వివరాలను వ్యక్తీకరించారు. వీరు 1968లో వివిధ యుగాలలో ఆంధ్రులు(Andhras Through the Ages) డాక్యుమెంటరీ ఫిలిమ్‌ను తీయడానికి కారకుడైనారు. ఈ కార్యక్రమం ఉస్మానియా విశ్వవిద్యాలయం యొక్క గోల్డెన్ జూబిలీ ఉత్సవాల సందర్భంగా తయారు చేయబడినది. ఆ తర్వాత 1981లో – కౌలాలంపూర్, మలేషియాలలో జరిగిన రెండవ ప్రపంచ తెలుగు మహా సభల సందర్భంగా ఏర్పాటు చేయబడింది. ఈ సమయంలో వీరిని బంగారు పతకంలో సత్కరించడం జరిగింది.

రాధాకృష్ణశర్మ బహుముఖ ప్రజ్ఞాశాలి. మంచి పరిశోధకుడు, మంచి స్క్రిప్ట్ రైటర్. ఆలోచనాపరుడు, మంచి పాటగారు. కర్ణాటక సంగీతంలో దిట్ట, వయొలిన్ విద్వాంసుడు, అనేక టెలీఫిలిమ్స్‌ను రచించి, దర్శకునిగా పేరుగాంచారు. అనేక సాంస్కృతిక కార్యక్రమాలను రూపొందించినారు. వీరి రేడియో ప్రసంగాలు స్ఫూర్తి దాయకమైనవి. వీరు పురాతన విలువలకు ప్రాధాన్యమిచ్చిన గొప్ప విద్యావేత్త. తాను పనిచేసిన పురాతన చరిత్ర శాఖను అద్భుతంగా తీర్చిదిద్దినారు.

ఆచార్య రాధాకృష్ణ శర్మ ప్రతిభ విశేషాలను విజువల్ మీడియా ద్వారా బాగా తెలిసికొనవచ్చును. దూర దర్శన్ కేంద్రం తొలి దశలో (1980) టెలీ స్కూల్ కార్యక్రమాలలో పాల్గొన్నారు. యుజిసి కార్యక్రమాలకు స్క్రిప్ట్ రైటర్‌గా ఎన్నో కార్యక్రమాలను రూపొందించారు. ఎడ్యుకేషనల్ ఆర్కిటెక్చర్, యుగ యుగాల అలంపూర్, తంజావూరు బృహదీశ్వరాలయము. తంజావూరు – మహారాష్ట్రులు, రాజమండ్రి పట్టణ చరిత్ర, సర్ ఆర్థర్ కాటన్ – బొమ్మూరులోని పత్తి పరిశ్రమ, వీరేశలింగం పంతులు, దామెర్ల రామారావు మొదలైన అంశాలమీద దూరదర్శన్ కార్యక్రమాలను రూపొందించారు.

రాధాకృష్ణశర్మగారికి 2003 నవంబరు 6వ తేదీన సికింద్రాబాద్‌లో సనాతన చారిటబుల్ ట్రస్టు, భీముని పట్నం తరఫున సద్గురు శివానందమూర్తి చేతుల మీదుగా శివానందసద్గురు ప్రతిభా పురస్కారాన్ని ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వీరిని ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో సత్కరించింది. హైదరాబాద్ హిస్టారికల్ సొసైటీలో కీలక సభ్యునిగానూ సాలార్జంగ్ మ్యూజియం కార్యవర్గంలో సభ్యునిగానూ నియమించింది. వీరు చేసిన సేవలకు గుర్తుగా ఒక సమగ్ర సంపుటాన్ని ఉస్మానియా విశ్వవిద్యాలయం పురాతన చరిత్ర శాఖ 2004లో ముద్రించింది.

శర్మగారు "దేవాలయ కళ – వాస్తుశిల్పం" అనే అంశాల మీద మౌలిక పరిశోధన తెలంగాణాలో దేవాలయాలు అనే అంశంపై సమగ్రమైన పరిశోధనా గ్రంథాన్ని వ్రాశారు. ఆం.ప్ర హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపకులు డా॥ యం పట్టాభిరామిరెడ్డి 2004 వరకు ఈ సంస్థ గౌరవ అధ్యక్షులుగా ఉండగా, వారి తరువాత యం.రాధాకృష్ణశర్మ – ఈ బాధ్యతను స్వీకరించి 2014 వరకు దానినే సజావుగా నడిపారు.

చరిత్ర పరిశోధనకు అపూర్వ సేవలను అందించిన ప్రముఖ చరిత్రకారులైన శ్రీయం.రాధాకృష్ణశర్మ 2014 జనవరి 8వ మరణించారు.




(....32వ పుట నుండి)

రకరకాల ఔషధ మొక్కలు తెప్పించి "ఔషధ మొక్కల సాగు" చేయించిన ఘనుడు.

జీవకుడే కాదు – ఆ తర్వాత ఆ తర్వాత భారతీయ వైద్య శాస్త్రంలో శారీరక ధర్మ శాస్త్రానికీ, శారీరక నిర్మాణ శాస్త్రానికీ, రోగ లక్షణాలూ, చికిత్సలకూ పేరు పొందిన గ్రంథం 'చరక సంహిత' – వైద్య శాస్త్రంలో, శస్త్ర చికిత్సా విధానంలో మణిమకుటం 'సుశృత సంహిత'–ఈ రెండు గ్రంథాలు రాసిన చరకుడూ, సుశృతుడూ– ఇద్దరూ బౌద్ధ భిక్షువులే అనేది చాలా మంది చరిత్రకుల అభిప్రాయం.

ఇక, 'అష్టాంగ హృదయం' రాసిన రెండో వాగ్భటుడు, 'అష్టాంగ సంగ్రహం' రాసిన మొదటి వాగ్భటుడు – ఇద్దరూ బౌద్ధ భిక్షువులే. వారు ఆ విషయాల్ని తమ గ్రంథ ప్రస్థావనలోనే చెప్పుకున్నారు. ఈ గ్రంథాల్నే 'వాగ్భటీయాలు' అంటారు.

బౌద్ధులు వైద్య రంగంలో చేసిన సేవలను, బౌద్ధ భిక్షువుల వైద్య పరిజ్ఞానాన్నీ 'విస్తృత యాత్రికుడు' అనే నవల్లో రాహుల్ సాంకృత్యాయన్ చక్కగా విశ్లేషించారు. ధర్మ ప్రచారం కోసం ప్రపంచంలో ఏ మారుమూలకైనా వెళ్లాల్సి వచ్చినప్పుడు వైద్యం భిక్షువుల్ని ఎలా కాపాడిందో, వారిని ప్రజలకు ఎలా చేరువ చేసిందో ఆ నవల్లో తెలియజేశారు.

అయితే – బౌద్ధ కాలంనాటి వైద్యం, గుప్తుల కాలం నాటికి వైదిక మత పరిధిలోకి చేరిపోయింది. ఆయుర్వేదంగా పేరు పడింది. వైదికీకరణ చెందింది. విద్యలాగే వైద్యం కూడా కుల పరిధిలోకి లాగబడి, గుడి గోపురాలు దాటలేకపోయింది.

**వినియోగించే కొద్దీ భాష వికసిస్తుంది**

(.....36వ పుటనుండి)

4. అమ్మభాషకు శరీరం చూపే స్పందన విశిష్టమైనది. ఇన్ని పెంచుకుంటే అణువణువూ స్పందించి, ఆ స్పందనను బలంగా మెదడులో నాటుకొనేటట్లు చేయటంవల్ల ఆయా విషయాలు సుదీర్ఘకాలం ప్రగాఢ జ్ఞాపకాలుగా నిక్షిప్తమై ఉండిపోతాయి. అంతేకాదు ఇందువల్ల పిల్లలు మన సాంస్కృతిక మూలాలనుండి చెదిరి దూరమై పోరు.

5. ఇతర భాషలు నేర్చుకోవడం కూడా చాలా ముఖ్యం. జాతీయంగా, అంతర్జాతీయంగా వస్తున్న విజ్ఞాన ప్రగతిని అంది పుచ్చుకోవటానికి అవి ఎంతో అవసరం. అయితే వాటిని మన భాషా సంస్కృతుల వికాసానికి ఉపయోగపడే కోణంలో కృషి చెయ్యాలి. పాఠశాల విద్యానంతరం ప్రత్యేకంగా ఆంగ్లం నేర్చుకొని కళాశాల విద్యలోను, పరిశోధనారంగంలోను విజయాలు సాధించిన వారెందరో ఉన్నారు. పసితనంలోనే పరాయిభాషలో విద్యాభ్యాసం వల్ల సృజన నశించి, చదువుపట్ల నిరక్తికి, ఆపై మరింత ఒత్తిడి పెరిగినపుడు ఆత్మహత్యలకు దారితీయటం చూస్తున్నాం.

ఈ విషయాలన్నింటిపై మహిళలు అవగాహన పెంచుకొని భాషావికాసం, పరిరక్షణలకోసం కృషి చెయ్యాలి. ఏవిషయంలోనైనా మహిళలు ఒకసారి అర్థం చేసుకుని లక్ష్యసాధనకు పూనుకుంటే సాధించి తీరుతారనే సత్యాన్ని చరిత్ర నిరూపిస్తుంది.

ఒకనాడు రాజకీయంగా ఫ్రెంచి విప్లవం ప్రజాఉద్యమంగా మారటానికి నాంది పలికింది 'పారిస్ స్త్రీల ఆకలియాత్ర'. ఈనాడు సాంస్కృతికంగా తెలుగు భాషాపరిరక్షణ – వికాస ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా ప్రకటిస్తూ శంఖం పూరించాల్సిన బాధ్యత ఆంధ్ర (పారిస్) తెనాలి స్త్రీలపై ఉంది.

**(2018 జనవరి 26, 27, 28 తేదీలలో తెనాలిలో జరిగిన 'తెలుగు సాహిత్య మహోత్సవాల్లో చదివిన పత్రం. రచయిత్రి కాకతీయ విశ్వవిద్యాలయంలో చరిత్ర అధ్యా పకురాలిగా పదవీ విరమణ చేశారు.)**

చలసాని నరేంద్ర
9849569050

# మరోసారి చెలరేగుతున్న ఉత్తరాది-దక్షిణాది విభేదాలు

1960వ దశకంలో తమిళనాడులో ద్రావిడ ఉద్యమం పతాక స్థాయికి చేరుకొని, అక్కడ డీయంకే రాజకీయంగా బలం పుంజుకొంటున్నప్పటి నుండి ఆర్య - ద్రావిడ విభేదాలు చెలరేగి, దేశంలో ఉత్తరాది - దక్షిణాది విభేదాలు దేశ సమగ్రతకు భంగం వాటిల్లడం చూసాము. భారత దేశం అసలు ద్రావిడులదని, ఎక్కడినుండో వచ్చిన ఆర్యులు వారిని దక్షిణాదికి నెట్టివేసి, మొత్తం దేశంపై ఆధిపత్యం వహిస్తున్నారనే వాదనలను లేవదీశారు. ఈ సందర్భంగా హిందీ భాషపై, ఉత్తరాది నాయకత్వంపై నిప్పులు చెలరేగే పరిస్థితి కల్పించారు.

చివరకు ద్రావిడుడైన రావణుడిని ఆర్యుడైన రాముడు చంపివేశాడని గగ్గోలు పెట్టడం కూడా చేశారు. ఈ సందర్భంగా మొత్తం తమిళనాడు కేంద్రంగా సనాతన భారతీయ ఆలోచన విధానాన్ని సవాలు చేసే పరిస్థితులను దేశమంతటా వ్యాప్తి చేసే ప్రయత్నాలు జరిగాయి. మొత్తం మీద తమిళనాడులో అధికారం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీ దాదాపు ఉనికి కోల్పోయిన పరిస్థితి ఏర్పడింది.

డియంకెలో చీలికలే గత అర్ధ శతాబ్దిగా తమిళనాడు రాజకీయాలను శాసిస్తున్నాయి. అయితే డీయంకే ప్రతిపాదించిన సైద్ధాంతక భూమిక నేడు తమిళనాడులోనే బద్దలయింది. అది వేరే విషయం.

ఏది ఏమైనప్పటికీ దక్షిణాది నాయకత్వం పట్ల ఢిల్లీలో పెత్తనం చేస్తున్న వారిలో కొంత చులకన భావం ఉన్నదని చెప్పవచ్చు. ముఖ్యంగా 85 యంపీ సీట్లు ఉన్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రం దేశ రాజకీయాలను శాసించే పరిస్థితి నెలకొన్నది. ఆ తర్వాత హిందీ మాట్లాడే నాయకులే దేశ రాజకీయాలను దాదాపు అన్ని రాజకీయ పార్టీలలో శాసిస్తూ వచ్చారు. వాస్తవానికి దక్షిణాది నుండి వచ్చిన దేవెగౌడ, పివి నరసింహారావు వంటివారు ఉత్తరాది నాయకులకన్నా మెరుగైన పాలన అందించినా, స్థిరమైన నిర్ణయాలు తీసుకొనే ప్రయత్నం చేసినా వారి ఉనికిని ఉత్తరాది నాయకులు సహించలేక పోయారు. వారిద్దరిని అవమానకర రీతిలో సాగనంపే ప్రయత్నాలు జరిగాయి.

తెలుగునాట అధికారం చేపట్టిన ఎన్ టి రామారావు జాతీయ స్థాయిలో కాంగ్రెస్ వ్యతిరేక పార్టీలను ఒక వేదికపైకి తీసుకు వచ్చి, దేశంలో కాంగ్రెస్ ఆధిపత్యాన్ని సవాల్ చేసే ప్రయత్నం చేసారు. దానితో 25 ఏళ్లపాటు దేశానికి సంకీర్ణ రాజకీయాలు శరణ్యం అయ్యాయి. ఈ వరవడిని, గండికొట్టిన నరేంద్ర మోడీ సహితం హిందీ ప్రాంతపు అండ లేనిదే తనకు రాజకీయ మనుగడ ఉండదనే ఉద్దేశ్యంతో వారణాసి నుండి పోటీచేసి గెలుపొందడం తెలిసిందే. ఏది ఏమైనా హిందీ మాట్లాడలేని రాజకీయ నాయకులు జాతీయ రాజకీయాలలో రాణించలేక పోతున్నారు.

తాను ప్రధానమంత్రి కాలేక పోవడానికి హిందీలో ధారాళంగా మాట్లాడలేక పోవడమే కారణమని మాజీ రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ చెప్పుకోవడం తెలిసిందే. ఇటువంటి తరుణంలో రాష్ట్రాలకు కేంద్ర పన్నులలో వాటా ఇచ్చే అంశంలో అనుసరింపవలసిన జనాభా ప్రామాణికత విషయంలో ఇప్పుడు చెలరేగుతున్న వివాదం మరోసారి ఉత్తరాది-దక్షిణాది విభేదాలకు ఆజ్యం పోస్తున్నట్లు చెప్పవచ్చు. దీనితో ఉత్తరాది-దక్షిణాది రాష్ట్రాల మధ్య ఘర్షణ ఏర్పడవచ్చుననే ఆందోళనలు వ్యక్తం అవుతున్నాయి.

1971 జనాభా లెక్కలకు బదులు 2011 జనాభా గణన సమాచారాన్ని పరిగణనలోకి తీసుకుని కేంద్ర పన్నుల రాబడిని రాష్ట్రాలకు పంపిణీ చేయాలని 15వ ఆర్ధిక సంఘానికి కేంద్రం సిఫార్సు చేయడంపై చెలరేగుతున్న వివాదం ఈ సందర్భంగా ఆందోళన కలిగిస్తున్నది . కేంద్రం సిఫార్సు అమల్లోకి వస్తే దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలపై ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం అవుతున్నది.

మొదటగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గతంలో తాను మద్దతు ఇచ్చిన ప్రధాని నరేంద్ర మోడీపై విమర్శలు చేసే సందర్భంగా - ఉత్తరాది 'పెత్తనం' ఏమిటంటూ తీవ్ర ఆగ్రవేశాలు వ్యక్తం చేశారు. ఇప్పుడు తాజా ప్రతిపాదనపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబునాయుడు, కె చంద్రశేఖరరావు నిరసనలు తెలిపారు. ఈ విషయమై తమిళనాడులో ప్రతిపక్ష నేత యం కె స్టాలిన్ కాంగ్రెసేతర ముఖ్యమంత్రులు పదిమందికి లేఖలు వ్రాస్తూ కేంద్ర చేపట్టిన దుర్మార్గపు చర్యను ఉమ్మడిగా ప్రతిఘటించాలని పిలుపిచ్చారు.

కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాన్ని అడ్డుకోవాలని కోరుతూ కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య తమిళనాడు, కేరళ, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి ముఖ్యమంత్రులకు ట్వీట్లు ఇచ్చారు. వెంటనే కేరళ ఆర్థిక మంత్రి మరో అడుగు ముందుకు వేసి ఏప్రిల్ 10న దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మంత్రుల సమావేశాన్ని తిరువనంతపురంలో ఏర్పాటు చేశారు. పదహేనో ఆర్థిక సంఘం పరిశీలనలోని కొన్ని పరిశీలనాంశాలు లోపభూయిష్టంగా ఉన్నాయని అంటూ దక్షిణాదిన ఇప్పుడు తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతున్నది. వీటి వల్ల రాష్ట్రాలకు కేంద్ర పన్నులలో వాటా గణనీయంగా తగ్గిపోగలదని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర పన్నుల రాబడిని ప్రతీ అయిదేళ్లకు వివిధ రాష్ట్రాలకు ఏ నిష్పత్తిలో పంపిణీ చేయాలనే అంశాన్ని రాజ్యాంగ బద్ధంగా ఏర్పాటైన ఆర్థిక సంఘం నిర్ణయిస్తుంది. ప్రతీ ఆర్థిక సంవత్సరంలో వసూలు చేసిన కేంద్ర పన్నుల్లో 42 శాతం అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు కేటాయిస్తారు. మిగతా 58 శాతాన్ని జాతీయ అవసరాల కోసం కేంద్రం వినియోగిస్తుంది. వివిధ రాష్ట్రాలకు కేటాయించే 42 శాతం నిధులపై ఆర్థికసంఘం నిర్ణయిస్తుంది.

గతేడాది నవంబర్ 27న ఎన్‌కే సింగ్ అధ్యక్షతన 15వ ఆర్థికసంఘాన్ని కేంద్ర ఆర్థికశాఖ ఏర్పాటు చేసింది. ఫైనాన్స్ కమిషన్ 2020-25 కాలానికి సంబంధించిన పన్నుల కేటాయింపుపై వచ్చే ఏడాది అక్టోబర్ 30 లోగా నివేదిక సమర్పించాల్సి ఉంది.

70వ దశకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున కుటుంబం

నియంత్రణ కార్యక్రమాలు చేపట్టి జనాభా పెరుగుదలను నియంత్రించడం కోసం ప్రయత్నాలుప్రారంభించాయి . అయితే ఈ విషయంలో దక్షిణాది రాష్ట్రాలు చూపిన ఆసక్తిని ఉత్తరాది రాష్ట్రాలు చూపలేదు. దానితో ఉత్తర ప్రదేశ్, బీహార్ వంటి రాష్ట్రాల జనాభా గణనీయంగా పెరుగుతూ ఉంటే, దక్షిణాది రాష్ట్రాల జనాభా తగ్గుతూ వస్తున్నది. అందుకనే ఇప్పటి వరకు 1971 నాటి జనాభాను ప్రామాణికంగా తీసుకొంటూ ఉండగా, ఇప్పుడు ఏకపక్షంగా 2011 జనాభాను ప్రామాణికంగా తీసుకోవాలని అనుకోవడం పట్ల సహజంగానే తీవ్ర అలజడి చెలరేగుతున్నది.

**రాజకీయ కుట్ర**

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనుక రాజకీయ కుట్ర కూడా ఉన్నదనే అనుమానాలు ఈ సందర్భంగా వ్యక్తం అవుతున్నాయి. 1976లో జరిగిన నియోజకవర్గాల పెంపు 1971 జనాభా ఆధారంగా జరిగింది. ఆ తర్వాత నియోజక వర్గాల పునర్విభజన జరిగినా మొత్తం నియోజక వర్గాల సంఖ్యను పెంచే ప్రయత్నం చేయనే లేదు. తిరిగి 2026లో నియోజక వర్గాల పునర్విభజన జరుగవలసి ఉంది. ఆ సమయంలో 2011 జనాభా ప్రకారం నియోజకవర్గాల సంఖ్యను నిర్ణయించే ప్రయత్నం చేస్తే దక్షిణాదికి అన్యాయం జరుగుతుందనే భయం పెరుగుతున్నది.

ఆ విధంగా చేస్తే దక్షిణాది రాష్ట్రాలలో లోక్‌సభ, రాజ్యసభ నియోజకవర్గాల సంఖ్య తగ్గి, హిందీ రాష్ట్రాలలో పెరిగే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు తమకున్న అత్యధిక నియోజకవర్గాల కారణంగానే హిందీ రాష్ట్రాలు రాజకీయంగా పెత్తనం చేస్తున్నాయి. జాతీయ రాజకీయాలతో ఈ పరిణామం దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యత మరింత తగ్గే ప్రమాదానికి దారితీస్తుంది.

ఆ విధంగా జరగడం ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న బిజేపికి రాజకీయంగా ప్రయోజనం కలిగించే అంశంగా ఉండడంతో 2011 జనాభాను ఒక రాజకీయ కుట్రలో భాగంగా ప్రమాణంగా తీసుకొంటున్నారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

బిజెపి అధ్యక్ష పదవిని చేపట్టగానే దక్షిణాదిన పార్టీని అధికార పక్షంగా మార్చే విధంగా అభివృద్ధి చేస్తానని అంటూ అమిత్ షా చెప్పుకొంటూ వచ్చారు. అయితే ఈ దిశలో చెప్పుకోదగిన పురోగతి సాధించలేక పోయారు. 2014లో ఆ పార్టీ – హిందీ బెల్ట్' లోనే 90 శాతం వరకు స్థానాలు గెలుచుకోగలిగింది. తమకు బలం లేని దక్షిణ, తూర్పు రాష్ట్రాలకు విస్తరించడం సాధ్యం కాదని గ్రహించి, తమను నిరాకరిస్తున్న రాష్ట్రాల ప్రాధాన్యతను ఈ విధంగా కుదించే ప్రయత్నం చేస్తున్నట్లు భావించ వలసి వస్తుంది.

1991లో సరళీకృత ఆర్థిక విధానాల అమలు మొదలయ్యాక ఆ తర్వాతి ఇరవై ఏళ్లలో ఉత్తరప్రదేశ్,బీహార్‌లలో కలిపి 25 శాతం జనాభా పెరుగుదల రికార్డయింది. అదే ఆంధ్రప్రదేశ్, తమిళనాడు,కేరళల్లో కలిపి 12 శాతమే జనాభా పెరిగింది. ఈ రెండు దశాబ్దాల్లో కేరళలో 5 శాతం జనాభా వృద్ధి కాగా బిహార్‌లో ఎన్నోరెట్లు పెరిగింది. గత 40 ఏళ్లలో ఉత్తర ప్రదేశ్ లో జనాభా పెరుగుదల 150 శాతం వరకు ఉంది. జాతీయ సగటు, దక్షిణాది రాష్ట్రాల జనాభా పెరుగుదల సగటు కంటే కూడా ఉత్తరాది రాష్ట్రాల్లో అత్యధికశాతం పెరుగుదల ఉన్నట్టు స్పష్టమైంది.

జనాభా పెరుగుదలకు కట్టడి చేసినందుకు నిధుల కేటాయింపులో తమ పట్ల వివక్షత చూపడం ఏమిటనే ప్రశ్నను ఇప్పుడు లేవదీస్తున్నారు. విద్య, ఆరోగ్య రంగాలలో తాము సాధించిన గణనీయ ప్రగతికి శిక్ష వేస్తున్నారా అని ప్రశ్నిస్తున్నారు. సంతానోత్పత్తి శాతాన్ని తగ్గించేందుకు, అక్షరాస్యత శాతాన్ని పెంచేందుకు దక్షిణాది రాష్ట్రాలు విద్య, ఆరోగ్య పథకాలకు పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేస్తున్నందుకు కేంద్రం శిక్షిస్తున్నట్టుగా ఇది ఉందని వ్యాఖ్యానిస్తున్నారు.

**దక్షిణాది పట్ల వివక్షత**

అనేక విధాలుగా దక్షిణాది రాష్ట్రాల పట్ల కేంద్ర వివక్ష ధోరణిని ప్రదర్శిస్తున్నదనే బలమైన అభిప్రాయాలు ఈ సందర్భంగా వ్యక్తం అవుతున్నాయి. జయలలిత మృతి తర్వాత తమిళనాడు రాజకీయాలను తెరవెనుక నుండి నిర్దేశించే ప్రయత్నం చేయడంతో బీజేపీ పట్ల తమిళనాడులో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైనది. బిజెపి జాతీయ అధ్యక్ష పదవి చేపట్టిన తర్వాత ఉత్తరాదిన విశేషమైన ప్రాచుర్యం సంపాదించుకున్న బంగారు లక్ష్మణ్ ను అత్యంత అవమానకరంగా రాజకీయ రంగం నుండి వెనుకకు పంపే ప్రయత్నం ఏ విధంగా జరిగిందో చూసాము.

విభజన హామీలు అమలు చేయకుండా, అదేమని అడిగిన తెలుగు దేశం ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు చేస్తున్న బిజెపి నాయకత్వం పట్ల తెలుగు ప్రజలలో సహితం వెగటు వ్యక్తం అవుతున్నది. ఒక వంక అవినీతి కేసులలో ముద్దాయిగా ఉన్న వైయస్ జగన్మోహన్ రెడ్డితో సానుకూలంగా వ్యవహరిస్తూ, మీతో పొత్తు తెంచుకున్నందుకు అవినీతి ఆరోపణలు చేస్తారా అనే ప్రశ్నలు తలెత్తాయి.

చంద్రబాబునాయుడు ప్రభుత్వ అవినీతి చర్యలపై కేంద్రం, బిజెపి కఠినంగా ఉంటే ఎవ్వరూ తప్పు పట్టనవసరం లేదు. కానీ విభజన హామీలకు మోడీ మొండిచేయి చూపడమే ప్రజలలో ఆగ్రహానికి దారితీస్తున్నది.

ఇటీవల రూ 50 వేల కోట్ల లోటు బడ్జెట్ లో ఉన్న ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం రూ. 36 వేల కోట్లతో రైతు రుణమాఫీని రాజకీయ అవసరాల కోసం ప్రకటించింది. దానిని అమలు చేసేందుకు అవసరమైన రుణాలకు కేంద్రమే హామీ ఉంది. కానీ రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు 2014లో అటువంటి రుణ మాఫీ హామీ ఇవ్వడాని కేంద్రం తిరస్కరించడం గమనార్హం.

'సహకార సమాఖ్య' వ్యవస్థను ప్రబోధిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర ప్రభుత్వాలతో సమాలోచనలు జరిపిన అనంతరం 2011 సంవత్సరాన్ని ప్రామాణికంగా తీసుకొని ఉంటే పలు అపోహలకు ఆస్కారం ఉండే అవకాశం ఉండదు. కనీసం ఈ అంశాన్ని కేంద్ర మంత్రివర్గంలో కూడా చర్చించినట్లు లేదు. ఇటువంటి ఏకపక్ష నిర్ణయాలు సహజంగానే పలు అనుమానాలు, అపోహలకు దారితీస్తాయి. తక్షణం అటువంటి అపోహలు తొలగించే ప్రయత్నం చేయాలి. లేని పక్షంలో ఉత్తర– దక్షిణ విభేదాలు చెలరేగి దేశంలో మరోరకపు రాజకీయ కల్లోలం చెలరేగే అవకాశం ఉంది.

**సొంత భాషను అణగద్రొక్కి సంస్కృతిని కాపాడలేరు**

ఈమని శివనాగిరెడ్డి - స్థపతి
9848598446

# పశ్చిమ చాళుక్య రాణులు, మంత్రులు, సామంతుల బిరుదులు



పశ్చిమ (బాదామీ) చాళుక్యరాజులతోపాటు రాణులు, మంత్రులు, సామంతులు కూడా వారి శక్తి సామర్థ్యాలు, గుణగణాలను బట్టి బిరుదులను ధరించారు.

విజయభట్టారిక (రెండో పులకేశిరాణి) ప్రియమహిషి అనే బిరుదు వహించింది. ఈవిడ కౌముదీ మహోత్సవ కృతిని స్వీకరించింది. లజ్జల దేవి ప్రముఖ నాట్య విద్వాంసురాలు. నృత్యవిద్యాధరి అనే బిరుదు పొందింది.

పశ్చిమ చాళుక్యుల శిల్పులు కూడా వారివారి పనితనాన్ని ప్రతిభను బట్టి బిరుదులతో సత్కరించ బడినారు. పట్టడకల్‌లోని పాపనాథ దేవాలయ నిర్మాణ శిల్పి. బలదేవ శిల్పాచార్యుడు దుగ్గి ఆచార్యుని కొడుకు. ఇతనికి యోగవిద్యాధర అనే బిరుదుంది. శ్రీనివంతాచారి గుండన అనే శిల్పికి త్రిభువనాచారి అనే బిరుదుంది. పట్టడకల్లులోని త్రైలోక్యేశ్వర లేక మల్లికార్జున దేవాలయ శిల్పి. వాస్తు శిల్పి శాస్త్రాల్లో ఇతన్ని మించిన వాడు మూడులోకాల్లో లేడు అని ఈ బిరుదు అర్థం. ఇతనికి త్రైలోక్య మహాదేవి ఈ బిరుదునిచ్చింది.

సర్వసిద్ధి ఆచారి అనే మరో శిల్పి పట్టడకల్లులోని లోకేశ్వర / విరూపాక్ష దేవాలయాన్ని నిర్మించింది. ఇతనికి అనేకరూప వాస్తుపితామహ, తెంకణ దిశాయ సూత్రధారి, మణిమకుట రత్న చూడామణి, (కిరీటాల తయారీలో దిట్ట), నకలసూక్ష్మతి భాషితుడు, వాస్తు ప్రాసాదయాభాసన సయన (వాస్తు, ప్రాసాద, ఆసనాలను దీర్చి దిద్దటంలో గొప్పవాడు), సకల గుణాశ్రయుడనే బిరుదులను ధరించాడు. సరసొబ్బ అనే ప్రఖ్యాత శిల్పి ఐహోలులోని జైనాలయాన్ని నిర్మించాడు. జంబూ ద్వీపంలోనే తనను మించిన శిల్పి లేడని ప్రకటించుకొన్నాడు. అంతేకాక తనంతటి శిల్పి భూత, భవిష్యత్ కాలాల్లో లేడని కూడా చెప్పుకొన్నాడు. ఇతనికి గుణ విరూప సంఘాత (గుణంలో సూర్యునితో సమానం), ప్రమాణ భరణ (వాస్తు, శిల్ప శాస్త్ర నియమాల్లో ప్రామాణికుడు), విమాన రంజితుడు (ఆ గర్భాలయాలపై నిర్మించే విమానాలను అందంగా నిర్మించగలవాడు, శాస్త్రమహేశ్వర (వాస్తు, శిల్ప శాస్త్రాల్లో మహేశ్వరుడంతటివాడు) అనే బిరుదులను పొందాడు.

## స్పందన

✸ న్యాయస్థానాల్లో తెలుగు వినియోగంకోసం న్యాయమూర్తులు ముందుకు రావడం చాలా ఆనందంగా వుంది. విశ్వవిద్యాలయాలలోని తెలుగుశాఖల తలకాయలు, పెట్టే గురకలు తప్ప వాక్కులు వినిపించడం లేదు. ఆ న్యాయమూర్తులకు దండాలు. తెలుగుకి ద్రోహం చేసే వారికి అరదండాలు వేసే రోజులు రావాలని కోరుకుంటున్నా.

తెలుగులో తీర్పుకోసం సరసి వేసిన కార్టూన్ ఎంతో సహానుభూతిని కల్గిస్తుంది. న్యాయస్థానాలకు వచ్చే సాక్షుల భుజాలమీద కండువా తీసెయ్యమని అక్కడి వుద్యోగులు హెచ్చరించి తీయించేస్తూ వుంటారు. అది న్యాయమేనా? అచ్చతెలుగు మనిషికి భుజాన కండువా సాంప్రదాయ చిహ్నం. దాన్ని ధరిస్తే న్యాయమూర్తులకు ఎదురు తిరిగినట్టు అవుతుందా? వాదనలకూ, తీర్పులకూ కళ్ళనీళ్ళు వస్తే తుడుచుకోవడానికి తుండుగుడ్డ కూడా వుండకూడదా?

న్యాయమూర్తులు సాక్షుల సమాధానాల్ని తెలుగులో వింటున్నారు. న్యాయవాదులు. తెలుగులోనే సాక్షుల చేత సమాధానాలు చెప్పిస్తున్నారు. తీర్పు మాత్రం తెలుగులో యివ్వరు. మిగతా విషయం అంతా ఇంగ్లీషులో వున్నా, కనీసం తీర్పు అన్నా తెలుగులో యివ్వలేరా? మృత్యు ముంగిట వున్న రోగికి వైద్యుడు, 'ఫరవాలేదండి, నయమవుతుంది' అని తెలుగులో అబద్ధం చెప్పి, ధైర్యం కల్గిస్తాడు. న్యాయమూర్తులు, తెలుగులో నిజం చెప్పి ప్రజలకు మేమున్నామని ధైర్యం కలిగించలేరా? తెలుగు ప్రజలమైన మనము, పోలీసులు, డాక్టర్లు, లాయర్లు, ఇంజనీర్లు అందరమూ తెలుగు ప్రజల తెలుగు రైతుల తెలుగు శ్రామికుల కష్టార్జితాలపైనే ఆధారపడి బ్రతుకుతున్నాము. ఒక్క తెలుగు మాటతో ఆ సాధారణ ప్రజలకు ధైర్యం కల్గించలేమా? అవసాన దశలో, ప్రాణం పోయే ముందు కొడుకులూ, కూతుళ్లూ తులసి నీళ్ళు పోస్తారేగానీ వైన్ పొయ్యరు. క్రైస్తవులూ, ముస్లిములూ వారి వారి మాతృభాషల్లో ప్రార్థనలు చేస్తారేగానీ, ఇంగ్లీషు ప్రార్థనలు చెయ్యరు. చివరికి దేవుడి దగ్గరకి చేర్చేది కూడా మాతృభాషే. న్యాయమూర్తులు యిది తెలుసుకుంటే ఎంత బాగుండును? వాళ్ళకే న్యాయం కావలసివస్తే దేవుణ్ని ఇంగ్లీషులో అడుగుతారా? ఒకవేళ ఆయన, లాటిన్‌లో తీర్పు ప్రకటిస్తే వీళ్లేమవుతారు?

✸ డాక్టర్ నలిమెల భాస్కర్, తెలుగు సంస్కృతాల అవినాభావ సంబంధం వ్యాసం చాలా బావుంది. అందులో పట్కరోళ్ళు, అంటే పద్మశాలీలు కాదు, కంసాలురు లేదా విశ్వబ్రాహ్మణులు, శిల్పులు అని నేను అనుకుంటున్నాను. అలాగే 'పత్తిత్తు' అన్న మాట పతివ్రతలకు అవమానకరంగా ఉపయోగించే పదం కాదు. అది పత్తి - యిత్తు... పత్తిత్తు. పత్తి విత్తు చుట్టూ తెల్లని దూది వుంటుంది. అలా బాగా తల నెరిసిన వాళ్లని 'పత్తిత్తులు' అంటారు. 'పెద్దపత్తిత్తు - చెప్పొచ్చిందిలే' అంటే, 'ఇదేం అంత అనుభవశాలి యేం కాదు, అయినా తీర్పు చెప్పొచ్చింది' అన్న అర్థం వస్తుంది.

**- డి. నటరాజ్,** 9440428597

# తెలుగు సాహిత్యంలో దేశభక్తి



'తెలుగు సాహిత్యంలో దేశభక్తి' (స్వాతంత్ర్య సప్తతి - నవతి వ్యాస సంపుటి), పేజీలు : 724, వెల: రు.500/- సంపాదకులు : డా॥ తూమాటి సంజీవరావు, ప్రచురణ : తెలుగు భాషా వికాస పరిషత్తు, చెన్నై, ప్రతులకు : తిరునగరి భాస్కర్, చెన్నై, సెల్ : 9962692662, డా॥ తూమాటి సంజీవరావు, చెన్నై, సెల్ : 988446208

పొరుగు రాష్ట్రం చెన్నైలో ఉంటూ చేయెత్తి తెలుగు భాషకు జైకొట్టే తెలుగువాడు శ్రీ తూమాటి సంజీవరావు. తెలుగు భాషకు ప్రాచీన హోదాకోసం ఎంతగా న్యాయపోరాటం చేసారో మనకు తెలుసు. మాతృభాషపై ఎంత గాఢమైన ప్రేమ ఉందో అంతగానూ, మాతృభూమిపై అభిమానం - దేశాభిమానం తనకు కద్దని మరొక్కసారి రుజువు చేసుకున్నారు ఈ పుస్తకం సంపాదకులుగా.

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 70సం॥లు పూర్తయిన సందర్భంగా 'సప్తతి' వేడుకను 93 వ్యాసాల సంకలనంగా వెలువరించి, 'నవతి' వ్యాస సంపుటిగా, యావత్ తెలుగుజాతి, సాహితీలోకం, సాహిత్యాభిమానులు అభినందించేలా, మహాప్రయత్నం చేశారు. ఆనాడు జాతి జనులను స్వాతంత్ర్య సంగ్రామోన్ముఖులను చేయటానికి అనేక రంగాలలో జరిగిన ప్రయత్నాలలో సాహిత్యరంగం కూడా ప్రధాన పాత్ర పోషించింది. ఎందరో త్యాగధనుల, దేశభక్తుల చరిత్రల్ని యిలా పలు సాహిత్య ప్రక్రియల ద్వారా దేశభక్తి సాహిత్యాన్ని తెలుగు కవులు, కవయిత్రులు, రచయిత(త్రు)లు సుసంపన్నం చేసారు. వాటినన్నింటినీ ఏకీకృతం చేసి ఒక్కచోటికి తీసుకు వచ్చారు సంపాదకులు. తెలుగు భాషకు కైదోడుగ ఉండేందుకు తెలుగు భాషా వికాస పరిషత్తును ప్రారంభించటం, అదే రోజున ఈ పుస్తకాన్ని ఆవిష్కరించటం (తేదీ 02-10-2017) చాలా విశేషం.

పదహారు అధ్యాయాలుగా విభక్తమైన గ్రంథంలో వాటిని చక్కటి శీర్షికలుగా పెట్టి చాల సమర్ధవంతంగా వర్గీకరణ చేశారు. దేశభక్తి, దేశభక్తులు, జాతీయ /రాష్ట్రోద్యమ సాహిత్యం, సాహితీ స్రష్టలు - దేశభక్తి, చారిత్రక కావ్యాలు - దేశభక్తి, నాటకరంగం - దేశభక్తి, సినీ సాహిత్యం, దేశభక్తి, స్త్రీలు - దేశభక్తి, యిలా సాహిత్యంలోని అన్ని ప్రక్రియా భేదాలు అన్నిటిలోను దేశభక్తి ఏ విధంగా సాహిత్యరూపం సంతరించుకుందో సమగ్రంగా, అందరికీ అర్థం అయ్యే భాషలో వివరించారు. ఆంగ్లభాషలో నాలుగు వ్యాసాలు ఈ పుస్తకంలో చోటు చేసుకున్నాయి. అనుబంధంగా 'గరిమెళ్ళ' వారి 'మాకొద్దీ తెల్లదొరతనము దేవ." గేయం పూర్తి పాఠం ఇచ్చారు.

మొత్తం మీద చూసినట్లయితే, 1970 ప్రాంతంలో 'తెలుగులో జాతీయోద్యమ కవిత్వం' (మద్దూరి సుబ్బారెడ్డి) సిద్ధాంత గ్రంథం తర్వాత దేశభక్తి విషయంగా తెలుగు సాహిత్యంలో యిప్పుడు 'తెలుగు సాహిత్యంలో దేశభక్తి' ఒక సమగ్రమైన దేశభక్తి సంభరిత వ్యాసమంజరి.

# అశోకపథం(చరిత్రాత్మక పద్యనాటకం)

అశోకపథం (చరిత్రాత్మక పద్య నాటకం) నాటక కర్త : చిటిప్రోలు వేంకటరత్నం, పేజీలు : 86, వెల : 95/-, ప్రతులకు : శ్రీమతి చిటిప్రోలు జయప్రభ ఎమ్.ఏ., సెల్ : 7702358616, ఫ్లాట్ నెం. 401, హైవే హైట్స్ అపార్ట్‌మెంట్, ఆర్టీసీ కాలని, కపర్ది నగర్, కాకాని రోడ్డు - గుంటూరు మరియు అన్ని ప్రముఖ పుస్తక అంగళ్లలో



అశోకపథం అనగానే బౌద్ధమత చరిత్రలో ప్రముఖుడైన అశోక చక్రవర్తి అని. అతడు అనుసరించిన మార్గం అశోకపథం అనీ అనిపించక మానదు. అయితే ఈ నాటకంలో ప్రధాన కథా వస్తువు - శోక స్పర్శలేని మరియు శోక రహితమైన స్వచ్ఛమైన ఆనందం. అటువంటి స్వచ్ఛమైన ఆనందాన్ని కలుగచేసే మార్గం 'అశోకపథం' అని, ప్రతివ్యక్తీ ఆ మార్గాన్ని అనుసరించాలని నాటక కర్త ఉద్దేశ్యం.

అటువంటి స్వచ్ఛమైన ఆనందం కలగాలంటే - లోకంలో ప్రతి వస్తువు అశాశ్వతం 'అని తెలిసి, 'నాది' అనే భావాన్ని వీడి నిస్వార్థంగా ప్రవర్తించాలి. ప్రేమ, కరుణ కలిగి యుండాలి. పరోపకార పరాయణుడై మెలగాలి. అప్పుడే వారికి నిర్వాణ సుఖం ప్రాప్తిస్తుంది. ఆ నిర్వాణమే శోక రహితమైన స్వచ్ఛానందం కలుగచేస్తుంది. ఆ పథం అనుసరిస్తే అశోకపథంగా మారుతుందని బుద్ధుడిగా బోధివృక్షం క్రింద జ్ఞానోదయం పొందిన సిద్ధార్థుని కథే ఈ నాటకం. అష్టాంగ మార్గాలు, చతురార్య సత్యములు పాటిస్తే శోక నిర్మూలనం జరుగుతుంది. దుఃఖోపశమనం కలుగుతుందని ఇందులోని యితివృత్తం.

ఇందులో అయిదు అంకాలున్నాయి. ఇది చారిత్రక నాటకం. గద్య పద్య గేయాత్మకంగా (34 పద్యాలు, ఒక గీతం, నాలుగు గేయాలు) మనోహరంగా సాగిన రచన. ఈ నాటకంలోఉపయోగించిన భాష సరళగ్రాంథికం కావటంతో సామాన్యులకు కూడా తేలికగా అర్థం అయ్యేలా వుంది.

అయితే, నాటక రచనా విధానంలో నాటక లక్షణాలను అంతగా పాటించలేదని, అసామాన్య, అసంభావ్య సంఘటనలకు తావు ఇవ్వకుండా రచన చేసినట్లుగా రచయిత ముందు మాటల్లో పేర్కొన్నారు. కేవలం నాటకీయతకోసం, పరస్పర వైరుధ్యంలేని ఒక సహేతుకమైన కథా వస్తువును స్వయంగా రూపొందించినట్లుగా కూడా నాటకకర్త చెప్పారు. అందువలన నాటక సాహిత్యానికి సంబంధించిన లక్షణాలను సంప్రదాయాలను గురించిన చర్చ అనవసరం. ఈ నాటకానికి ముందు మాటల రాసిన ఆచార్య గంగప్పగారు ఇది ప్రతిభగల రచన అని అంటూ ఈ నాటక రచనలో, ఇతివృత్త నిర్వహణలో, సన్నివేశ కల్పనలో, పాత్ర చిత్రణలో, సందర్భోచిత పాత్రోచిత సంభాషణలు కొనసాగించటంలో రచయిత ప్రతిభను, అభినందించి, ఆశీర్వదించారు.

- ఎం.వి.శాస్త్రి

9441342999



**అయ్యప్ప స్వామి జీవిత చరిత్రము : గేయ కథా మాలిక ;** పుటలు: 144, వెల: రు.100/-,

**శ్రీ శాస్తా అయ్యప్ప పౌరాణిక చరిత్ర : పౌరాణిక, చరిత్ర కథల సమాహారం, శబరిమల విశేషాలు** పుటలు: 360, వెల: రు.200/-,



రచన : అల్దీ రామకృష్ణ ; ముద్రణ: విజయవాణి ప్రింటర్స్, చౌడేపల్లి - 517 257, చిత్తూరు జిల్లా, ప్రతులకు : అల్దీ రామకృష్ణ, ఆర్ ఎస్ రోడ్, కలికిరి పోస్టు & మండలం, చిత్తూరు జిల్లా - 517 234, సెల్ : 9703520064



**చినుకుల తోట :** పిల్లల పాటలు ; సంకలన కర్త : ఈ. రాఘవేంద్ర; పుటలు: 52, వెల: రు.50/-, ప్రచురణ: బాలనేస్తం; ప్రతులకు: ప్రభుత్వ ఉన్నతపాఠశాల, రాయదుర్గం - 515 865 అనంతపురం జిల్లా ; సెల్ : 9494074022.

**ఎనిమిదో రంగు :** కవిత్వం ; రచన: అనిల్‌డ్యాని ; పుటలు: 80, వెల: రు.100/-, ప్రచురణ: శ్రీశ్రీ ప్రింటర్స్, విజయవాడ ; ప్రతులకు: సాహితీమిత్రులు 28-10-16, మసీదు వీధి, అరండల్‌పేట, కార్ల్‌మార్క్స్ రోడ్, విజయవాడ - 520 002; ఫోన్ : 0866-2433359, 9392971359





**ఒక :** కవిత్వం; రచయిత : సిద్ధార్థ కట్టా పుటలు: 104, వెల: రు.65/- ప్రచురణ : శ్రీశ్రీ ప్రింటర్స్, విజయవాడ సెల్ : 9490 634848 ప్రతులకు: ప్రజాశక్తి బుక్ హౌస్ మరియు అన్ని బ్రాంచ్‌లలో

**అనంత రత్నాలు :** స్వర్గస్థులైన మహనీయులకు పద్య నివాళి; రచన:వి.చంద్రశేఖర శాస్త్రి; పుటలు: 120, వెల: రు.70/-, ప్రతులకు: విశాలాంధ్ర బుక్ హౌస్, నవచేతన బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు, వి. వైదేహి, 1-2-920-2, ఫ్లాట్ నెం -24, సోమనాథ నగర్, అనంతపురం - 515004. సెల్ : 9441883190,91827 97031





**హితాక్షరి :** వచన కవితలు ; ప్రచురణ : నవ్య సాహిత్య పరిషత్ ; పుటలు: 84, వెల: రు.60/-,ప్రతులకు: డా॥ మలయశ్రీ, ఆదిత్యభవన్, వామన నగర్, ఇం.నెం. 1-113/7, రేకుర్తి, కరీంనగర్ - 505 451, ఫోన్: 9866546220, 0878-2230610

**ఎడారి చలమ :** కవిత్వం; రచన: డా॥ చెన్నకేశవ; పుటలు: 124, వెల: రు.120, ప్రచురణ : మధుమైత్రి పబ్లికేషన్స్, ప్లాట్ నెం.10, ఇం.నెం. 54-18-37/1ఎ, రేడియో కాలని, మొదటిలైను, విజయవాడ - 520008 ఫోన్: 0866-2482210; సెల్ : 9866045086





**చలం చింతన- 2** (కళ, సినిమా) సంకలనం : ఆళ్ళ గురుప్రసాదరావు, గాలి ఉదయ కుమార్ వెల: రు.150/-, ప్రతులకు: నవోదయ బుక్ హౌస్, 33-865, ఆర్యసమాజ్ మందిర్ ఎదురు వీధి, కాచిగూడ × రోడ్, హైదరాబాద్ - 500027 సెల్ : 9247471361/62

**మనిషి నా భాష** (కవిత్వం) : రచన : కిల్లాడ సత్యనారాయణ, పుటలు:118, వెల: రు.75/- ప్రచురణ: రామా ప్రచురణలు, విశాఖపట్నం ; ప్రతులకు : నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్, ప్రజాశక్తి, విశాలాంధ్ర బుక్ హౌస్ అన్ని బ్రాంచీలు.





**మౌన సవ్వడి :** కవిత్వం రచన:డా॥ మక్కెన శ్రీను పుటలు:88, వెల:రు60/- ప్రచురణ:కిషోర్ గ్రాఫిక్స్, గుణదల, విజయవాడ -4, ప్రతులకు : అన్ని పుస్తక విక్రయ కేంద్రాలు; సెల్ : 98852 19712, 98486 31147

**మట్టిపూల గాలి - 4 :** 'స్వేచ్ఛ' కవిత్వం పుటలు: 104, వెల: రు.65/- ప్రతులకు: సహచర బుక్‌మార్క్, హెచ్ ఐ జి (ఒజి) బ్లాక్ 5, షాప్ నెం. 29, సుందరయ్యపార్కు దగ్గర, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్ 500 044, సెల్ : 98483 48173



**పాఠశాల విద్యలో మాతృభాషే మాధ్యమంగా ఉండాలి**

జాతీయసదస్సు

# 2018 మార్చి 7, 8 తేదీలలో కుప్పంలో జరిగిన తెలుగు భాషా శాస్త్రజ్ఞుల వేదిక 9 వ జాతీయ సదస్సు




ఉపన్యసిస్తున్న ఎన్.కనకరత్నం, డీన్, మానవీయ శాస్త్ర విభాగం; ఆచార్య గణేశన్ అంబేద్కర్, అధ్యక్షుడు, ద్రావిడ, సంగణక భాషా శాస్త్ర విభాగం; మ.స.హయత్, ప్రధాన కార్యదర్శి, తె.భా.శా. వేదిక; ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు, ఉపాధ్యక్షుడు, తె.భా.శా. వేదిక; ఆచార్య ఈ.సత్య నారాయణ, ఉపకులపతి, ద్రావిడ విశ్వ విద్యాలయం; డా.పి.పళనిస్వామి, ఉప సంచాలకులు, భారతీయ భాషల కేంద్రీయ సంస్థ.

తెలుగు భాషావేత్తల వేదిక, హైదరాబాదు, భారతీయ భాషల కేంద్రీయ సంస్థ, మైసూరు (సిఐఐఎల్, మైసూరు) మరియు ద్రావిడ విశ్వవిద్యాలయాల సంయుక్త ఆధ్వర్యంలో '9వ జాతీయ తెలుగు భాషావేత్తల సదస్సును మార్చి 07-08, 2018 తారీఖులలో ద్రావిడ విశ్వ విద్యాలయంలో - ద్రావిడ మరియు సంగణక భాషా శాస్త్ర విభాగం నిర్వహించింది.

శాఖాధ్యక్షులు ఆచార్య గనేశన్ అంబేద్కర్ అతిధులను స్వాగతిం చారు. సదస్సు ముఖ్యోద్దేశ్యం గురించి సదస్సు సంచాలకులు డా॥ ఎం.సి. కేశవమూర్తిగారు తెలపడంతో సభ మొదలయ్యింది. ఈ సదస్సు కీలకో పన్యాస కర్తగా విచ్చేసిన ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావుగారు మాట్లాడుతూ, **తెలుగు రాష్ట్రాల్లో భాషాసంక్షోభం** పై విపులంగా చర్చించారు. స్థూల జాతీయ ఉత్పత్తిలో ప్రధాన పాత్ర పోషిస్తున్న ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యమివ్వాలని, విద్యా మాధ్యమంగా, అధికార భాషగా తెలుగు ప్రబలంగా కనిపించాల్సిన ఆవశ్యకతను పవర్ పాయింట్ ద్వారా వివిధ గణాంకాలను ప్రదర్శించారు.

ఈ సభకు ద్రావిడ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఈడిగ సత్యనారాయణ గారు అధ్యక్షతవహించి దేశ భాషలలో తెలుగు ప్రాము ఖ్యాన్ని గుర్తుచేశారు. తె.భా.వే. అధ్యక్షురాలు ఆచార్య ఎ.ఉషాదేవి గారు అనివార్య కారణాలవల్ల రాలేకపోయినందుకు వారి అధ్యక్ష ఉపన్యాసాన్ని తె.బా.వే. కార్యదర్శి ఆచార్య ఎం.ఎస్. హయత్‌గారు చదివి వినిపించారు.

ఈ సమావేశంలో ద్రావిడ విశ్వవిద్యాలయంలోని మానవీయ శాస్త్రాల డీన్ ఆచార్య ఎన్.కనకరత్నంగారు మాట్లాడుతూ ద్రావిడ భాషలకన్నిటికీ కలిపి ఒక లిపి ఉంటే బాగుండేదని అన్నారు. డా॥ ఎం. ప్రసాద్ నాయక్ వందన సమర్పణ చేశారు.

ఈ రెండు రోజుల సదస్సులో 32 పత్ర సమర్పణలు జరిగాయి. వాటిలో తెలుగు - సాంకేతికత, లిపి సంస్కరణలు, అనువాదాలు, (మాతృ) భాషా బోధన, పత్రికా భాషా ప్రయోగాలు, కావ్యభాషా ప్రయోగాలు, భాషా శాస్త్ర పత్రాలు, తెలుగు మాండలికాలు, నిఘంటు నిర్మాణంలో సమకాలీన సమస్యలు వంటి వివిధ అంశాలపై చక్కటి చర్చలు జరగటం గమనార్హం. పత్ర సమర్పకులు వివిధ ప్రాంతాల (హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం, బనారస్ హిందూ విశ్వవిద్యాలయం, ఇందిరా గాంధి జాతీయ గిరిజన విశ్వవిద్యాలయం, వ్యవసాయ విశ్వవిద్యాలయం బెంగళూరు, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, మైసూరు, తెలుగు రాష్ట్రాల్లోని వివిధ కళాశాలలు) నుండి వచ్చి వారివారి పరిశోధక పత్రాలు సమర్పించారు.

సమాపకోత్సవంలో బాగంగా సభాధ్యక్షులుగా ద్రావిడ విశ్వ విద్యాలయ రెక్టార్ ఆచార్య జి.బాలసుబ్రమణియన్ ద్రావిడ విశ్వ విద్యాలయ కులసచివులు ఆచార్య బి.తిరుపతిరావుగారు, ద్రావిడ విశ్వవిద్యాలయ విద్యావిషయక డీన్, ఆచార్య ఎస్.పెంచలయ్యగారు వారివారి ఉపన్యాసంలో తమ శాఖ పరిశోధనలు మరియు సదస్సు ప్రాముఖ్యాన్ని చక్కగా ప్రస్తావించారు. సమాపకోపన్యాసకులు తె.బా.వే. కార్యదర్శి ఆచార్య ఎం.ఎస్. హయత్‌గారు దక్కని ఉర్దూ - తెలుగు సంబంధాలపై వారి పరిశోధనలను వినిపించారు. అనంతరం సదస్సు సంచాలకులు డా॥ ఎం.సి. కేశవ మూర్తిగారి వందన సమర్పణతో సదస్సు విజయవంతంగా ముగిసింది.

ఈ సదస్సుకు విద్యావిషయక మరియు విత్త విషయక సహాయ సహకారాలందించిన సిఐఐఎల్, మైసూరు వారికి, ద్రావిడ విశ్వ విద్యాలయం వారికి మరియు ఈ సదస్సు, ద్రావిడ మరియు సంగణక భాషా శాస్త్ర విభాగం నందు జరిపే అవకాశం కల్పించి అన్ని సహాయ సహకారాలందించినందుకు తె.భా.వే. కార్యవర్గానికి మా ప్రత్యేక ధన్యవాదాలు.

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

## చెన్నై (2015), ఢిల్లీ (2016)...మూడో అడుగు 21-2-2018న-బెంగుళూరులో

# భారతీయ భాషల ప్రతినిధుల బెంగళూరు ప్రకటన




## తీర్మానాలు

1. భారతదేశరాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో చేర్చేందుకు కేంద్ర ప్రభుత్వానికి విన్నపాలు పెట్టుకున్న భాషలను అన్నిటినీ ఒక కాలపరిమితిలోగా అలాంటి గుర్తింపునివ్వాలి. భారత ప్రభుత్వం, ఎనిమిదవ షెడ్యూల్లో గుర్తించేందుకు వీలుగా భాషలకోసం సమగ్రమైన ఒక పారదర్శక విధానంతో ముందుకు రావాలి.

2. భారతప్రభుత్వం, భారతరాజ్యాంగపు ఎనిమిదవ షెడ్యూలులోని అన్నిభాషలనూ సమాన హోదాకలిగిన అధికారభాషలుగా ప్రకటించాలి.

3. ఆయా రాష్ట్రాలలోని స్థానిక భాషలను ప్రాథమిక విద్యా మాధ్యమాలుగా ప్రకటించాలి. రాష్ట్రాలలోని అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేటు విద్యాసంస్థలలో ఉన్నత విద్యలో విద్యా మాధ్యమాలుగా రాష్ట్రాల స్థానిక భాష (ల) విస్తరణ కోసం ప్రభుత్వ నిధులతో మద్దతునిచ్చి ప్రోత్సహించాలి.

4. ఆయా రాష్ట్రాలలోని స్థానిక భాషలను ఆ రాష్ట్రాలలోని ప్రతి పాఠశాలలోనూ తప్పనిసరి అధ్యయనం విషయంగా ప్రకటించాలి.

5. కేంద్ర ప్రభుత్వం యొక్క అన్ని రకాల విద్యాసంస్థలలో ప్రవేశానికి ప్రవేశ పరీక్షలూ ఇంటర్వ్యూలూఎనిమిదవ షెడ్యూల్లోని అన్ని భాషలలోనూ ఉండాలి.

6. కేంద్ర ప్రభుత్వంలోని అన్ని రకాల ఉద్యోగ ఉపాధి నియామ కాలకూ జరిపే రాత పరీక్షలూ మౌఖిక పరీక్షలూఎనిమిదవ షెడ్యూల్లోని అన్ని భాషలలోనూ ఉండాలి. భారతీయ భాష ప్రావీణ్యం ఉద్యోగానికి తప్పనిసరి అర్హతగా నిర్ణయించాలి.

7. యూనియన్ ప్రభుత్వం తగిన యంత్రాంగాల ద్వారా అన్ని భాషలకూ సమాన ప్రోత్సాహమూ సరైన ప్రోత్సాహకాలనూ అందించాలి.

8. ఎనిమిదవ షెడ్యూల్లో చేర్చని భాషలను అభివృద్ధిపరచడానికీ భద్రపరచడానికీ అవసరమైన అన్ని రకాల కనీస అవసరాలను అందించాలి.

9. రాష్ట్రాలలోని అన్ని ప్రభుత్వ, ప్రభుత్వ సహాయాన్ని పొందే సంస్థల అంతర్గత కార్యకలాపాలూ అధికారిక కార్యక్రమాలను ఆయా రాష్ట్రాలలోని స్థానిక భాషలలో నిర్వహించాలి.

10. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలూ, ప్రభుత్వ రంగ సంస్థలూ, ప్రైవేటు సంస్థలచే ఏర్పడిన స్వయంప్రతిపత్తిగల సంస్థలూ, అవి అందించే అన్ని రకాల సమాచార సేవలనూ తప్పనిసరిగా స్థానిక భాషలలోపొందే విధంగా, చట్టాలు చేయాలి.

11. ఉన్నతన్యాయస్థాన అధికార పరిధిలోకి వచ్చేటటువంటి రాష్ట్రాల అధికారిక భాషలను అన్ని వ్యవహారాలకూ లావాదేవీలకూ ఆ కోర్టు అధికారిక భాషలుగా చేర్చాలి.

12. అంతర్జాతీయంగా గుర్తించబడిన భాషా ప్రమాణాలకులోబడి శాస్త్రీయ సూత్రాల ఆధారంగా భారత ప్రభుత్వం భాషలను నిర్వచించాలి.

13. ప్రభుత్వ జోక్యంలేనివిధంగా ఏ లిపి లేదా లిపులను ఉపయోగించాలనే నిర్ణయాధికారం ఆభాషాసమూహానికి మాత్రమే ఉందని గుర్తించాలి.

14. రాష్ట్ర ప్రభుత్వాలు రాష్ట్ర ప్రాధికార భాషా సంస్థలను స్థాపించి స్థానిక భాషలకు సాధికారతను కల్పించాల్సిన అవసరం ఉంది, ఒకవేళ అవి లేని చోట ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు భాషా విధానాన్ని అమలు చేసేందుకు చట్టపరమైన విధానాలను రూపొందించాలి.

15. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంతరించిపోతున్న భాషలను పరిరక్షించడానికి ప్రజా నిధుల ద్వారా తక్షణ చర్యలు చేపట్టాలి.

16. భారత ప్రభుత్వమూ దాని ప్రాతినిధ్య సంస్థలూ విద్యా రంగంలో అన్ని భాషలనూ సమానంగా ప్రోత్సహించేందుకు కృషిచేయాలి.

తీర్మానాల పత్రంపై సంతకం పెట్టిన ‘భాషాసమానత్వ హక్కుల ప్రచార సంస్థ’ (CLEAR) ప్రతినిధులు పైన పేర్కొన్న అన్ని తీర్మానాలనూ వాస్తవం చేసేందుకు బాధ్యతతో పనిచేయడానికీ ప్రతి స్థాయిలోనూ పరిష్కారాలను కనుగొనేందుకూ నిర్ణయించుకున్నారు. పై లక్ష్యాలను సాధించడానికి, అవసరమైనప్పుడల్లా భాషాసమానత్వ హక్కుల సాధనకు అవసరమైన మార్గనిర్దేశానికీ ఇతరత్రా సహాయం కోసం ఈ సంస్థ తయారుగా ఉంటుంది.

(వార్త వివరంగా లోపలి పుటలలో)

అమ్మనుడి (తెలుగుజాతి పత్రిక)
AMMANUDI (Telugu Monthly)
April 2018 Vol. 4, Issue 2

Date of publication : 1st of every month
Date of posting : 3rd&6th of every month

RNI-APTEL/2015/62362
Postal Reg. NO.TEN\13\2018-20

Bommidala International







# బొమ్మిడాల ఇంటర్నేషనల్ ప్రై.లిమిటెడ్

భారత ప్రభుత్వ గుర్తింపు పొందిన ఎగుమతి సంస్థ

బి.టి.సి.హౌస్, ఐదవ వీధి
చంద్రమౌళినగర్, గుంటూరు-522 007

Tel :91-863-2357615, 2357616
Fax : 91-863-2351343
E mail : murtybsk@bommidalainternational.com
bskmurty@yahoo.co.in
Website : www.bommidalainternational.com

If not delivered, please return to : 'The publisher, AMMANUDI monthly,
8-386, Jivaka bhavanam, ANGALAKUDURU (po), TENALI- 522 211, Guntur (dt) A.P. Cell: 9440 448244